సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 358

మంగళవారం 19-3-2024



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



అమ్మాయిలను కాపాడుకుందాం...

-IIలో



కరువును తట్టుకున్న పంటలు!

-IIలో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
ఫ్యామిలీ
కరీంనగర్
మంగళవారం ॥ 19-3-2024

గ్రామీణ మహిళలను నిత్యం కలుస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తూ పరిష్కారాలను సూచిస్తూ మహిళా రైతుల అభివృద్ధికి చేయూతనిస్తున్నారు **డాక్టర్ రుక్మిణీ రావు.** ఏళ్ల తరబడి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు ఆమె. దెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్‌గానూ, వందకు పైగా మహిళా రైతు సంఘాలతో కూడిన జాతీయవేదిక మకాం సహ వ్యవస్థాపకులుగానూ ఉన్నారు. నారీ శక్తి పురస్కార గ్రహీత, హైదరాబాద్ వాసి, సామాజిక కార్యకర్త రుక్మిణీరావుతో మాట్లాడినప్పుడు స్త్రీ సంక్షేమానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను ఆమె ఇలా మనముందుంచారు.



అమ్మాయిలను కాపాడుకుందాం...

''ఒక మార్గాన్ని ఎంచుకున్నప్పుడు ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా, ఆపకూడదు, ఆగకూడదు. ఈ రోజుల్లో మన అమ్మాయిలను కాపాడుకోవాల్సిన అవసరం చాలా ఉంది. మేం తెలంగాణలోని నల్లగొండ జిల్లాలో 50 గ్రామాల్లోని 8 నుంచి 17 ఏళ్ల వయసు లోపు అమ్మాయిల సంక్షేమానికి గ్రామ్య రిసోర్స్ సెంటర్‌లో భాగంగా వర్క్ చేస్తున్నాం. మహిళల సంక్షేమానికి కృషి చేద్దామని చేసిన ప్రయత్నంలో ఎన్నో సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇటీవల 15-16 ఏళ్ల లోపు అమ్మాయిలు తెలిసిన, తెలియని అబ్బాయిల మాటలు నమ్మి ఇల్లు వదిలి వెళ్లిన ఘటనలను ఎక్కువ చూస్తున్నాం. దీంతో స్కూల్ నుంచి డ్రాపౌట్ అయిన వాళ్లకు, ఇల్లు వదిలి బయటకు వెళ్లిన వాళ్లను తిరిగి వచ్చేలా, కౌన్సెలింగ్స్ చేస్తున్నాం. ఇద్దరు చిన్నపిల్లలను వారి తల్లిదండ్రులు అమ్మడం గురించి తెలిసి మా స్నేహితురాలు జమునతో కలిసి నేనూ అక్కడకు వెళ్లాను. ఆ అమ్మకం కార్యక్రమాన్ని అడ్డుకుని, వారికి సహాయం చేయాలనుకున్నప్పుడు 'గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్'ని ప్రారంభించాం. ఈ సంస్థకు 30 ఏళ్లు పూర్తయ్యాయి. ఆరు మండలాల్లో దాదాపు 800 మంది మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపరచుకోవడానికి, ఆడపిల్లల పట్ల వారి వైఖరిని పునరాలోచించడానికి వర్క్ చేస్తున్నాం. ఏళ్లుగా ఆడ శిశు హత్యలతో పాటు అంతర్జాతీయ దత్తత ద్వారా కూడా ఆడపిల్లల అక్రమ రవాణాకు విస్తృతమైన నెట్‌వర్క్ ఉందని కనుక్కొన్నాం. ప్రచార పద్ధతిలో పని చేస్తూ, అనేక అక్రమ దత్తత కేంద్రాలను మూసివేయించాం.

వివక్ష లేని చోట పెంపకం

నా చిన్నతనంలో మా అమ్మమ్మ, అమ్మ, అత్తల మధ్య పెరిగాను. ఆ విధంగా ఇంటిని నడిపే సమర్థ మహిళల గురించి నాకు తెలుసు. మా ఇంట్లో అబ్బాయిలు, అమ్మాయిలు అనే వివక్ష ఉండేది కాదు. నేను బాగా చదువుకోవాలన్నది అమ్మ ఆలోచన. ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కాలేజ్ నుండి సైకాలజీలో మాస్టర్స్ పూర్తి చేశాను. చదువు చెప్పాలనే ఆలోచనతో హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో టీచింగ్ చేశాను. ఆ తర్వాత ఢిల్లీలో సైకాలజీలో పీహెచ్‌డీ చేశాను. 1970 – 1980ల మధ్య వరకు ఢిల్లీలోని నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్‌లో కెరియర్ స్టార్ట్ చేశాను. అప్పుడే జీవితం ఒక మలుపు తీసుకుందనిపిస్తుంది. వరకట్న మరణాలు తీవ్ర సమస్యగా ఉన్న రోజులవి. ఇది సమాజానికే అనారోగ్యం అనిపించేది. మా స్నేహితులతో కలిసి ఎడతెగని చర్చలు జరిపేవాళ్లం. వరకట్న వ్యతిరేక ప్రదర్శనలలో విస్తృతంగా పాల్గొన్నాం. అప్పుడు 1981లో మహిళల కోసం 'సహేలీ రిసోర్స్' సెంటర్‌ను ఏర్పాటు చేశాం. అక్కణ్ణుంచి ఈ మార్గంలో ఏళ్లుగా ప్రయాణిస్తున్నాను. నాతో పాటు ఎన్నో అడుగులు తోడయ్యాయి. సేవా కార్యక్రమాలు చేసేవారితో నేనూ కలుస్తున్నాను.

సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా...

పదేళ్లక్రితం ఒక విషయం మమ్మల్ని కదిలించింది. కౌమార దశలో గ్రామాల్లో ఉన్న అమ్మాయిలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇచ్చారు. దానివల్ల వచ్చిన సైడ్ ఎఫెక్ట్స్ మీద ఎవరూ దృష్టి పెట్టలేదు. అక్కడ ఆ అమ్మాయిలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారో మేం స్వయంగా చూశాం. దీంతో ఇది సరైన పద్ధతి కాదని మా ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి సుప్రీం కోర్టులో కేసు వేశాం. విదేశాలలో ఒక వ్యాక్సిన్ గురించి నిర్ణయం తీసుకుంటే వాళ్లు సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. అలాంటిది మన దగ్గర లేదు. ఇప్పుడు వ్యాక్సిన్ ఖరీదు తగ్గిందన్నారు. వ్యాక్సిన్ వేయాలంటున్నారు. డాక్టర్లు చెప్పిన ఆలోచన కూడా బాగుంది. అయితే, ఆ తర్వాత వచ్చే సమస్యల పైన కూడా దృష్టి పెట్టమని, మెడికల్ సిస్టమ్‌ను కరెక్ట్ చేయమని ప్రభుత్వాలను కోరుతున్నాం. అప్పుడే, ఈ డ్రైవ్‌ను ముందుకు తీసుకెళితే బాగుంటుంది'' అని తన అభిప్రాయలను వెలిబుచ్చారు రుక్మిణీరావు.

– నిర్మలా రెడ్డి

ఫొటో: అనిల్ కుమార్ మోర్ల

గ్రామీణ మహిళలతో కలిసి...

1989లో ఢిల్లీ నుంచి తిరిగి హైదరాబాద్‌కు వచ్చేశాను. పుట్టిపెరిగిన ప్రాంతం, పరిచయమున్న సాంస్కృతిక నేపథ్యంలో సమర్థంగా పని చేయగలనని భావించాను. న్యాయం కోసం కోర్టులకు వచ్చే మధ్యతరగతి మహిళలకు సహాయం చేయడం ప్రారంభించాం. వారి స్థితి చూశాక ఇంకా ఎంతో చేయాల్సింది ఉందనిపించింది. అక్కణ్ణుంచి గ్రామీణ మహిళల సంక్షేమానికి శ్రద్ధ వహించాల్సిన అవసరం గుర్తించి అటువైపుగా అడుగులు వేశాం. 30 ఏళ్లుగా మహిళా రైతుల హక్కులను ప్రోత్సహించడానికి డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీతో కలిసి పనిచేస్తున్నాను. సంస్థలో మహిళా నాయకత్వాన్ని అభివృద్ధి చేయడం, వర్క్‌షాప్‌ల నిర్వహణ ముఖ్యంగా తీసుకున్నాను. సొసైటీలో డైరెక్టర్, బోర్డ్ మెంబర్‌గా ఉన్నాను. ఇవి కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న మహిళా రైతులతో 'మకాం' అనే వేదిక ద్వారా విస్తృత కార్యక్రమాలు చేస్తున్నాం. రైతు అనగానే ట్రాక్టర్ పైన మగవాళ్లు ఉండటమే కనిపిస్తుంది. కానీ, ఇప్పుడు ఆడవాళ్లు కూడా ట్రాక్టర్లు నడపడం, వ్యవసాయం, ఆహార ఉత్పత్తుల తయారీలో అగ్రభాగాన ఉండేలా కృషి చేస్తున్నాం. ఒంటరి మహిళల కోసం సమాఖ్యను ఏర్పాటు చేశాం. ఇందులో సంఘాలున్నాయి. తెలంగాణలోని 10 జిల్లాల నుంచి కో ఆర్డినేషన్ చేస్తున్నాం. లెప్రసీ వ్యాధి అనేది దాదాపుగా కనుమరుగైందని అంతా అనుకుంటున్నారు. కానీ, లెప్రసీతో బాధపడుతున్న వారిని మేం గుర్తించాం. ఈ వ్యాధి ముదరకుండా ముందస్తు నివారణకు సాయం అందిస్తున్నాం.

న్యూస్‌మేకర్

ఆరు భాషలు నిలబెట్టాయి

భాష విజయానికి సాధనం. రాజకీయాల్లో భాషతో ఆకర్షించేవారు వేగంగా పైమెట్టు మీదకు చేరుతారు. అయితే ఆ రంగంలో బహుభాషలతో ఆకట్టుకునే మహిళలు తక్కువ. కాని సామాన్య టీచరైన ఎం.ఎల్.అశ్విని తనకు వచ్చిన ఆరు భాషల వల్ల జన సామాన్యంలో చొచ్చుకుపోతూ బిజెపి అధినాయకత్వాన్ని మెప్పించింది. కేరళలో మహామహులు పోటీపడిన కాసర్‌గోడ్ పార్లమెంట్ స్థానానికి పార్టీ ఆమెను నిలబెట్టింది. అశ్విని పరిచయం.



రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం బిజెపి విడుదల చేసిన కేరళ అభ్యర్థుల్లో కాసరగోడ్ అభ్యర్థి పేరు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ అభ్యర్థి పూర్వాశ్రమంలో ఒక మామూలు స్కూల్ టీచర్. ఆ తర్వాత ఆమె ఉంటున్న ఊరు మంజేశ్వరకు కేవలం బ్లాక్ పంచాయతీ మెంబర్. పార్టీలో కేవలం మహిళా మోర్చా జాతీయస్థాయి సభ్యురాలు. అయినా సరే ఆమెకే పార్టీ అధిష్టానం సీటు ఇచ్చింది. దానికి కారణం ఆమెకు తెలిసిన ఆరు భాషలు. మలయాళం, కన్నడం, తమిళం, తుళు, హిందీ, ఇంగ్లిష్. ఆమె పేరు ఎం.ఎల్.అశ్విని.

భాషతో గెలిచింది

కాసరగోడ మంగుళూరుకు దగ్గరగా ఉంటుంది. కన్నడిగులు కూడా ఇక్కడ ఉంటారు. బెంగళూరులో పుట్టి పెరిగిన ఎం.ఎల్.అశ్విని కాసరగోడకు కోడలుగా వచ్చింది. 'బెంగళూరు మెట్రోపాలిటన్ సిటీ. అన్నిభాషల వారూ ఉంటారు. నాకు భాషలు నేర్చుకోవడం ఇష్టం. చిన్నప్పుడే ఇంగ్లిష్ మీద పట్టు వచ్చింది. కన్నడ నా మాతృభాష. నా చుట్టుపక్కల తుళు కుటుంబాలు ఉండేవి. వారి నుంచి తుళు నేర్చుకున్నాను. తమిళం కూడా బెంగళూరులోనే నేర్చుకున్నాను. కాసరగోడ వచ్చాక మలయాళం చాలా సులువుగా నేర్చుకున్నాను. హిందీ బాగా తెలుసు. ఇలా ఆరు భాషల్లో నేను అనర్గళంగా మాట్లాడగలను' అంటుందామె. ఇంట్లో కూడా ఆమె తన భాషలను సాధన చేస్తానని చెప్పింది. 'నేను నా భర్తతో తుళులో మాట్లాడతాను. నా భర్త, కొడుకు మలయాళంలో మాట్లాడుకుంటారు. మా అమ్మాయి నేను కన్నడంలో మాట్లాడుకుంటాం. ఇలా అన్ని భాషలు మా ఇంట్లో వినిపిస్తూనే ఉంటాయి' అంటుందామె. ఇన్ని భాషలు రావడం ఆమెకు మేలు చేసింది.

ఢిల్లీ వెళ్లాక

జాతీయ పార్టీలో ఢిల్లీలో కేంద్ర స్థానంలో ఉంటాయి. స్కూలు టీచర్ ఉద్యోగం మానేసి బి.జె.పిలో చేరాక ఆమెకు మహిళా మోర్చాలో నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పార్టీ స్థానం ఇచ్చింది. అంతే కాదు ఢిల్లీ కేంద్రంగా దాదాపు 10 రాష్ట్రాలలో మహిళా మోర్చా సభ్యులతో కార్యకలాపాలు బలపరచడానికి ఆమెకు బాధ్యత అప్పగించింది. 'ఢిల్లీలో జాతీయ స్థాయి నాయకులు హిందీ లోకాని, ఇంగ్లిష్‌లో కాని మాట్లాడటం సౌకర్యంగా భావిస్తారు. కేరళ నుంచి వచ్చిన నాయకులు మలయాళం లేదా తమిళం వంటి భాషలు అనర్గళంగా మాట్లాడతారుకాని ఇంగ్లిష్, హిందీ పూర్తిగా రావు. నాకు రావడం లాభించింది' అంటుంది అశ్విని. మహిళా మోర్చా తరఫున జమ్ము కశ్మీర్‌తో మొదలు ఉత్తరప్రదేశ్, అస్సాం వరకు ఆమె పని చేసినప్పుడు దిగువ శ్రేణి కార్యకర్తలతో వాళ్లకు తెలిసిన భాషల్లో మాట్లాడుతూ సులువుగా కలిసిపోవడం పార్టీ గమనించింది. కాసరగోడ్‌లో ఉన్న కన్నడ, మలయాళ, తమిళ భాషీయులతో ఆమె భాషలతో చొచ్చుకుపోవడం పార్టీ దృష్టికి వచ్చింది. అందుకే జిల్లా అధ్యక్షుడు రావిష్ తంత్రి, జాతీయ ప్రతినిధీ సీనియర్ నేత అయిన పి.కె.కృష్ణదాస్‌ను కాదని పార్టీ అశ్వినికి సీటు ఇచ్చింది.

భాష గొప్ప సాధనం:

'విజయానికి భాష గొప్ప సాధనం' అంటుంది అశ్విని. 'రాజకీయాలలో ప్రజలకు తెలిసిన భాషలో మంచి ఉపన్యాసం ఇవ్వగలిగిన వారికి ఎక్కువ ఆకర్షణ ఉంటుంది. నేను ఏ భాషలో అయినా మంచి ఉపన్యాసం ఇవ్వగలను. అందుకే నాకు ఈ అవకాశం దక్కింది. భాషలు ఎన్ని తెలిస్తే అంత మంచిది' అందామె.

2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాసరగోడ్‌లో బి.జె.పి మూడో స్థానంలో నిలిచింది. ఈసారి ఏమవుతుందో చూద్దాం.

సాగుబడి

ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 30 వరకు

కరువును తట్టుకున్న పంటలు!



● పొలంలో ఆదిలక్ష్మి


ఏపీ రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్‌ఎస్) మద్దతుతో ఆంధ్ర ప్రదేశ్ ప్రకృతి వ్యవసాయంలో ఒక సరికొత్త ప్రయోగం ప్రారంభమైంది. కరువును తట్టుకునే ప్రత్యేక పద్ధతి (డ్రాట్ ప్రూఫింగ్ మోడల్)లో పంటలు సాగు జరుగుతోంది. వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ, బీడు భూముల్లో కూడా ప్రత్యేక పద్ధతులను అనుసరిస్తూ ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని పలువురు చిన్న, సన్నకారు రైతులు నిరూపిస్తున్నారు. పొలం మొత్తాన్నీ దుక్కి చేయకుండా.. ప్రతి 3 అడుగుల దూరంలో ఒక అడుగు భూమిని తవ్వి 5 రకాల పంట విత్తనాలను విత్తుతున్నారు. 2023 ఆగస్టులో ప్రారంభమైన ఈ సరికొత్త పద్ధతిలో అనేక జిల్లాలకు చెందిన 56 మంది రైతులు 20 సెంట్ల నుంచి ఎకరా విస్తీర్ణంలో డ్రాట్ ప్రూఫ్ సాగు చేస్తున్నారు. ఇద్దరు రైతుల అనుభవాలతో కూడిన కథనం..

- ప్రకృతి వ్యవసాయంలో సరికొత్త ప్రయోగం
- బీడు భూములనూ సాగులోకి తెచ్చే వినూత్న పద్ధతి
- పొలం అంతా దున్నకుండా ప్రతి 3 అడుగులకు ఒక అడుగు విస్తీర్ణంలో తవ్వి 5 రకాల పంటల సాగు
- ఏపీ రైతు సాధికార సమితి ఆధ్వర్యంలో సాగు చేస్తున్న 56 మంది చిన్న, సన్నకారు రైతులు

కాలువ రాకపోయినా పంట వచ్చింది

రైతు ఆదిలక్ష్మి ఇలా చెప్పారు.. ''మాకు అరెకరం పొలం ఉంది. ఇక్కడ అందరూ మిరపే వేస్తారు. మేమూ మిరపే వేసేవాళ్లం. రెండేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. మిరపలో అంతరపంటలు కూడా సాగు చేశాం. సాగర్ కాలువ నుంచి ఇంజన్‌తో తోడుకొని తడి పెట్టేవాళ్లం. గత ఏడాది 7 క్వింటాళ్ల ఎండు మిరప పండింది. రూ. 50 వేల నికారాదాయం వచ్చింది. వర్షాలు లేక ఈ సంవత్సరం కాలువ ఒక్కసారే వచ్చింది. అందుకని మిరప వేయలేదు. ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకు.. కరువును తట్టుకొని పండే డ్రాట్ ప్రూఫ్ మోడల్‌లో పంటలు పెట్టాం. ఈ పంటలకు ముందు మేలో నవధాన్య (ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్) పంటలు చల్లాం. వర్షం లేక సరిగ్గా మొలవలేదు. మళ్లీ జూలైలో వేశాం. వర్షానికి మొలిచింది. పెరిగినాక కోసి, గొడ్లకు మేతగా వాడుకున్నాం. వరుసగా మూడేళ్లుగా నవధాన్య పంటలు వేయటం వల్ల ఉపయోగం ఏమిటంటే.. భూమి బాగా గుల్ల బారింది. నవధాన్య పంటలు వేయని పక్క పొలంలోకి వెళ్లి మట్టి చేత్తో తీయాలంటే చాలా కష్టపడాలి. మా పొలంలో సులువుగానే మట్టి తీయొచ్చు.

ప్రతి 3 అడుగులకు ఒక అడుగులో పంటలు



పొలం దున్నకుండానే, 3 అడుగులకు ఒక చోట అడుగు నేలను గుల్లగా తవ్వి, గత ఏడాది అక్టోబర్ 27న 5 రకాల విత్తనాలు నాటుకున్నాం. ప్రధాన పంటగా మధ్యలో ఆముదం లేదా కందిని నాటాం. దానికి నాలుగు వైపులా చిక్కుడు, అలసంద, అనుములు, సజ్జలు విత్తుకున్నాం. బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, విత్తన గుళికలు తయారు చేసుకొని నాటుకున్నాం. సీడ్ పెల్లటైజేషన్ చేయటం వల్ల భూమిలో విత్తుకున్న తర్వాత మొలక శాతం బాగుంటుంది. ఒకవేళ వర్షం రాకపోయినా లేదా మనం నీళ్లు పెట్టటం లేటైనా ఆ విత్తనం చెడిపోకుండా ఉంటుందని పెల్లటైజేషన్ చేశాం. విత్తనం పెట్టిన కొద్ది రోజులకు తుపాను వానకు విత్తనాలు మొలిచాయి. విత్తనం పెట్టేటప్పుడు అరెకరంలో 200 కిలోల ఘనజీవామృతం వేశాం. రెండుసార్లు ద్రవ జీవామృతం పిచికారీ చేశాం. తర్వాత మరో రెండు సార్లు వాన వచ్చింది. అదే వాన సరిపోయింది.

మిరపకు ఈ పంటలకు చాలా తేడా ఉంది. మిరపకు రెండు రోజులు నీరు లేకపోతే వడపడి పోయి ఎండిపోతుంది. డ్రాట్ ప్రూఫ్ మోడల్‌లో పంటలు అలా కాదు. నీరు లేకపోయినా చాలా వరకు జీవ కళ ఉంటుంది. అదీకాక, మేం చేసిన విత్తన గుళికలుగా చేసి వేసినందు వల్ల, భూమిలో వేసిన ఘనజీవామృతం వల్ల, ద్రవ జీవామృతం పిచికారీ వల్ల పంటలు ఎదిగాయి. ప్రధాన పంటతో పాటు పెట్టిన అనుములు, చిక్కుళ్ల వల్ల ఉపయోగం ఏమిటంటే.. ఈ తీగలు పాకి నేలపై ఎండపడకుండా కప్పి ఉంచి కాపాడటం, భూమిలో తేమ ఆరిపోకుండా కాపాడింది. సజ్జ ద్వారా రూ. 8,000లు వచ్చాయి. సజ్జ ఇంకా తీయాల్సి ఉంది. చిక్కుళ్ల,సొర కాయలు, దోసకాయల ద్వారా మరో ఆరేడు వేలు ఆదాయం వచ్చింది. సజ్జ బాగా పెరగటంతో నీరు లేక కంది సరిగ్గా ఎదగలేదు.

ఇప్పటికి అన్నీ కలిపి రూ. 15 వేల వరకు ఆదాయం వచ్చింది. ఇంకా ఆముదాలు ఒక బస్తా వరకు వస్తాయి. పనులు మేమే చేసుకుంటాం. ఖాళీ ఉన్న రోజుల్లో కూలికి వెళ్తాం. బెట్టను తట్టుకొని పంట పండించుకోవచ్చని, ఎంతో కొంత దిగుబడి వస్తుందని నాకైతే నమ్మకం కుదిరింది..''

– ఎం. ఆదిలక్ష్మి (8309118867), ఈపూరు, పల్నాడు జిల్లా

బీడులోనూ పంటలు..

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప ట్రాళ్ళ గ్రామానికి చెందిన రంగస్వామి బిఎస్సీ బీఈడీ చదువుకొని తమ రెండెకరాల్లో ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఒక ఎకరంలో సపోట, మామిడి చెట్లు ఉన్నాయి. మరో ఎకరంలో టొమాటో, మిర్చి, వంగ, గోరుచిక్కుడు పంటలను బోరు నీటితో సాగు చేశారు. రెండో పంటగా వేరుశనగ, కంది, ముల్లంగి తదితర పంటలు వేశారు. రెండెకరాల్లో సగటున ఏడాదికి రూ. లక్షా 70 వేల వరకు నికరాదాయం పొందుతున్నట్లు తెలిపారు. సపోట, మామిడి తోటలో మూడు ఏళ్లగా దుక్కి చేయని 30 సెంట్ల విస్తీర్ణంలో డ్రాట్ ప్రూఫింగ్ మోడల్‌లో 2023 డిసెంబర్‌లో ప్రయోగాత్మకంగా సజ్జ, గోరు చిక్కుడు, అనుములు , అలసంద, కంది, ఆముదం పంటలను సాగు చేశారు. 3 అడుగుల దూరంలో ఒక అడుగు విస్తీర్ణంలో తవ్వి, ఘనజీవామృతం వేసి విత్తనాలు విత్తారు. మామిడి ఆకులతో ఆచ్ఛాదన చేశారు. వారానికోసారి బక్కెట్లతో పాదికి 2,3 లీటర్ల నీరు పోశారు. మూడు నెలల వ్యవధిలో అలసంద, అనుములు అమ్మితే రూ. 2 వేల దాకా ఆదాయం వచ్చింది. పశుగ్రాసం రూపంలో మరో రూ. 3 వేల ఆదాయం వచ్చింది. రూ. 2 వేల గోరుచిక్కుళ్లు పండాయి. తమ ఇంటి కోసం, బంధువులకు వినియోగించారు. సజ్జ పక్షులు తిన్నాయి. కంది, ఆముదం పంటలు కోయాల్సి ఉంది. పంటలకు నీరు పోస్తున్నందున మొక్కల మధ్యన 3 అడుగుల ఖాళీలో గడ్డి పెరుగుతోంది. ఆ గడ్డిని కోసి ఆవులు, గేదెలకు వేస్తున్నారు. డ్రాట్ ప్రూఫింగ్ మోడల్ పంటలతో వదిలేసిన భూమిని దుక్కి చేయకుండానే.. పంటలు పెట్టుకునే చోట తవ్వి విత్తనాలు పెట్టుకొని తిరిగి సాగులోకి తెచ్చుకోవచ్చని, ఎంతో కొంత పంట దిగుబడి తీసుకోవచ్చని రంగస్వామి అంటున్నారు.

ప్రకృతి వ్యవసాయం వల్ల రంగస్వామి పొలంలో వానపాముల సంఖ్య పెరిగింది. నేల గుల్లబారి మృదువుగా తయారవడంతో వర్షాలు తగ్గినా పంట పెరగుదల బాగా కనిపిస్తోంది. రంగస్వామి ప్రకృతి వ్యవసాయం చూసి రంగస్వామి (88869 60609) తండ్రి కూడా ప్రకృతి వ్యవసాయం చేపట్టడం విశేషం.



● రంగస్వామి

పాలేకర్ ఫుడ్ ఫారెస్ట్‌లో ఎకరానికి రూ. 6 లక్షల ఆదాయం!



పాలేకర్ ఫుడ్ ఫారెస్ట్ ఐదు అంచెల పంటల సాగు నమూనాతో ఎకరానికి ఏటా రూ. 6 లక్షల ఆదాయం సమకూరుతుందని పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. సుభాష్ పాలేకర్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. గుజరాత్‌లో ఫైవ్ లేయర్ ఫుడ్ ఫారెస్ట్‌లు తన టెక్నాలజీకి నిదర్శనంగా నిలిచాయని, తొలి ఏడాదే రూ. 2 లక్షలు, ఆరో ఏడాది నుంచి రూ. 6 లక్షల ఆదాయం సమకూరుతోందన్నారు. ఆసక్తిగల రైతులు గుజరాత్ వస్తే తానే స్వయంగా చూపిస్తానన్నారు. ఈ నెల 29,30,31 తేదీల్లో అహ్మదాబాద్‌కు 151 కి.మీ. దరంలోని పాలియాడ్ (బోటాడ్ జిల్లా)లోని శ్రీ విషమన్ బాపు ప్యాలెస్ మందిర్‌లో (ఆంగ్లం/ హిందీ) రైతు శిక్షణా శిబిరంలో పాల్గొనే వారికి ఈ ఫుడ్ ఫారెస్ట్‌లను స్వయంగా చూపిస్తానన్నారు. 3 రోజులకు ఫీజు రూ.700. ఇతర వివరాలకు.. ఘనశ్యాం భాయ్ వాల- 63550 77257, కశ్యప్ భాయ్‌చౌహాన్- 85303 13211.

పుట్టగొడుగుల సాగుపై 26 రోజుల ఉచిత శిక్షణ

ఇంటర్/డిప్లొమా దశలో చదువు మధ్యలో ఆపేసిన గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం, 'ఆస్కి' సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు పుట్టగొడుగుల పెంపకంపై పూర్తిస్థాయి శిక్షణా శిబిరం జరగనుంది. హైదరాబాద్ (రాజేంద్రనగర్‌లోని పిజెటిఎస్ఎయు ఆవరణ) లోని విస్తరణ విద్యా సంస్థలో జరిగే ఈ శిబిరంలో పాల్గొనే వారికి బోధనతో పాటు భోజన, వసతి కూడా పూర్తిగా ఉచితం. చిన్న స్థాయి పుట్టగొడుగుల రైతుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని అంశాలపై నైపుణ్య శిక్షణ ఇస్తారు. 16 ఏళ్లు పైబడిన గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు అర్హులు. ఇంటర్ ఫస్టియర్ పాస్ లేదా టెన్త్ తర్వాత వ్యవసాయ/ అనుబంధ విభాగాల్లో 3 ఏళ్ల డిప్లొమా మొదటి ఏడాది పూర్తి చేసిన లేదా పదో తరగతి పాసైన తర్వాత కనీసం ఒక ఏడాది పుట్టగొడుగుల పెంపకంలో అనుభవం పొందిన వారు లేదా 8వ తరగతి పాసైన తర్వాత కనీసం 3 ఏళ్లుగా పుట్టగొడుగులు పెంపకం పని చేస్తున్న వారు.. ఈ ఉచిత శిక్షణకు అర్హులు. విద్యార్హత, కుల ధృవీకరణ, ఆధార్, ఫోటో తదితర వివరాలను పొందుపరుస్తూ ఆన్‌లైన్‌లో గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం ఈ క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేయండి. ఇతర వివరాలకు.. 040- 2405368, 98666 18107. eeihyd1962@gmail.com

22 నుంచి దేశీ వరి సాగు, నీటి సంరక్షణపై 'సేవ్' శిక్షణ

విశాఖపట్నం కృష్ణాపురంలోని సింహాచలం దేవస్థానం గోశాల (న్యూ)లో ఈ నెల 22 నుంచి 26 వరకు దేశీ వరి సాగుదారులు, దేశీ వరి బియ్యాన్ని సేకరించి ఆలయాల్లో నైవేద్యాల కోసం అందించే దాతలతో రైతుల ముఖాముఖి పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ సాధకులు, 'సేవ్' సంస్థ నిర్వాహకులు విజయరామ్ తెలిపారు. పాలేకర్ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశీ వరి రకాల సాగు, ఉద్యాన పంటల 5 లేయర్ సాగు, వాననీటి సంరక్షణకు ఇంకుడు గుంతల తవ్వకంపై రైతులకు శిక్షణ ఇస్తామన్నారు. పెళ్లిళ్లలో ఔషధ గుణాలు గల సంప్రదాయ వంటకాలు వడ్డించే ఆసక్తి గల వారికి ఆ వంటకాలను కూడా ఈ శిబిరంలో పరిచయం చేస్తామన్నారు. 'శబలా భోజన పండుగ' పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలన్నీ ఐదు రోజులూ జరుగుతాయని, ఆసక్తిగల వారు ఏదో ఒక రోజు హాజరైతే చాలని విజయరామ్ తెలిపారు. వివరాలకు.. సేవ్ కార్యాలయం 63091 11427, సురేంద్ర 99491 90769.

29 నుంచి సేవాగ్రామ్‌లో జాతీయ విత్తనోత్సవం

వాతావరణ మార్పుల్ని తట్టుకునే శక్తి దేశీ వంగడాలకే ఉందనే నినాదంతో ఈ నెల 29 నుంచి 31 వరకు మహారాష్ట్ర వార్ధా జిల్లా సేవాగ్రామ్‌లోని నాయ్ తాలిమ్ సమితి పరిసర్‌లో వార్షిక జాతీయ విత్తనోత్సవం జరగనుంది. దేశం నలుమూలల నుంచి అనేక పంటల దేశీ వంగడాల ప్రదర్శన, అమ్మకంతో పాటు సేంద్రియ రైతుల సదస్సులు, క్షేత్ర సందర్శనలు, నిపుణులతో ముఖాముఖి వంటి కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. రుసుము రూ. వెయ్యి. వివరాలకు.. యుగంధర ఖోడె – 91302 17662, ప్రతాప్ మరాడె – 75888 46544.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 358
మంగళవారం 19-3-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'


వైభవంగా లక్ష్మీ నారసింహుడి కల్యాణ మహోత్సవం..
- వివరాలు 5లో


బాండ్ల నంబర్లు ఏవి?
ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీరుపై సుప్రీంకోర్టు మరోసారి మండిపడింది.
- వివరాలు 6లో


ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా
ఢిల్లీ జలమండలి కేసులో విచారణకు హాజరు కావాలని ఈడీ సమన్లు జారీ చేయగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ గైర్హాజరయ్యారు.
- వివరాలు 6లో


..మూడో ప్రపంచ యుద్ధమే
రష్యా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మరుక్షణమే పుతిన్ పశ్చిమ దేశాలకు యుద్ధ హెచ్చరికలు పంపారు.
- వివరాలు 6లో


సోషల్ మీడియా నయా యుద్ధరంగం
ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీలు తమ విధానాలను జనంలోకి బలంగా తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా బాట పడుతున్నాయి.
- వివరాలు 6లో

దోపిడీ దొంగల్ని వదలం

తెలంగాణను దోచుకున్న వారెవరైనా సరే వదిలేది లేదు.. ఇది మోదీ ఇస్తున్న గ్యారంటీ

దేశ ప్రయోజనాల కోసమే పనిచేసే బీజేపీని ఆశీర్వదించండి.. జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రధాని పిలుపు

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ధ్వజం

రెండూ అవినీతి పార్టీలే.. ఇద్దరూ తోడు దొంగలే

ఒక దోపిడీదారు మరో దోపిడీదారుపై పోరాడలేరు

అందుకే బీఆర్ఎస్ దోపిడీపై కాంగ్రెస్ మౌనం వహిస్తోంది

కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారింది.. ఇక్కడి డబ్బును ఢిల్లీ పెద్దలకు పంపుతున్నారు

లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల పని అయిపోతుంది


జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ప్రతి స్కాం వెనుక కుటుంబ పార్టీలు..

➤ 'దేశంలో ఎక్కడ కుంభకోణం జరిగినా దాని వెనుక కుటుంబ పార్టీలే ఉన్నాయి. 2జీ స్పెక్ట్రమ్ (డీఎంకే), నేషనల్ హెరాల్డ్ (కాంగ్రెస్), బోఫోర్స్ (కాంగ్రెస్), కొలువుల స్కాం (ఆర్జేడీ) తదితరాలు ఇందుకు నిదర్శనం. తాజాగా ఆ జాబితాలో బీఆర్ఎస్ కూడా చేరింది. కుటుంబ పార్టీ బీఆర్ఎస్ కాళేశ్వరంలో అవినీతికి పాల్పడింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలోనూ బీఆర్ఎస్ నేతల పాత్ర ఉంది. కుటుంబ పార్టీలు దేశాన్ని దోచుకోవాలని చూస్తాయి. కానీ బీజేపీకి ప్రజా ప్రయోజనాలే ముఖ్యం. అందుకే, జూన్ 4న ఎన్డీయేకు 400 సీట్లు దాటాలి. బండి సంజయ్, ధర్మపురి అరవింద్, గోమాస శ్రీనివాస్‌లను గెలిపించాలి..' అని ప్రధాని విజ్ఞప్తి చేశారు.

సాక్షి ప్రతినిధి ,కరీంనగర్: 'తెలంగాణను దోచుకున్న వారెవరైనా సరే వదిలేది లేదు. ఇది నరేంద్ర మోదీ ఇస్తున్న గ్యారంటీ. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ అవినీతి పార్టీలే. ఇద్దరూ తోడు దొంగలే. కాబట్టి తెరవెనుక స్నేహాలతో పరస్పరం సహకరించుకుంటున్నాయి. తెలంగాణ కాంగ్రెస్‌కు ఏటీఎంలా మారింది. ఇక్కడి డబ్బును ఢిల్లీ పెద్దలకు పంపుతున్నారు. కుంభకోణాల కోసం పనిచేసే కుటుంబ పార్టీల్లా కాకుండా, దేశ ప్రయోజనాల కోసమే పనిచేసే బీజేపీని ఆశీర్వదించండి. అబ్‌కీ బార్.. 400 పార్. తెలంగాణ కోసం అనేక పనులు చేశాం, వచ్చే సర్కారులో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తాం..' అని ప్రధాని మోదీ చెప్పారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని గీతా విద్యాలయం మైదానంలో నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు.

శక్తి ఆశీర్వాదం ఎవరికో జూన్ 4న తెలుస్తుంది

'మే 13న తెలంగాణ ఓటర్లు సరికొత్త చరిత్ర సృష్టించనున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను బీజేపీ చిత్తు చేస్తుంది. తెలంగాణలో బీజేపీకి రోజురోజుకూ ఆదరణ పెరిగిపోతోంది. రాష్ట్రంలో ఇటీవల రూ.56 వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించాం. జూన్ 4న 400 ఎంపీ సీట్లు దాటేస్తాం అని దేశమంతా అంటోంది. వికసిత్ తెలంగాణ, వికసిత్ భారత్ కోసం, పేదల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, యువతకు అవకాశాలు, మహిళా అభివృద్ధి, ఆత్మ నిర్భర్ భారత్ కోసం, దేశం మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా అవతరించేందుకు.. ''400 ఎంపీ సీట్లు దాటాలి.. బీజేపీకి ఓటు వేయాలి'' (అని తెలుగులో పిలుపునిచ్చారు). తెలంగాణ ప్రజలు ''అబ్ కీ బార్.. చార్ సౌ పార్'' అని మిగతా 2వ పేజీలో ▶

'శక్తి' అంతమే విపక్షాల లక్ష్యం
రాహుల్ వ్యాఖ్యలపై మోదీ ధ్వజం

'శక్తి' వ్యాఖ్యలు మతపరమైనవి కావు
నా మాటల్ని మోదీ వక్రీకరించారు
రాహుల్ గాంధీ స్పష్టీకరణ
- వివరాలు 6లో

ఆప్ నేతలతో కలసి కవిత కుట్రపన్నారు!

- లిక్కర్ స్కాంలో ముడుపులు ఇవ్వడంలో ఆమెకు భాగస్వామ్యం
- ఈ కేసులో ఇప్పటివరకు రూ.128.79 కోట్ల సొమ్ము జప్తు చేశాం
- కేసుకు సంబంధించి ప్రకటన విడుదల చేసిన ఈడీ
- ఈడీ కార్యాలయంలో కవితతో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ
- అరెస్టును తప్పుపడుతూ సుప్రీంకోర్టులో కవిత పిటిషన్
- ఇంతకు ముందే దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణానికి సంబంధించి ఆప్ అగ్రనేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాలతో కలసి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కుట్రపన్నారని ఈడీ ఆరోపించింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఈడీ సోమవారం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 15న హైదరాబాద్‌లోని కవిత నివాసంలో సోదాలు చేశామని, అనంతరం అరెస్టు చేశామని తెలిపింది. సోదాల సమయంలో కవిత బంధువులు, సన్నిహితులు ఈడీ అధికారులను అడ్డుకున్నారని పేర్కొంది. ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో కవితను హాజరుపర్చగా.. ఏడు రోజులపాటు ఈడీ కస్టడీకి అనుమతించిందని వెల్లడించింది.

ముడుపులలో భాగస్వామ్యం..

ఢిల్లీ మద్యం విధానం రూపకల్పన, అమలులో కవిత, ఇతరులు ఆప్ అగ్రనేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలతో కలసి కుట్రపన్నారని తమ దర్యాప్తులో వెల్లడైందని ఈడీ తెలిపింది. అనుమతులకు బదులుగా ఆప్ నేతలకు రూ.100 కోట్లు ఇవ్వడంలో కవిత భాగస్వామ్యం ఉందని పేర్కొంది. ఢిల్లీ మద్యం విధానం 2021–22 రూపకల్పన, అమల్లో అవినీతి, కుట్రల ద్వారా టోకు వ్యాపారుల నుంచి కిక్‌బ్యాక్‌ల రూపంలో ఆప్‌కు నిరంతరం అక్రమ నిధులు మిగతా 3వ పేజీలో ▶

27నుంచి బస్సుయాత్ర

- ఇడుపులపాయ నుంచి వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార భేరి
- శ్రీకారం చుట్టనున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాల్లో మినహా మిగతా జిల్లాల్లో బస్సు యాత్ర
- 21 రోజులపాటు ఇచ్ఛాపురం వరకు కొనసాగింపు.. ప్రతి రోజూ ఒక జిల్లాలో ఉదయం వివిధ వర్గాల ప్రజలతో సమావేశం
- ప్రభుత్వ పనితీరు మరింత మెరుగవ్వడం కోసం వారి నుంచి సలహాలు, సూచనల స్వీకరణ..
- సాయంత్రం సభకు ఆ పార్లమెంట్ పరిధిలోని 7అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి తరలిరానున్న పార్టీ శ్రేణులు

5 లో



దానంను అనర్హుడిగా ప్రకటించండి


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

- స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- దానంను రేవంత్ ఎంతకు కొన్నారో చెప్పాలి: కౌశిక్‌రెడ్డి
- తాము గేట్లు తెరిస్తే కాంగ్రెస్ భూస్థాపితం అవుతుందని వ్యాఖ్య

- వివరాలు 2లో

గవర్నర్ రాజీనామా

- రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి ఇన్‌చార్జి లెఫ్టినెంట్ గవర్నర్ పదవులకు రాజీనామా చేసిన తమిళిసై సౌందరరాజన్
- భావోద్వేగాలతో తిరిగి వెళ్తున్నానని వ్యాఖ్య
- గవర్నర్‌గా 4 ఏళ్ల 6 నెలల 10 రోజులు పదవిలో..
- గత బీఆర్ఎస్ సర్కారుతో విభేదాలు, తరచూ వివాదాలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి ఇన్‌చార్జి లెఫ్టినెంట్ గవర్నర్ పదవులకు తమిళిసై సౌందరరాజన్ సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపించారు. గవర్నర్ రాజీనామా తక్షణమే వర్తిస్తుందని రాజ్‌భవన్ ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో రాష్ట్రానికి ఒకట్రెండు రోజుల్లో కొత్త గవర్నర్‌ను నియమించే అవకాశమున్నట్టు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్నారని.. ఈ క్రమంలోనే గవర్నర్ పదవికి తమిళిసై రాజీనామా చేశారని సమాచారం. తమిళిసై గతంలో ఉత్తర చెన్నై, తూత్తుకుడి నియోజకవర్గాల నుంచి బీజేపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు. ఈసారి తూత్తుకుడి నుంచి గానీ, తన సొంత జిల్లా కన్యాకుమారి నుంచి గానీ పోటీచేయవచ్చనే ప్రచారం జరుగుతోంది. చెన్నై సెంట్రల్ స్థానం నుంచి కూడా పోటీ చేయొచ్చనే వాదన వినిపిస్తోంది.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు..

తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్‌కు చెందిన తమిళిసై.. ఎంబీబీఎస్‌తోపాటు గైనకాలజీలో పీజీ చేశారు. చెన్నైలోని రామచంద్ర వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఏడేళ్లు పనిచేశారు. 2003లో ఆ వృత్తిని వదిలేసి పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి మిగతా 2వ పేజీలో ▶

మళ్లీ బీఆర్ఎస్‌లోకి క్యూ కట్టాల్సిందే..

- నాలుగేళ్ల తర్వాత 100 సీట్లతో పార్టీ అధికారంలోకి రావడం ఖాయం.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టీకరణ
- వంద రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత
- నీళ్లు, కరెంటు సరఫరా చేయలేని దుస్థితి
- బీఆర్ఎస్ ఓడిపోవడం వల్ల మంచే జరిగిందన్న కేసీఆర్
- గాడిద వెంబడి పోతేనే గుర్రం విలువ తెలుస్తుందని వ్యాఖ్య
- బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


ప్రవీణ్‌కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్

గజ్వేల్/సాక్షి, హైదరాబాద్: అధికారం కోల్పోగానే పార్టీ నుంచి వెళ్లిపోతున్న వారి గురించి ఆలోచించబోమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత పెరిగి, నాలుగేళ్ల తర్వాత తిరుగుబాటుగా మారి, బీఆర్ ఎస్ వంద సీట్లతో మళ్లీ అధికారాన్ని చేపట్టడం ఖాయమని అన్నారు. ప్రస్తుతం పార్టీ మారిన నేతలే తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు క్యూ కట్టాల్సిన పరిస్థితి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాంటి వాళ్లను చేర్చుకోవద్దని కొందరు సూచించగా స్పందించిన కేసీఆర్.. మీరంతా నాయకులుగా ఎదిగితే పార్టీ మారిన మిగతా 5వ పేజీలో ▶

సెలవుల్లోనే రోడ్‌షోలు

- అదీ రద్దీ ఉండని సమయాల్లోనే నిర్వహణకు అనుమతి
- కొత్త ఓటర్లు ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత 8.58 లక్షల ఓట్లు తొలగింపు
- పాతబస్తీలో బోగస్ ఓట్లపై విచారణ.. త్వరలో నివేదిక
- లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లపై సీఈఓ వికాస్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టే రోడ్‌షోలకు సెలవు రోజుల్లో, ట్రాఫిక్ రద్దీ తక్కువగా ఉండే వేళల్లో నిర్వహించేందుకు మాత్రమే అనుమతిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. ఇతర సమయాల్లో రోడ్‌షోలపై నిషేధం లేకున్నా, ప్రజలకు ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశంతో అనుమతి ఇవ్వబోమన్నారు. ఆస్పత్రులు, ట్రామాకేర్ సెంటర్లు, బ్లడ్‌బ్యాంకులున్న ప్రాంతాల్లో కూడా రోడ్‌షోలు చేపట్టవద్దని స్పష్టం చేశారు. సోమవారం తన కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను వికాస్‌రాజ్ మీడియాకు వివరించారు.

రెండున్నరేళ్లలో 30 లక్షల ఓట్లు తొలగింపు

గత డిసెంబర్‌లో రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికలు ముగిశాక రాష్ట్రంలో 12 లక్షల కొత్త ఓటర్లు నమోదవగా.. 8,58,491 ఓటర్లను తొలగించినట్టు వికాస్‌రాజ్ తెలిపారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో 30లక్షల ఓట్లను తొలగించామన్నారు. హైదరాబాద్ పాతబస్తీ పరిధిలో బోగస్ ఓట్లున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి విచారణ నిర్వహించారని, నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని చెప్పారు. బోగస్ ఓట్ల తొలగింపు మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

హైకోర్టుకు మరో ఇద్దరు న్యాయమూర్తులు


జస్టిస్ సుజోయ్ జస్టిస్ మౌషుమి

జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ మౌషుమి భట్టాచార్యలను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం చేసిన సిఫార్సులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది.
- వివరాలు 5లో

నేడు సీడబ్ల్యూసీ భేటీ



సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గెలుపు వ్యూహాలను సిద్ధం చేసేందుకు సీడబ్ల్యూసీ మంగళవారం భేటీ కానుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ భేటీకి మాజీ అధ్యక్షులు సోనియా, రాహుల్, కీలక నేతలు హాజరు కానున్నారు.
- వివరాలు 6లో

కాంగ్రెస్, లెఫ్ట్ పొత్తులపై సందిగ్ధత



కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే చాలా చోట్ల అభ్యర్థులను ప్రకటించినా వామపక్షాల్లో మాత్రం గందరగోళం నెలకొంది. కాంగ్రెస్‌తో పొత్తుకు సీపీఐ, సీపీఎం ప్రయత్నిస్తున్నా ఇప్పటివరకు ఆ పార్టీ స్పందించలేదు.
- వివరాలు 2లో

అలా పెంచి.. ఇలా కోసి..!



వేతన సవరణతో జీతాలు పెరుగుతాయని ఆర్టీసీ కార్మికులు సంబరపడినా హెచ్‌ఆర్‌ఏ సవరించడంతో వేతనాల్లో కోత పడనుంది. ఫిట్‌మెంట్ ఇచ్చినట్టే ఇచ్చి హెచ్‌ఆర్‌ఏలో కోత పెట్టారంటూ ఆర్టీసీ కార్మికులు గగ్గోలు పెడుతున్నారు.
- వివరాలు 12లో

ఇదండీ సంగతి


పొత్తు పెట్టుకున్న తర్వాత కూడా ఆయన మీద మీకు ఇంకా కక్ష ఎందుకు సార్!

జనసేన దుకాణం క్లోజ్!



- ఉత్తరాంధ్రలో జనసేన కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు విశాఖలోని మాధవధారలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ కార్యాలయం మూతపడింది. ఇప్పుడక్కడ ఆ భవన యజమాని టు లెట్ బోర్డు కూడా పెట్టారు. పార్టీ కార్యాలయ ఖర్చును భరించేందుకు స్థానిక నేతలెవరూ ముందుకు రాకపోవడం, కనీసం అద్దె కూడా చెల్లించకపోవడంతోనే భవనం యజమాని ఖాళీ చేయించినట్టు సమాచారం.

- వివరాలు 5లో

అసలు టార్గెట్ ట్యాపింగ్ కాదా?

- మిస్టరీగా మారిన ప్రణీత్‌రావు కేసు
- ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టు అభియోగాల్లో కనిపించని సంబంధిత 'యాక్ట్'
- వారం రోజుల విచారణ దేనికోసమనే సందేహాలు


ప్రణీత్ రావు

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కార్యాలయం కేంద్రంగా డీఎస్పీ 'ప్రణీత్‌రావు అండ్ కో' అప్పటి ప్రతిపక్ష నేత, ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి సహా అనేక మంది ఫోన్లను ట్యాప్ చేశారు... ఈ నెల తొలి వారం నుంచి పోలీసులు లీకుల రూపంలో చెబుతున్న అంశం ఇది. అయితే పంజగుట్ట ఠాణాలో నమోదైన ప్రణీత్ కేసు, ఆయన రిమాండ్ రిపోర్టులో ఎక్కడా ట్యాపింగ్ నేరానికి సంబంధించిన చట్టం ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో సిట్ దర్యాప్తు టార్గెట్ వేరే ఉందా? అనే అనుమానాలు కలు గుతున్నాయి. ప్రణీత్ వారం రోజుల కస్టడీ దేనికోసమో అంతు చిక్కట్లేదు. కేసులో ఒక్కటి మినహా అన్నీ బెయిలబుల్ సెక్షన్లే. ఏపీలో నమోదైన 'స్కిల్‌డెవలప్‌మెంట్' కేసులో చంద్రబాబు జైలుకు వెళ్లడానికి కారణమైన ఐపీసీలోని 409సెక్షన్ ఈ కేసులోనూ ఉండటంతో ప్రణీత్ జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లాడని నిపుణులు చెప్తున్నారు.

సస్పెన్షన్ ఉత్తర్వుల్లో అస్పష్టంగా..

ఎస్ఐబీలో అంతర్భాగమైన స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్ (ఎస్ఓటీ) బృందానికి నేతృత్వం వహించిన ప్రణీత్.. ప్రభుత్వం మారిన తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లా మిగతా 3వ పేజీలో ▶

ట్యాపింగ్ వెనుక ఎక్స్‌టార్షన్?
బెదిరింపుల దందా నడిపిన ప్రణీత్‌రావు
రెండో రోజు కూడా నిందితుడిని ప్రశ్నించిన సిట్
3 లో

క్లుప్తంగా...

సోనియాగాంధీ, రాహుల్‌తో రేవంత్‌రెడ్డి భేటీ

రాష్ట్ర రాజకీయాలపై చర్చ


ఢిల్లీలో ప్రియాంక గాంధీతో రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏఐసీసీ అగ్రనేతలతో భేటీ అయ్యారు. సోమవారం ముంబైలో రాహుల్ గాంధీ చేపట్టిన న్యాయ్‌యాత్ర ముగింపు కార్యక్రమంలో పా ల్గొన్న అనంతరం.. రేవంత్‌రెడ్డి నేరుగా ఢిల్లీకి చేరుకున్నారు. ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రం నుంచి లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థుల తొలిజాబితా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థుల రెండో జాబితాపై చర్చించినట్లు తెలిసింది. గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో చేరికలు, తాజా రాజకీయ పరిస్థితులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై అగ్రనేతలతో రేవంత్‌రెడ్డి చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రతిపక్షంలో ఉండటం కూడా మంచిదే

బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్



సాక్షి, హైదరాబాద్: అధికార పార్టీ తప్పులను ఎత్తి చూపేందుకు బలమైన ప్రతిపక్షం అవసరమని, ప్రతిపక్షంలో ఉండటం కూడా మంచిదేనని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అందరూ ఉద్యమకారులేనని, ఎవరూ పార్టీని వీడరని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. అనర్హత పిటిషన్‌పై గతంలో మాదిరిగా స్పీకర్ జాప్యం చేసే పరిస్థితి లేదన్న విషయం ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పుతో తేలిపోయిందన్నారు. అనర్హత పిటిషన్ల పరిష్కారానికి కోర్టులు కాల పరిమితి విధిస్తున్నందున అనర్హత పిటిషన్‌పై ఇకపై వాయిదాలు కుదరవన్నారు. ఫిరాయింపులు సరికావని, దానం నాగేందర్‌పై అనర్హత వేటు విషయంలో స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకుని రాజ్యాంగాన్ని గౌరవించాలని వినోద్ కుమార్ కోరారు. కరీంనగర్ ప్రతిమ మల్టీప్లెక్స్‌లో ఇటీవల పట్టుబడిన డబ్బుల విషయంలో ఆ సంస్థ సమాధానం చెప్పుకుంటుందన్నారు. మల్టీప్లెక్స్ నిర్వాహకులు తన బంధువులు అయినంత మాత్రాన తనపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.

ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆరే

- పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై బీఆర్‌ఎస్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పదేళ్ల పాటు విచ్చలవిడిగా ఫిరాయింపులను ప్రోత్సహించిందే కేసీఆర్ అని, కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీలతో పాటు చివరికి సీపీఐ ఎమ్మెల్యేలను కూడా ప్రలోభపెట్టి బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లలో 39 మంది విపక్ష పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను తెలంగాణ పునర్నిర్మాణం పేరుతో బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారని అన్నారు. టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే తలసానిని, కాంగ్రెస్‌లో గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని ఏకంగా మంత్రివర్గంలోకి తీసుకోవడం ఏ నైతిక విలువలకు సూచికలని ప్రశ్నించారు. అప్పటి స్పీకర్లు మధుసూదనాచారి, పోచారం శ్రీనివాసరెడ్డి విపక్ష పార్టీలు ఇచ్చిన అనర్హత పిటిషన్లపై చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. ఆరునెలల్లో మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని కేసీఆర్, కేసీఆర్ సీఎం అవుతారని కేటీఆర్, ప్రభుత్వం కూలిపోతుందని కడియం శ్రీహరి వంటి వాళ్లు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకునే ఓపిక లేదని చెప్పారు.

చేవెళ్ల టికెట్‌ను రూ.వంద కోట్లకు కాంగ్రెస్ అమ్ముకుంది



పటోళ్ల కార్తీక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల లోక్‌సభ టికెట్‌ను వంద కోట్ల రూపాయలకు అమ్ముకుందని.. ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారని బీఆర్‌ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి విమర్శించారు. రాజకీయనేతలు పార్టీలు మారడం సర్వసాధారణమని, 90 శాతం మంది నేతలు పార్టీలు మారిన వారేనని పేర్కొన్నారు. తెలంగాణభవన్‌లో సోమవారం కార్తీక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయభిక్ష పెట్టారని, ఐదేళ్ల క్రితం ఎవరికీ తెలియని ఆయనకు ఎంపీగా అవకాశం కల్పించారన్నారు. ఉద్యమ సమయంలో పొల్ట్రీ అసోసియేషన్‌కు రూపకల్పన చేసి దానికి రంజిత్‌రెడ్డిని అధ్యక్షుడిగా చేశారన్నారు. రంజిత్‌రెడ్డికి కేసీఆర్ పిలిచి మరీ చేవెళ్ల టికెట్ ఇస్తే తమ నెత్తిన మోసి ఎంపీగా గెలిపించామని చెప్పారు. పార్టీ ఇబ్బందుల్లో ఉన్న సమయంలో రంజిత్‌రెడ్డి పార్టీని వీడటం నయవంచనే అవుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తమ కుటుంబాన్ని రాజకీయంగా ఖతం చేయాలని ప్రయత్నించిందని, అందుకే తాము బీఆర్‌ఎస్‌లో చేరామని అన్నారు.

ఎన్నికల్లో ముందుకు ఎలా?

- కాంగ్రెస్‌తో తేలని లెఫ్ట్ పొత్తు
- వామపక్షాల ప్రతిపాదనపై స్పందించని హస్తం పార్టీ
- చెరో సీటు ఇచ్చేందుకు విముఖత?
- పోటీ చేయాలన్న పట్టుదలతో సీపీఐ, సీపీఎం

సాక్షి, హైదరాబాద్: సాధారణ ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ ఇప్పటికే చాలాచోట్ల తమ అభ్యర్థులను ప్రకటించాయి. కానీ వామపక్షాల్లో మాత్రం ఇంకా గందరగోళ పరిస్థితే నెలకొని ఉంది. 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్‌తో పొత్తుకు సీపీఐ, సీపీఎం ప్రయత్నాలు చేస్తున్నా, హస్తం పార్టీ ఇప్పటివరకు స్పందించలేదు. దీంతో రెండు పార్టీలూ ఎలా ముందుకెళ్లాలో అర్థంకాని స్థితిలో ఉన్నాయి.

చెరో సీటుకు లెఫ్ట్ విన్నపం

ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల విషయంలో వచ్చిన వివాదం కారణంగా సీపీఎం ఒంటరిగా 19 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసింది. సీపీఐ మాత్రం కాంగ్రెస్‌తో జతకట్టి ఒక స్థానంలో పోటీ చేసి కొత్తగూడెంలో గెలిచింది. లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని సీపీఐ నిర్ణయించగా, ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో కలిసి వెళ్లేందుకు సీపీఎం కూడా సుముఖంగా ఉంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధమని, చెరో స్థానం ఇస్తే చాలని ప్రకటించాయి. అయితే కాంగ్రెస్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంపై ఆ పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా చివరివరకు పొత్తుపై తేల్చకుండా నాన్చారని, దానివల్ల తాము నష్టపోయామని సీపీఎం వర్గాలు అంటున్నాయి.

బేషరతుగా గెలిపించాలి!

చెరో లోక్‌సభ సీటు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా లేదన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లోనే చెరో స్థానం ఇవ్వడానికి ఇష్టపడని కాంగ్రెస్.. లోక్‌సభ సీటును ఇచ్చే పరిస్థితి ఉండదని రాజకీయ విశ్లేషకులు కూడా అంటున్నారు. 17 స్థానాల్లో రెండు లెఫ్ట్ పార్టీ లకు ఇవ్వడం సాధ్యమయ్యే పనికాదని అంటున్నారు. ఈ కారణంగానే కాంగ్రెస్ కూడా ఇప్పటివరకు మౌనంగా ఉందని, 'ఇండియా' కూటమిని గెలిపించేందుకు సీపీఎం, సీపీఐలు బేషరతుగా మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ కోరుకుంటోందని సమాచారం. లెఫ్ట్ పార్టీలు కార్పొరేషన్ల చైర్మన్ పదవులు లేదా ఎమ్మెల్సీ పదవులు తీసుకునేలా రాజీకి వస్తే బాగుంటుందని కాంగ్రెస్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌తోనూ టచ్‌లో లెఫ్ట్!

వామపక్షాలు మాత్రం పోటీపై పట్టుదలతో ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే బీజేపీకి వ్యతిరేకంగా ముందుకు వస్తున్న బీఆర్‌ఎస్‌తోనూ టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అవసరమైతే చెరో స్థానంలో పోటీలో ఉండి, మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే విషయంపైనా లెఫ్ట్ పార్టీలు సమాలోచన చేస్తున్నాయి. బీజేపీ గెలిచేచోట అక్కడ బలమైన పార్టీగా ఉండే లౌకిక శక్తులకు మద్దతు ఇచ్చే అంశాన్ని కూడా వామపక్షాలు పరిశీలిస్తున్నాయి.


సోమవారం జగిత్యాలలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో మహేశ్వర్‌రెడ్డి, ధర్మపురి అర్వింద్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కె.లక్ష్మణ్ తదితరులు

దోపిడీ దొంగల్ని వదలం

▶ మొదటి పేజీ తరువాయి

నినదిస్తున్నారు. శక్తిని వినాశనం చేసేవాళ్లకు.. శక్తిని పూజించే వాళ్లకు మధ్య పోరాటం జరుగుతోంది. శక్తిని ఖతమ్ చేస్తానన్న రాహుల్ గాంధీ ఛాలెంజ్‌ను నేను స్వీకరిస్తున్నా. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో జూన్ 4 న తెలుస్తుంది..' అని ప్రధాని అన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తెరవెనుక స్నేహితులే

'తెలంగాణ.. ఆంగ్లేయులు, రజాకార్లతో పోరాడిన నేల. బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రజలను దోచుకుంది. ఒక దోపిడీదారు.. మరో దోపిడీదారుపై పోరాడలేరు. అందుకే బీఆర్‌ఎస్ దోపిడీపై కాంగ్రెస్ మౌనం వహిస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఇద్దరూ తెరవెనుక స్నేహితులే. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పని అయిపోతుంది. తెలంగాణ కలలను కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు నాశనం చేశాయి. ముఖ్యంగా ప్రజల భావోద్వేగాలతో బీఆర్‌ఎస్ చెలగాటమాడింది. ఇక అధికారంలోకి రాకముందు అనేక మాటలు మాట్లాడిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం సహా దేనిపైనా విచారణ చేయడం లేదు. హామీలు అమలు చేయని కాంగ్రెస్‌ను బీఆర్‌ఎస్ పార్టీ నిలదీయడం లేదు. వీరిద్దరి అవినీతిపై విచారణ చేపడదామనుకుంటే.. రెండు పార్టీలు రాత్రీ పగలు మోదీని నిందించడమే పనిగా పెట్టుకుంటున్నాయి. మా పాలనలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. తెలంగాణ అభివృద్ధి కోసం రూ.6,400 కోట్లతో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించాం. జాతీయ రహదారులిచ్చాం. పసుపు ధరను క్వింటాల్‌కు రూ.6 వేల నుంచి రూ.30 వేలకు పెంచాం. ఇక్కడి గత ప్రభుత్వాలు నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించలేకపోయాయి. మేం మళ్లీ అధికారంలోకి రాగానే వచ్చే పదేళ్లలో తెలంగాణలో రైలు, రోడ్డు తదితర మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేస్తాం..' అని మోదీ హామీ ఇచ్చారు.


జగిత్యాలలో నిర్వహించిన విజయ సంకల్ప సభకు హాజరైన ప్రజలు

17 సీట్లు గెలిపించాలి: కిషన్‌రెడ్డి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రజలకు సుస్థిరమైన, నీతివంతమైన పరిపాలన అందిస్తున్నారని చెప్పారు. తొమ్మిదిన్నరేళ్లలో దేశం అన్ని రంగాల్లో పురోగమించిందని, మన రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు నిధులు ఇచ్చారని అన్నారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని, ఆయన కూతురు కవిత లిక్కర్ దందా చేశారని, తెలంగాణ సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. మోదీ తాను తెలుగు నేర్చుకోవడమే కాకుండా తెలుగు భాషను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. మోదీ ప్రసంగాలను తెలుగులో వినేలా 'ఎక్స్'లో 'నమో ఇన్ తెలుగు' అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో 17కు 17 సీట్లు గెలిపించాలని కోరారు. ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ రాజీనామా

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చారు. బీజేపీలో చురుకైన నేతగా వ్యవహరించారు. బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేశారు. 2019 సెప్టెంబర్ 8న తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. సోమవారం రాజీనామా చేశారు. మొత్తంగా 4 ఏళ్ల 6 నెలల 10 రోజుల పాటు ఆమె పదవిలో కొనసాగారు. తెలంగాణ రాష్ట్రానికి రెండో గవర్నర్, తొలి మహిళా గవర్నర్ తమిళిసైనే.

గత సర్కారుతో విభేదాలు..

గవర్నర్‌గా తమిళిసై పదవీకాలం విభేదాలు, వివాదాలతో గడిచింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, గవర్నర్ తమిళిసై మధ్య నిరంతరం ఏదో ఒక విషయంలో బహిరంగ ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగాయి. గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా పాడి కౌశిక్‌రెడ్డిని నియమించాలని అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించగా.. ఆయనకు తగిన అర్హతలు లేవంటూ తమిళిసై తిరస్కరించడంతో ఈ విభేదాలు తొలుత బహిర్గతమయ్యాయి. గవర్నర్‌గా తనకు సరైన మర్యాద ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని తమిళిసై చాలాసార్లు ఆరోపణలు చేశారు. ఆమె మేడారం జాతరకు వెళ్లేందుకు హెలికాప్టర్ సేవలను కోరగా.. నాడు ప్రభుత్వం నిరాకరించింది. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముందు ఆనవాయితీ ప్రకారం జరగాల్సిన గవర్నర్ ప్రసంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని.. గణతంత్ర వేడుకలను రాజ్‌భవన్‌కు పరిమితం చేసి అవమానించిందని అప్పట్లో గవర్నర్ ప్రెస్‌మీట్ పెట్టి మరీ విమర్శించారు. రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమాలకు కేసీఆర్, మంత్రులు రాకపోవడాన్నీ నిలదీశారు.

బిల్లుల పెండింగ్ అంశంలోనూ..

రాష్ట్ర శాసనసభలో పాస్‌చేసి గవర్నర్ ఆమోదం కోసం పంపిన ఏడు బిల్లులను తమిళిసై చాలా కాలం పెండింగ్‌లో ఉంచడం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో గవర్నర్ రెండు బిల్లులను రాష్ట్రపతికి నివేదించి, మరో రెండు బిల్లులను ప్రభుత్వానికి తిప్పి పంపించారు. మూడు బిల్లులకు ఆమోదం తెలిపారు. గవర్నర్ తిరస్కరించిన, తిప్పిపంపిన బిల్లులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండోసారి శాసనసభలో ఆమోదించి పంపినా.. గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. ఇక గవర్నర్ కోటా కింద నామినేటెడ్ ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించగా.. వారికి తగిన అర్హతలు లేవని పేర్కొంటూ పక్కనపెట్టారు. ఈ క్రమంలో బీజేపీ మూలాలున్న తమిళిసై కావాలనే తమ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నారని, రాజ్‌భవన్‌ను బీజేపీ కార్యాలయంగా మార్చారని అప్పట్లో బీఆర్‌ఎస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, గవర్నర్ తమిళిసైకి మధ్య సత్సంబంధాలే కొనసాగాయి. కొత్త ప్రభుత్వ నిర్ణయాలను ఆమె సత్వరమే ఆమోదిస్తూ వచ్చారు.

భావోద్వేగాలతో తిరిగి వెళ్తున్నా: తమిళిసై

తెలంగాణ రాష్ట్రానికి సేవ చేయడం చాలా ఆనందం కలిగించిందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. గవర్నర్ పదవి నుంచి వైదొలుగుతున్నప్పుడు అనేక భావోద్వేగాలకు లోనయ్యాయని తెలిపారు. గవర్నర్ పేరిట రాజ్‌భవన్ కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ''తెలంగాణలోని నా సోదర సోదరీమణుల ఆప్యాయత నన్ను బాగా ఆకట్టుకుంది. నేను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తెలంగాణ ప్రజలు నన్ను వారి అక్కగా ఆదరించారు. మీ అచంచలమైన మద్దతు, ప్రేమ, ఆప్యాయత ఎంతగా నా హృదయాన్ని తాకాయో నేను మాటల్లో చెప్పలేకపోతున్నాను. మీతో పంచుకున్న ప్రతి క్షణం నాపై చెరగని ముద్ర వేసింది. అందరం కలసి తెలంగాణ అభివృద్ధికి, ప్రగతికి పాటుపడ్డాం. బోనాలు, బతుకమ్మ తదితర పండుగలు జరుపుకొన్నాం. మీ అచంచల మద్దతు, సహృదయత నాకు నిరంతరం స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. తెలంగాణ ప్రజల పట్ల నా ప్రేమ చిరస్థాయిగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. చిరస్మరణీయ జ్ఞాపకాలతో తెలంగాణను వీడుతున్నా..'' అని తమిళిసై పేర్కొన్నారు.

రాజకీయంగా మాకు అన్యాయం చేశారు..

- హైకోర్టు ఆదేశాలను కూడా ఖాతరు చేయక మా జీవితాలు నాశనం చేశారు
- మీ రాజకీయ జీవితం బాగుండాలి
- గవర్నర్ తమిళిసైకి బీఆర్‌ఎస్ నేతలు దాసోజు, కుర్రా బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: శాసనమండలి సభ్యులుగా ఎన్నిక కావలసిన తమ రాజకీయ జీవితాలను నాశనం చేసే నిర్ణయం తీసుకుని, గవర్నర్ తమిళిసై తమకు తీరని అన్యాయం చేశారని బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం వీరిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయగా, రాజకీయ నేపథ్యం కారణాన్ని చూపి తమిళిసై తిరస్కరించారు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గవర్నర్‌గా రాజీనామా చేసిన తమిళిసైకి బహిరంగ లేఖ రాశారు. ఇటీవలి హైకోర్టు ఆదేశాల తర్వాత న్యాయం గెలుస్తుందని ఆశించి 'హైకోర్టు ఆదేశాలు అమలు చేయండి, రాజ్యాంగాన్ని కాపాడండి, మా లాంటి వెనుకబడినవర్గాలకు చెందినవారికి న్యాయం చేయండి'అని చేతులు జోడించి నమస్కరించినా కనికరించలేదని లేఖలో పేర్కొన్నారు. 'కనీసం హైకోర్టు ఆదేశాల తర్వాతనైనా, మీ మునుపటి నిర్ణయాన్ని సరిదిద్దుకొని, మమ్మల్ని శాసన మండలి సభ్యులుగా నియమిస్తారని ఎంతో ఆశతో ఎదురుచూశాం. తప్పుడు న్యాయసలహాపై మీరు ఆధారపడటం ద్వారా బడుగులమైన మాకు, మా కుటుంబాలకు తీరని అన్యాయం జరిగింది'అని ఆవేదన వ్యక్తం చేశారు. 'గత ప్రభుత్వం పట్ల మీకున్న రాజకీయ శత్రుత్వంతో, మాకు రాజకీయ నేపథ్యం ఉన్నది అనే కుంటి సాకుతో మా త్యాగాలు, మాకున్న అర్హతలు, సమాజానికి మేము చేసిన కృషిని తమరు కావాలనే విస్మరించి, మా భవిష్యత్తును బుగ్గి పాలు చేశారు'అని విమర్శించారు. తాము చాలా అట్టడుగు, అణచివేతకు గురైన వర్గాల నుంచి వచ్చామనే విషయాన్ని విస్మరించి, రాజ్యాంగాన్ని తప్పుదారి పట్టిస్తూ, చట్టవిరుద్ధమైన నిర్ణయంతో మా జీవితాలు నాశనం చేశారనే విషయాన్ని గుర్తించి ఇప్పటికైనా దయతో ఆత్మశోధన చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. 'మీ తప్పుడు నిర్ణయం వల్ల మా జీవితాలు నాశనం అయినప్పటికీ, మీ రాజకీయ జీవితంలో తప్పనిసరిగా విజయం సాధించాలని హృదయ పూర్వకంగా ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాం. పార్లమెంటు సభ్యురాలిగా పోటీ చేసేందుకు మరోసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వెళ్తున్న మీకు హృదయ పూర్వక అభినందనలు'అని పేర్కొన్నారు.

20న మళ్లీ అయ్యర్ కమిటీ రాక

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లు, నిర్మాణంపై అధ్యయనం చేసేందుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల బృందం ఈనెల 20న మళ్లీ హైదరాబాద్‌కు రానుంది. 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో సమావేశం కానుంది. 22న తెలంగాణ స్టేట్ రీసెర్చ్ లాబొరేటరీని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన నమూనా బ్యారేజీలను పరిశీలించనుంది.

దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించండి

- స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు బీఆర్‌ఎస్ పిటిషన్
- దానంను రేవంత్ ఎంతకు కొన్నారో చెప్పాలి: పాడి కౌశిక్‌రెడ్డి
- తాము గేట్లు తెరిస్తే కాంగ్రెస్ భూస్థాపితం అవుతుందని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ బీఫారంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని శాసనసభ స్పీకర్‌కు బీఆర్‌ఎస్ విజ్ఞప్తి చేసింది. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించాలని పిటిషన్ సమర్పించారు. తర్వాత క్వార్టర్స్ బయట పాడి కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ''దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించాలని పిటిషన్ ఇచ్చాం. స్పీకర్ మా విజ్ఞాపనపై సానుకూలంగా స్పందించారు'' అని తెలిపారు.

దానంను ఎంతకు కొన్నారో చెప్పాలి..

పార్టీలు మారిన నాయకులను రాళ్లతో కొట్టి చంపాలని గతంలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని కౌశిక్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌ను రాళ్లతో కొడతారో, లేదో ప్రజలకు రేవంత్ జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్ గతంలో పంజగుట్ట వద్ద బీడీలు అమ్ముకున్నారంటూ వ్యాఖ్యలు చేసిన రేవంత్.. ఇప్పుడు దానంను ఎంతకు కొన్నారో చెప్పాలన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోనే చర్య తీసుకోవాలని గతంలో మహారాష్ట్ర స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని అందరూ గమనించాలన్నారు. ''మా పార్టీ అధినేత కేసీఆర్ సింహం లాంటి వారు. ఒక అడుగు వెనక్కి వేశారు. అంటే నాలుగు అడుగులు ముందుకు వేస్తారనే అంశాన్ని మరిచిపోవద్దు. మేం గేట్లు తెరిస్తే కాంగ్రెస్ భూస్థాపితం అవుతుంది. మేం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామని అనడం లేదు. రేవంత్ ఐదేళ్లు ప్రశాంతంగా సీఎంగా కొనసాగొచ్చు. రేవంత్ ప్రభుత్వానికి ప్రమాద మేదైనా ఉంటే.. కాంగ్రెస్ పార్టీకి చెందిన నల్లగొండ, ఖమ్మం నేతలతోనే ఉంటుంది''అని కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

కన్‌స్ట్రక్షన్ కంపెనీల నుంచి రూ. వందల కోట్లు చేతులు మారాయి

- కాంగ్రెస్ అభ్యర్థులకు ఆ డబ్బు పంచబోతున్నారు
- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్ : భవన నిర్మాణ కంపెనీల నుంచి రూ.వందల కోట్లు చేతులు మారాయని, ఆ డబ్బు కాంగ్రెస్ అభ్యర్థులకు పంపిణీ చేయబోతున్నారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. ఈస్టర్న్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎవరిది..భూములను ఆక్రమించింది ఎంత..షేక్‌పేటలోని సర్వే నంబర్ 343, 403లో ఏం జరుగుతుందని ప్రశ్నించారు. ఈస్టర్న్, వెస్టర్న్, సదరన్ కన్‌స్ట్రక్షన్ అనే కంపెనీలేవి? సర్వే నంబర్ 343లో ఉన్న ప్రభుత్వ భూమి ఎంత? ఎన్ని ఫ్లోర్లు ఇవ్వాలి? ఎన్ని ఇచ్చారు? అని నిలదీశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి పార్టీ మారడం వెనుక జరిగిన ఆర్థిక ప్రయోజనాలు ఏమిటి? అసలు ఆ కంపెనీల ప్రయోజనాలు ఏమిటని ప్రశ్నించారు. పార్టీ మార్పు ద్వారా పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారేందుకు రంగం సిద్ధం చేశారని ఆరోపించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డికి ఉన్న వ్యాపార లావాదేవీలేమిటీ అని నిలదీశారు. వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరి మల్కాజిగిరి, చేవెళ్ల, మెదక్, జహీరాబాద్ పార్లమెంట్లకు ఎంత ఖర్చు పెడతారో చెప్పాలన్నారు.ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ గతంలో ప్రెస్‌మీట్ పెట్టి బీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి రూ.500 కోట్ల స్కామ్‌లో ఇన్‌వాల్వ్ అయ్యారని ఆరోపణలు చేశారని గుర్తుచేశారు.

చేవెళ్లలో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు


సబితారెడ్డి ఇంట్లో సమావేశమైన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

చేవెళ్ల: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం సాధిస్తామని, అందుకు అంతా కలసికట్టుగా పనిచేస్తామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితారెడ్డి నివాసంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. చేవెళ్లలో పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజయానికి ఐకమత్యంతో పనిచేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చాక రెండు ఎన్నికల్లో ఇక్కడ గులాబీ జెండాతో గెలిచిన ఇద్దరు అభ్యర్థులు వారి స్వార్థం కోసం ఇప్పుడు వేర్వేరు పార్టీల్లో చేరి పోటీలో ఉన్నారన్నారు. ప్రస్తుతం ఆ ఇద్దరు అభ్యర్థులను ఓడించి కారు గుర్తుకు ఓటేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటోందన్నారు.

త్వరలో చేవెళ్ల పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గే మల్లేశం, దయానంద్ గుప్తా, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వాటా నీరు దక్కడం లేదు

కాంగ్రెస్ నేతలు డీకే సమరసింహారెడ్డి, ఎం.కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: కృష్ణా నది నుంచి తెలంగాణకు రావాల్సిన నీటివాటా దక్కడం లేదని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి డి.కె. సమరసింహారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. కృష్ణాలోని 800 టీఎంసీల నీటిలో 64 శాతం వాటా తెలంగాణకు దక్కాల్సి ఉన్నప్పటికీ, ఆ స్థాయిలో నీటి వినియోగం ఏనాడూ లేదని అన్నారు. తెలంగాణ కృష్ణా నుంచి ఎక్కువ నీళ్లు వాడుకుంటున్నట్లు కేంద్ర జలవనరుల శాఖ చెప్పడం బాధాకరమన్నారు. మొట్టమొదటి బచావత్ ట్రిబ్యునల్ న్యాయంగా నీళ్లను పంపకం చేసిందని, బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ వచ్చాక అన్ని ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. తెలంగాణకు అన్యాయం చేస్తూ పక్క రాష్ట్రాలకు ఎక్కువగా కేటాయింపులు జరిగాయన్నారు. కిరణ్ కుమార్ సీఎంగా ఉన్నప్పుడు తాము పోరాటం చేశామని, బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయాన్ని సరిచేయాలని కోరామని తెలిపారు. కృష్ణా నది నీటి సమస్యను పరిష్కరించాలని వారు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. అలాగే కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి పొన్నంను కలిసిన కార్పొరేషన్ల చైర్మన్లు

సాక్షి, హైదరాబాద్: రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో పొన్నంను కలిసిన వారిలో అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యానాయక్ ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా...

రూ. 5.73 కోట్ల విలువైన బంగారం పట్టివేత



బంగారం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

మిర్యాలగూడ అర్బన్: ఓ వాహనంలో తరలిస్తున్న రూ.5.73 కోట్ల విలువ గల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మిర్యాలగూడలోని ఈదులగూడ చౌరస్తాలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మిర్యాలగూడ నుంచి కోదాడ వైపునకు వెళుతున్న ఓ బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో బంగారం తరలిస్తున్నారని గుర్తించి వాహనంతోపాటు ముగ్గురిని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అధికారులను రప్పించి ఆ బంగారం ఎక్కడి నుంచి వచ్చింది..ఎక్కడకు తరలిస్తున్నారు. అది సక్రమమైనదేనా..అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. 13 కిలోలకు పైగా బంగారం ఉండగా, దాని విలువ రూ.5.73 కోట్లు ఉంటుందని అధికారులు లెక్క కట్టారు.

ప్రజావాణి తాత్కాలికంగా నిలిపివేత

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలులో ఉన్నందున పూలే ప్రజాభవన్ వేదికగా జరిగే ప్రజావాణిని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సంబంధిత నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత జూన్ 7న ప్రజావాణి తిరిగి ప్రారంభమవుతుందని వెల్లడించారు.

జెన్‌కో డైరెక్టర్ అజయ్ వీఆర్‌ఎస్‌కి ఆమోదం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జెన్‌కో డైరెక్టర్ (సివిల్) ఎ.అజయ్ స్వచ్ఛంద పదవీ విరమణను సంస్థ సీఎండీ ఎస్‌ఏఎం రిజ్వీ సోమవారం ఆమోదించారు. 2018, సెప్టెంబర్ 5 నుంచి అజయ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. యాదాద్రి విద్యుత్ కేంద్రానికి పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖకు సమర్పించిన నివేదికలను తప్పులతడకగా తయారు చేయడంతో ఇబ్బందులొచ్చాయని సీఎండీ ఎస్‌ఏఎం రిజ్వీ.. అజయ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తన స్వచ్ఛంద పదవీ విరమణ ఫైల్ పెండింగ్‌లో ఉందని, ఆమోదిస్తే వెళ్లిపోతానని అజయ్ కోరడంతో వెంటనే సీఎండీ రిజ్వీ సంతకం చేసినట్లు జెన్‌కో వర్గాలు తెలిపాయి. ఈనెల 31 నుంచి అజయ్ స్వచ్ఛంద పదవీ విరమణ అమల్లోకి రానుంది.

నాపై తప్పుడు కేసు కొట్టివేయండి: అర్వింద్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ అబ్సిడ్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని, ఎలాంటి ఆధారాలు లేకున్నా తనపై తప్పుడు కేసు నమోదు చేశారని బీజేపీ ఎంపీ అర్వింద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాటి సీఎం కేసీఆర్‌పై తాను ఎలాంటి అసభ్య వ్యాఖ్యలు చేయలేదని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఈ ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఈనెల 22న విచారణ చేపట్టనున్నారు. '2019 పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీ చేసి విజయం సాధించా. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక నా పరువుకు నష్టం కలిగించడంలో భాగంగా ఈ కేసు పెట్టారు. 2022, ఆగస్టు 14న ప్రెస్‌మీట్ పెట్టి.. రాష్ట్ర ప్రభుత్వ పాలసీలను ప్రశ్నించా. కానీ నేను కేసీఆర్‌ను అసభ్య పదజాలంతో దూషించానంటూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ కోకన్వీనర్ రవికుమార్ తప్పుడు ఫిర్యాదు చేశారు. యూట్యూబ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చూశానని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు ఆగస్టు 18న సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తర్వాత అబిడ్స్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. ఈ కేసులో ట్రయల్ కోర్టులో చార్జిషీట్‌ను కూడా దాఖలు చేశారు' అని అర్వింద్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

ట్యాపింగ్ వెనుక ఎక్స్‌టార్షన్?

- బెదిరింపుల దందా నడిపిన ప్రణీత్‌రావు
- సహకరించిన మరో ఇద్దరు అధికారులు
- రెండో రోజు నిందితుడిని ప్రశ్నించిన సిట్

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో (ఎస్ఐబీ) డీఎస్పీగా పని చేసినప్పుడు నమ్మక ద్రోహానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టయిన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు వ్యవహారానికి సంబంధించిన మరో కీలకాంశం వెలుగులోకి వచ్చింది. ఇతడు అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ట్యాపింగ్‌కు పాల్పడటమే కాకుండా.. వాటి ఆధారంగా పలువురిని బెదిరించి వసూళ్ల (ఎక్స్‌టార్షన్)కు పాల్పడినట్లు సమాచారం. అతడి ఫోన్లు, ల్యాప్‌టాప్ నుంచి దర్యాప్తు అధికారులు సేకరించిన అంశాల్లో ఈ బెదిరింపుల పర్వం వెలుగులోకి వచ్చింది. మరోపక్క పోలీసు కస్టడీలో ఉన్న ప్రణీత్‌ను సిట్ అధికారులు వరుసగా రెండో రోజైన సోమవారం బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో ప్రశ్నించారు. ప్రణీత్‌ను ఎస్ఐబీ కార్యాలయానికి తీసుకువెళ్లి వార్ రూమ్స్‌గా వినియోగించిన రెండు గదులతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు.



బంజారాహిల్స్ పోలీసుస్టేషన్ గేట్లు మూసేసిన దృశ్యం

ఠాణా గేట్లు మూసేసి...

సిట్ బృందం ప్రణీత్‌ను ఉదయం 9 గంటలకు బంజారాహిల్స్ ఠాణాకు తెచ్చింది. ఠాణాలోకి ఎవరూ రాకుండా గేట్లు మూసేసిన అధికారులు సాయంత్రం వరకు విచారించారు. అయితే, ప్రణీత్ దర్యాప్తునకు అతడు సహకరించట్లేదని పోలీసులు చెప్తున్నారు. సాంకేతిక ఆధారాలను బట్టి పోలీసులు బలవంతపు వసూళ్ల కోణాన్ని గుర్తించగలిగారు. బీఆర్‌ఎస్‌కు చెందిన వారితోపాటు నాటి ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ అనేక మంది ఫోన్లు ట్యాప్ చేశాడు. ఆ సమాచారాన్ని వారికి లేదా వారి ద్వారా సంబంధిత ఏజెన్సీలకు ఇచ్చేవాడు. ఇలా తన హవా నడుస్తుండటంతో మరో ఇద్దరు ఉన్నతాధికారులు, ఓ రాజకీయ నాయకుడితో కలిసి బెదిరింపుల దందాకు దిగారు. వీళ్లంతా ఓ ముఠాగా ఏర్పడి మరికొందరు ప్రైవేట్ వ్యక్తులు, వ్యాపారులు, బిల్డర్లు, ఇన్‌ఫ్రా కంపెనీల యజమానుల ఫోన్లనూ ట్యాప్ చేశారు. ఈ సమాచారాన్ని విశ్లేషించేందుకు వీళ్లు పర్వతగిరి ప్రాంతంలో మరో వార్‌రూమ్ ఏర్పాటు చేసుకున్నారు. ఎస్ఐబీ కార్యాలయం నుంచి తన సొంత పెన్‌డ్రైవ్స్, హార్డ్‌డిస్క్‌ల్లోకి కాపీ చేసుకున్న ట్యాపింగ్ డేటాను ప్రణీత్ ఇక్కడకు తెచ్చేవాడు. ఇద్దరు అధికారులతో కలిసి ట్యాపింగ్స్‌లోని అంశాలను విశ్లేషించి, వెలుగులోకి వచ్చిన అంశాలను చూపించి బెదిరిస్తూ భారీ వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు అధికారులతోపాటు రాజకీయ నాయకుడికీ నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.

అసలు టార్గెట్ ట్యాపింగ్ కాదా?

▶ మొదటి పేజీ తరువాయి

డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఎస్ఐబీ అంతర్గత విచారణలో ఆయన చేసిన అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఈ విభాగాధిపతి ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రణీత్‌ను సస్పెండ్ చేస్తూ డీజీపీ ఈ నెల మొదటి వారంలో ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో కొంత వరకు ట్యాపింగ్‌కు సంబంధించిన ఆరోపణలున్నాయి. ఎస్ఓటీకి ఉద్దేశించిన లీజ్డ్ లైన్, ఇంటర్నెట్ కనెక్షన్లను ప్రణీత్ దుర్వినియోగం చేశారని అందులో ఆరోపించారు. అందులోనే 42 హార్డ్‌డిస్క్‌లు మార్చేయడం, ధ్వంసం చేయడం అంశాన్నీ ప్రస్తావించారు. ఈ సస్పెన్షన్ జరిగిన వారం తర్వాత ఎస్ఐబీ ఏఎస్పీ ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో ప్రణీత్, ఇతరులపై కేసు నమోదైంది.

ఆ రెంటిలో కనిపించని ప్రస్తావన...

ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు మూడు చట్టాల్లోని 9 సెక్షన్ల కింద అభియోగాలు చేశారు. ఐపీసీ, ఐటీ, ప్రజా ఆస్తుల విధ్వంసాల నిరోధక (పీడీపీపీ) చట్టంలోని సెక్షన్లు వాడారు. ఈ నెల 13న అధికారులు న్యాయస్థానంలో రిమాండ్ కేసు డైరీని సమర్పించారు. ఇందులో ఓ సెక్షన్ తగ్గించి ఎనిమిదింటి కిందే ఆరోపణలు చేశారు. ఎఫ్ఐఆర్‌లో ఐపీసీలోని 120బీ (కుట్ర) ఉండగా... రిమాండ్ రిపోర్టులో ఈ సెక్షన్ కనిపించలేదు. సెక్షన్ 34 చేర్చినప్పుడు 120బీ ఉండాల్సిన అవసరం లేదని, ఈ నేపథ్యంలోనే రిమాండ్ రిపోర్టులో తొలగించి ఉంటారని కొందరు చెబుతున్నారు. అయితే ఓ నిందితుడిపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేయాలంటే కచ్చితంగా టెలిగ్రాఫిక్ యాక్ట్‌ను జోడించాలి. అయితే ఎఫ్ఐఆర్, రిమాండ్ కేసు డైరీ రెండింటిలోనూ ఎక్కడా ప్రత్యక్షంగా ట్యాపింగ్ ప్రస్తావన, ఈ యాక్ట్ కనిపించకపోవడం గమనార్హం.

అసలు 'టార్గెట్' ఏమిటో?...

ఫోన్‌ట్యాపింగ్ జరిగిందని అధికారులు అంగీకరిస్తున్నప్పటికీ కేసులో దీన్ని ప్రస్తావించకపోవడం వెనుక బలమైన కారణాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఫోన్లను అనధికారికంగా ట్యాప్ చేయడం చాలా ఖరీదుతో కూడిన అంశం. అధికారికంగా ట్యాప్ చేయాలంటే సంబంధిత సర్వీస్ ప్రొవైడర్ సహకారం అనివార్యం. దీనికోసం పోలీసు విభాగం వారికి లేఖ రాయాల్సి ఉంటుంది. ఇది డీఎస్పీ ప్రణీత్ వద్ద నుంచే వచ్చి... ఎస్పీ సహా కొందరు ఉన్నతాధికారులు ఫార్వర్డ్ చేయాలి. ఈ లేఖలు సర్వీస్ ప్రొవైడర్ వద్ద నిర్ణీత కాలం వరకు భద్రంగా ఉండాలి. ట్యాపింగ్ కోణంలో దర్యాప్తు చేస్తే ఆధారాలు సేకరించడం, తదుపరి చర్యలు తీసుకోవడం తేలికే అయినప్పటికీ... అప్పట్లో లేఖలు ఫార్వర్డ్ చేసి, ప్రస్తుతం ఉన్నత స్థానంలో ఉన్న కొందరు అధికారులకు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అసలు లేఖలే లేకుండా లేదా ప్రాపర్ చానల్‌లో రాకుండా ట్యాపింగ్‌కు సహకరిస్తే సర్వీస్ ప్రొవైడర్ తీవ్ర ఇబ్బందుల్లో పడతాడు. ఈ నేపథ్యంలోనే పోలీసులు అధికారికంగా ఎక్కడా ట్యాపింగ్ ప్రస్తావన నేరుగా తీసుకురాకుండా కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీని టార్గెట్ వేరేది ఏదో ఉంటుందని, అది తెలియాలంటే మరికొన్నాళ్లు పడుతుందని కొందరు అధికారులు చెబుతున్నారు.

ఆప్ నేతలతో కలసి కవిత కుట్రపన్నారు!

▶ మొదటి పేజీ తరువాయి

అందాయని ఆరోపించింది. కవిత, ఆమె సహచరులు ఆప్‌కు ముందస్తుగా చెల్లించిన సొమ్మును రికవరీ చేయాల్సి ఉందని తెలిపింది. ఇప్పటివరకు ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, ముంబై సహా దేశవ్యాప్తంగా 245 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామని వివరించింది. ఈ కేసులో మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్‌నాయర్ సహా 15 మందిని అరెస్టు చేసినట్టు తెలిపింది. ఇప్పటివరకు రూ.128.79 కోట్లను జప్తు చేశామని, తదుపరి విచారణ కొనసాగుతోందని వివరించింది.

కవితతో కేటీఆర్, హరీశ్ భేటీ

తమ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కవితను ఈడీ రెండో రోజు సోమవారం కూడా ప్రశ్నించింది. ఉదయం సుమారు గంటన్నర సేపు ఈ విచారణ సాగినట్టు తెలిసింది. ఇక ఈడీ కస్టడీలో ఉన్న కవితతో సోమవారం సాయంత్రం బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, న్యాయవాది మోహిత్‌రావు భేటీ అయ్యారు. సుమారు 30 నిమిషాలపాటు మాట్లాడారు. ఆమె ఆరోగ్య పరిస్థితి, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఇక తన అరెస్టు సరికాదంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించి వారు చర్చించారు.

పాత పిటిషన్‌పై నేడు విచారణ

ఈడీ సమన్లను రద్దు చేయాలంటూ గతంలో కవిత దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. జస్టిస్ బేలా ఎం.త్రివేదీ, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం ఈ విచారణ చేపట్టనుంది. కవిత తరఫు న్యాయవాదులు ఆమెను అరెస్టు చేసిన విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకురానున్నారు.

అరెస్టు అక్రమమంటూ సుప్రీంలో కవిత పిటిషన్

తన అరెస్టు అక్రమం అంటూ కవిత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈడీ అరెస్టు, కస్టడీకి ఇస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో కవిత తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో ఆన్‌లైన్ ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. ఈడీ విచారణకు సంబంధించి సుప్రీం కోర్టులో కేసు కొనసాగుతుండగా, గతంలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా దర్యాప్తు సంస్థ వ్యవహరించిందని పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పిటిషన్ ఇంకా రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. అందులో పలు పేజీల్లోని అంశాలు సరిగా లేవని, వాటిని సరిచేయాల్సి ఉందని రిజిస్ట్రీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

మల్లారెడ్డి కళాశాలలో ఐటీ దాడులు


మల్లారెడ్డి కళాశాల భవనం

మేడ్చల్ రూరల్: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి చెందిన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. 10 మంది ఐటీ అధికారుల బృందం మల్లారెడ్డి కళాశాలలో సోదాలు నిర్వహించి యాజమాన్యం, సిబ్బందిని 4 గంటల పాటు విచారించి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కళాశాలలోని మేనేజ్‌మెంట్ కోటా సీట్లను అధిక మొత్తంలో అమ్ముకుంటూ వాటి వివరాలను రికార్డుల్లో నమోదు చేయడం లేదని, ఆదాయానికి మించిన ఆస్తులు బంధువుల పేర్లపై పెట్టి ఆదాయపన్ను ఎగవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ఎంతకు అమ్ముకున్నారు? ఏ విద్యార్థి ఫీజు ఎంత అనే వివరాలు సక్రమంగా నిర్వహించడం లేదనే ఆరోపణల నేపథ్యంలో దాడులు జరిగినట్లు సమాచారం. కాగా, ఐటీ అధికారులు సోదాల్లో స్వాధీనం చేసుకున్న రికార్డుల వివరాలు, తదితర పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీసీ హాస్టళ్లకు నిధుల లేమి: ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు నిధుల లేమితో సతమతమవుతున్నాయని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు పది నెలలుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సమస్యలు కుప్పలుగా పేరుకుపోయాయన్నారు. కనీసం మెస్ చార్జీలు సైతం విడుదల చేయలేదని, చాలాచోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వీటికి అద్దె బిల్లులు ఇవ్వకపోవడంతో యజమానులు ఖాళీ చేయాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని బీసీ హాస్టళ్లకు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు.

సెలవుల్లోనే రోడ్‌షోలు

▶ మొదటి పేజీ తరువాయి



నిరంతర ప్రక్రియగా జరుగుతోందన్నారు.

ఏప్రిల్ 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చు

కొత్త ఓటరుగా నమోదు కోసం ఏప్రిల్ 15లోగా ఫారం -6 దరఖాస్తు చేసుకున్న వారందరికీ లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసే సదుపాయం కల్పిస్తామని వికాస్‌రాజ్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిశాకే ఓటర్ల చిరునామా మార్పు(ఫారం-8), తప్పుల దిద్దుబాటు(ఫారం-7) దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఈసారి 85 ఏళ్ల పైబడిన ఓటర్లకు ఇంటి నుంచి ఓటేసే సదుపాయం కల్పిస్తామన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండే నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్లు, కుర్చీలు వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు.

లెక్కలు చూపకుంటే స్వాధీనం..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సరైన లెక్కలు లేకుండా రూ.50వేలకు మించిన నగదు తీసుకెళ్లరాదని వికాస్‌రాజ్ సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికలు ముగిసిననాటి నుంచి ఇప్పటివరకు రూ.243 కోట్లు విలువైన నగదు/సరుకులను దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకున్నాయన్నారు. మార్చి 1 నుంచి ఆదివారం వరకు రూ.21.63 కోట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇటీవల నామినేటెడ్ పదవుల్లో నియామకమైన చైర్‌పర్సన్లు పదవీ బాధ్యతలు స్వీకరించవచ్చా? అనే అంశంపై నిబంధనలను పరిశీలించాక తెలియజేస్తామన్నారు. ఈ–పేపర్లకు ఇచ్చే ప్రకటనలకు సైతం అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సర్టిఫికేషన్ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా పలు గణాంకాలను విడుదల చేశారు.

రాష్ట్రంలో ఈవీఎంల అవసరాలు

బ్యాలెట్ యూనిట్లు	:	57,048 (160%)
కంట్రోల్ యూనిట్లు	:	44,569 (125%)
వీవీ ప్యాట్స్	:	48,134 (135%)

రాష్ట్రంలో 'ఎన్నికల' లెక్కలివీ..

మొత్తం ఓటర్లు	:	3,30,00,088 (మార్చి 17 నాటికి)
పురుషులు	:	1,64,10,227
మహిళలు	:	1,65,87,134
ట్రాన్స్‌జెండర్లు	:	2,727
ప్రవాస ఓటర్లు	:	3,403
85 ఏళ్లపైబడినవారు	:	1,94,082
దివ్యాంగ ఓటర్లు	:	5,26,340

కొత్త ఓటర్ల లెక్క

యువ ఓటర్లు (18–19 ఏళ్లవారు)	:	8,67,717
పురుషులు	:	4,82,688
మహిళలు	:	3,84,932
ట్రాన్స్‌జెండర్లు	:	97

గత నాలుగు లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో పోలింగ్ శాతం

ఏడాది	పోలింగ్ శాతం
2004	69.95%
2009	72.70%
2014	68.77%
2019	62.72%

ప్రిన్సిపల్ అసభ్యంగా మాట్లాడుతున్నారు

కొత్తగూడెంలో మెడికోల ఆందోళన

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: క్రమశిక్షణ పేరుతో కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మణ్‌రావు తమతో అసభ్యంగా మాట్లాడుతూ, మానసికంగా వేధిస్తున్నారంటూ విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మొదలైన ఆందోళన మూడు గంటల పాటు కొనసాగింది. 300 మంది విద్యార్థులు ఆందోళనలో పాల్గొని, కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ కూడా ధర్నా చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మణ్‌రావు అక్కడకు చేరుకుని 'మీరు చదువుతున్న కాలేజీకి మచ్చ తెస్తున్నారు' అంటూ మండిపడ్డారు. దీనిపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేయగా కొంచెం వెనక్కి తగ్గారు.

అగ్గిరాజుకుంది ఇలా..

ఇటీవల కాలేజీ ఫెస్టివల్ నిర్వహించేందుకు తేదీలు ప్రకటించగా, చివరి నిమిషంలో రద్దు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రకటించారు. దీంతో ఏడాది కాలంగా ప్రిన్సిపల్ వేధింపులు భరిస్తున్నామంటూ మెడికోలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థినులు మాట్లాడుతూ మెడికల్ కాలేజీకి పక్కా భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో నర్సింగ్ కాలేజీ భవనంలో మెడికల్ కాలేజీ, పాల్వంచలో హాస్టళ్లు ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే, రాత్రి ప్రిన్సిపల్ తమ హాస్టల్ గదులకు తరచుగా వస్తూ 'నైట్ డ్రెస్‌ల్లో ఉన్న తమతో 'ఇలాంటి పొట్టిపొట్టి బట్టలు ఎందుకు వేసుకుంటున్నారు. మీ ఇంట్లో మిమ్మల్ని ఇలానే పెంచారా.. ఇంట్లో మీ అమ్మలు కూడా ఇలాంటి బట్టలే వేసుకుంటారా' అని తిడుతున్నారని వాపోయారు.


కొత్తగూడెంలోని వైద్య కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న మెడికోలు



"ఏదైనా నీకు కష్టంగా కనబడినంత మాత్రాన, ఇంకెవరికీ అది సాధ్యంకాదని అనుకోకు.
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 19 మార్చి 2024

ఎన్నికల బృహత్ పర్వం!

ప్రజాస్వామ్యానికి పండుగ లాంటి ఎన్నికల సమయం వచ్చింది. దేశవ్యాప్త సార్వత్రిక ఎన్నికలకూ, అదే విధంగా మరో 4 రాష్ట్రాల శాసనసభల ఎన్నికలకూ శనివారం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్ ప్రకటించడంతో ఒక బృహత్ యజ్ఞానికి అంకురార్పణ జరిగింది. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యంలో మరో నెల రోజుల పైచిలుకులో తొలి దశతో సుదీర్ఘ ఎన్నికల పర్వం ఊపందుకోనుంది. ఇదే ఏడాది అమెరికా సహా పలు భారీ ప్రజాస్వామ్య దేశాలు ఎన్నికలకు సిద్ధమవుతుండగా, 96.9 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లతో మన దేశం సంఖ్యాపరంగా అన్నిటి కన్నా ముందు వరుసలో ఉంది. అలాగే, మిగిలిన దేశాలతో పోలిస్తే సుదీర్ఘంగా ఈ ప్రక్రియ సాగనుంది. దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు సైతం ఇలాగే సుదీర్ఘంగా సాగాయి. 489 స్థానాలకు గాను మొత్తం 68 దశల్లో అప్పట్లో ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత మళ్ళీ అంత సుదీర్ఘంగా సాగుతున్నవి ఈ సార్వత్రిక ఎన్నికలే. ఈ ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు 44 రోజుల వ్యవధిలో ఈ హంగామా కొనసాగుతుంది. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. దాంతో రానున్న రెండున్నర నెలలు వేసవి వేడితో పాటు దేశమంతటా ఎన్నికల ఉష్ణోగ్రతలు పెరిగిపోనున్నాయి.

ఇవి యువతరం ఎన్నికలు కావడం విశేషం. ఓటర్లలో 29 శాతం మంది 18 నుంచి 29 ఏళ్ళ మధ్యవయసు యువతరమే. 2660 రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొనే ఈ ఎన్నికలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవి కూడా! అధికారికంగా అభ్యర్థులకు ఎన్నికల వ్యయ పరిమితులు విధించారన్న మాటే కానీ, పార్టీల ప్రచారం సహా ఈ ఎన్నికల తతంగం మొత్తం ఖర్చు దాదాపు రూ. 1.2 లక్ష కోట్లు దాటుతుందని లెక్క. ఏకంగా 15,256 అడుగుల ఎత్తైన ప్రాంతంలోనూ పోలింగ్ కేంద్రం నిర్వహిస్తున్న బృహత్తర ప్రక్రియ ఇది. వెబ్‌సైట్లు, సోషల్ మీడియా, ఫోన్-ఇన్ ప్రచార సాధనాలతో వర్చ్యువల్ ప్రచారం ప్రబలిన ఆధునిక కాలమిది. ఓటింగ్‌కు 48 గంటల కన్నా ముందే ప్రచారం ఆపాలి, అంశాల ప్రాతిపదికన – కులమతాలకూ, విద్వేషానికీ దూరంగా ప్రచారం సాగాలి లాంటి నిబంధనల్ని ఆచరణలో పెట్టించడం ఈసీకి కష్టమే. అలాగే 1999లో 29 రోజులతో మొదలై గత 2019లో 39, ఈసారి 44 రోజులకూ వ్యాపిస్తూ పోతున్న ఎన్నికల ప్రక్రియ ప్రభుత్వ యంత్రాంగం చేతిలో ఉండే పాలకపక్షాలకు వాటంగా మారుతుందని ఆరోపణలొస్తున్నాయి.

షెడ్యూల్ ప్రకటన ఫలితంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో ఈసీ క్రియాశీలక పాత్ర మొదలైంది. తాజాగా సోమవారం గుజరాత్, యూపీ సహా అరడజను రాష్ట్రాల్లో హోమ్‌శాఖ కార్యదర్శులను తొలగిస్తూ ఈసీ కొరడా ఝుళిపించింది. పశ్చిమ బెంగాల్‌లో ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడైన డీజీపీపై వేటు వేసింది. ఎన్నికలు నిష్పక్షపాతంగా సాగాలంటే, ఆ యా ప్రాంతాల్లో పాలకపక్ష అనుకూలురని పేరుబడ్డ అధికారులకు చెక్ చెప్పడం సమంజసమే, స్వాగతించాల్సిందే. అయితే, అనేక సందర్భాల్లో కేంద్రంలోని పాలక వర్గాల చేతిలోని సంస్థగా ఈసీ వ్యవహరిస్తోందని ఆరోపణలు వింటూనే ఉన్నాం. అవన్నీ నిరాధారమని మాటలతో కన్నా చేతల ద్వారా తేల్చడమే ఈసీ ముందున్న మార్గం. ఈసీ స్వతంత్ర ప్రతిపత్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఒకప్పటి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్‌ను ఆదర్శంగా నిలుపుకోవాలి. పాలకుల కన్నా ప్రజలకు జవాబుదారీగా ఈసీ నిలబడాలి. డబ్బు, అధికారం లేనివారు సైతం ఎన్నికల బరిలో స్వేచ్ఛగా పోటీ చేసే ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి.

దురదృష్టవశాత్తూ పరిస్థితులన్నీ ఆ ఆదర్శాలకు తగ్గట్టు ఉన్నాయన్న భరోసా ఇప్పటికీ పూర్తిగా కలగడం లేదు. ఈ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతున్న సమయంలోనే దేశంలో ఒకటికి రెండు కీలక పరిణామాలు సంభవించాయి. రహస్యమయమైపోయిన ఎన్నికల బాండ్లలో దాతలు, గ్రహీతల (పార్టీల) వివరాలు వెల్లడించాలని సర్వోన్నత న్యాయస్థానం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ)ని ఆదేశించాల్సి వచ్చింది. మరోపక్క మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని కమిటీ 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' అంశంపై వేలకొద్దీ పేజీల నివేదిక సమర్పిస్తూ, లోక్‌సభకూ, రాష్ట్రాల శాసనసభలకూ ఏకకాలంలో ఎన్నికలు జరగాలని సిఫార్సు చేసింది. ఇంకొకపక్క కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక విధానంలో సుప్రీమ్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తికి భాగం లేకుండా ప్రభుత్వం ఆ మధ్య చేసిన మార్పులు సైతం మరోసారి తెర మీదకు వచ్చాయి. ఈ పరిణామాలన్నీ ఒక రకంగా భారత ప్రజాస్వామ్య ప్రస్థానం నునుపైన జారుడు శిఖరం మీద సాగుతున్న అంశాన్ని పట్టిచూపాయి. రానున్న కాలంలో ఈ ప్రయాణం ఇంకెంత సంక్లిష్టం కానున్నదో చెప్పకనే చెప్పాయి.

బాండ్ల సాక్షిగా పారిశ్రామిక వర్గాలకూ, రాజకీయాలకూ మధ్య రహస్యబంధం అంతకంతకూ బలపడుతున్న వేళ, దేశమంతా ఒకేసారి ఎన్నికలతో సమస్తం కేంద్ర పాలకుల కనుసన్నల్లోకి మార్చాలని చూస్తున్న వేళ... రానున్న ఎన్నికల్లో ప్రజలెన్నుకొనే ప్రభుత్వాలు కీలకం కానున్నాయి. ''చరిత్ర కూడలిలో నిల్చొని, ఏ మార్గంలో వెళ్ళాలో ఎంచుకోవాల్సిన పరిస్థితి ప్రతి జాతికీ ఒకానొక దశలో వస్తుంది'' అని భారతదేశానికి రెండో ప్రధాన మంత్రి అయిన లాల్‌బహదూర్ శాస్త్రి ఒక సందర్భంలో అన్నారు. ఆ మార్గాన్ని బట్టే భవితవ్యం ఉంటుంది. ప్రజాస్వామ్య భారతావని తన ప్రయాణంలో ఇప్పుడు సరిగ్గా అదే స్థితిలో ఉంది. ఈ ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా ఎంచుకొనే మార్గం పౌరుల మొదలు న్యాయవ్యవస్థ, ప్రభుత్వ అధికార వ్యవస్థ, మీడియా దాకా సమస్తాన్నీ ప్రభావితం చేయనుంది. అందుకే, సరైన మార్గాన్ని ఎంచుకోవడం అత్యవసరం. సరైన ఎంపిక సాగాలంటే, అలక్ష్యం చేయకుండా విలువైన ఓటుహక్కును వినియోగించుకోవడమే సాధనం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.దశమి రా.2.49 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పునర్వసు రా.10.47 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.10.18 నుండి 11.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.31 నుండి 9.19 వరకు, తదుపరి రా.10.57 నుండి 11.45 వరకు, **అమృతఘడియలు:** రా.8.19 నుండి 10.05 వరకు.


సూర్యోదయం : 6.10
సూర్యాస్తమయం: 6.05
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ప్రమాదంలో లౌకికవాదం

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) జాబితాలో చేర్చిన మతపరమైన మైనారిటీలు వారి స్వదేశాలలో గొప్ప అణచివేతను ఎదుర్కొంటున్నారు. కానీ జాబితాలో చేర్చని ఇతర మైనారిటీలు కూడా ఉన్నారు. యూదులు, నాస్తికులు, అజ్ఞేయవాదులతో పాటు హజారా, అహ్మదీయ, షియా వంటి ఇస్లామిక్ శాఖలకు చెందిన వ్యక్తులు అందుకు కొన్ని ఉదాహరణలు. కేవలం పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ – మూడు దేశాలకు చెందిన శరణార్థులకే సీఏఏ కింద రక్షణ ఉంటుంది. ఇతర పొరుగు దేశాల్లోని వారిని అది విస్మరిస్తోంది. సీఏఏ రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు కావాలంటే, చేసిన వర్గీకరణ సహేతుకమైనదనీ, సాధించాలనుకున్న అంశంతో హేతుబద్ధమైన సంబంధాన్ని కలిగి ఉందనీ నిరూపించాల్సి ఉంది. మతపరమైన వర్గీకరణ, అలాగే ఇతర పొరుగు దేశాలను ఈ చట్టం నుండి తొలగించడం దేశ లౌకిక మూలాలపైనే సందేహాలను కలిగిస్తుంది.

హేతుబద్ధత ఉండాలి!

విశ్లేషణ



వికాస్ సింగ్

అత్యంత కఠినతరమైన పోరాటం తర్వాత భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు, మన వ్యవస్థాపక పితామహులు అన్ని మతాల ప్రజలకు స్వర్గధామంగా ఉండే లౌకిక దేశంగా భారతదేశం ఉంటుందని భావించారు. దేశ విభజన సమయంలో పాకిస్తాన్, తూర్పు బెంగాల్ (తరువాత తూర్పు పాకిస్తాన్, ఇప్పుడు బంగ్లాదేశ్) నుండి హిందువులు, సిక్కులు వలస వచ్చారు. కొత్త జీవితాన్ని వెతుక్కుంటూ భారతదేశానికి వచ్చిన వారికి మన ప్రజలు సాదరంగా స్వాగతం పలికారు. ఇదే తరహాలో, పౌరసత్వ (సవరణ) చట్టం, 2019, లేదా సీఏఏ, మతపరమైన హింస కారణంగా అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ లేదా పాకిస్తాన్ నుండి పారిపోయి వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులకు భారత పౌరసత్వాన్ని సజావుగా అందించడానికి ప్రయత్నిస్తుంది.

పౌరసత్వ చట్టం, 1955, దాని అసలు రూపంలో, 1950 జనవరి 26 తర్వాత దేశంలో జన్మించిన ఎవరినైనా భారతీయ పౌరుడిగా పరిగణించాలని సూచించింది. పౌరసత్వ (సవరణ) చట్టం, 2003 అమలులోకి వచ్చి, రెండు కొత్త కటాఫ్ తేదీలను ప్రవేశపెట్టిన తర్వాత ఈ స్థితి ఆగిపోయింది. దీనివల్ల, భారతదేశంలో 1950 జనవరి 26 తర్వాత 1987 జూలై 1కి ముందు జన్మించినవారే భారతీయ పౌరులు అవుతారు. అలాగే 1987 జూలై 1, 2004 డిసెంబర్ 3 మధ్య జన్మించినవారు భారత పౌరుడిగా పరిగణించబడటానికి భారతీయ పౌరసత్వం కలిగిన తల్లి లేదా తండ్రిని కలిగి ఉండాలి. 2004 డిసెంబరు 3 తర్వాత జన్మించిన వారికి, తల్లిదండ్రులిద్దరూ భారతీయ పౌరులుగా ఉండాలి; లేదా ఒకరు భారతీయ జాతీయులైతే, మరొకరు ఆ వ్యక్తి పుట్టిన సమయంలో 'అక్రమ వలసదారు' కాకూడదు. వాస్తవానికి, 2003 చట్టం ప్రకారం, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ లేదా ఇతర ప్రయాణ పత్రాలు లేకుండా భారతదేశంలోకి ప్రవేశించిన విదేశీయుడిని మొదటిసారిగా 'అక్రమ వలసదారు'గా నిర్వచించారు. ఇలాంటివారు రిజిస్ట్రేషన్ లేదా సహజీకరణ ద్వారా పౌరసత్వం కోసం దరఖాస్తు చేయడం నిషేధించబడింది.



అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ లేదా పాకిస్తాన్ నుండి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సీ లేదా క్రిస్టియన్ మతాలకు చెందిన ఏ వ్యక్తినైనా 2014 డిసెంబర్ 31న లేదా అంతకు ముందు భారతదేశంలోకి ప్రవేశించిన వారిని మినహాయించడానికి, 'అక్రమ వలసదారు' నిర్వచనాన్ని ఇప్పుడు సీఏఏ ద్వారా సవరించారు. అలాగే పాస్‌పోర్ట్ (భారతదేశంలోకి ప్రవేశం) చట్టం, 1920 లేదా ఫారినర్స్ యాక్ట్, 1946 ప్రకారం, 'అక్రమ వలసదారు' నిర్వచనం నుండి వీరు మినహాయింపు పొందారు. ఈ సమూహానికి చెందిన వ్యక్తులు భారతదేశంలోకి ప్రవేశించిన తేదీ నుండి ఇప్పుడు భారతదేశ పౌరులుగా పరిగణించబడతారు. అటువంటి వ్యక్తుల సహజీకరణకు అర్హతలు కూడా సడలించారు. గత 14 సంవత్సరాలలో వ్యక్తి ఐదు సంవత్సరాలకు తక్కువ కాకుండా భారతదేశంలో లేదా ప్రభుత్వ సేవలో ఉండాలి. ఈ గ్రూప్‌లోకి రాని వ్యక్తుల కోసం, భారతదేశంలో లేదా ప్రభుత్వ సేవలో ఉండే కాల వ్యవధి మునుపటి 14 సంవత్సరాలను 11 ఏళ్లకు కుదించారు.

మతపరమైన హింస నుండి పారిపోయిన శరణార్థులను స్వాగతించే, రక్షించే ఒక మైలురాయి చట్టంగా సీఏఏని పాలక యంత్రాంగం ప్రశంసించింది. అయినప్పటికీ, అనేక ఆందోళనలు పరిష్కారం కాలేదు. జాబితాలో చేర్చిన మతపరమైన మైనారిటీలు వారి స్వదేశాలలో గొప్ప అణచివేతను ఎదుర్కొంటున్నారు. అలాగే జాబితాలో చేర్చని ఇతర మైనారిటీలు కూడా ఉన్నారు. యూదులు, నాస్తికులు, అజ్ఞేయవాదులతో పాటు హజారా, అహ్మదీయా, షియా వంటి ఇస్లామిక్ శాఖలకు చెందిన వ్యక్తులు కొన్ని ఉదాహరణలు. కేవలం మూడు దేశాలకు చెందిన శరణార్థులకు సీఏఏ కింద రక్షణ ఉంటుంది. నేపాల్‌లోని క్రైస్తవులు, మయన్మార్‌లోని రోహింగ్యాలు, శ్రీలంకలోని తమిళ జాతికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న ప్రమాదాలకు సంబంధించి కళ్ళు మూసుకుంది. కాబట్టి సీఏఏ రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు కావాలంటే, చేసిన వర్గీకరణ సహేతుకమైనదనీ, సాధించాలనుకున్న అంశంతో హేతుబద్ధమైన సంబంధాన్ని కలిగి ఉందనీ నిరూపించాల్సి ఉంది.

పేర్కొన్న మానవతా లక్ష్యం ప్రశంసనీయమే అయినప్పటికీ, ఇది ప్రశ్నకు తావిస్తోంది. ఇతర మతాల ప్రజలను, ఇతర పొరుగు దేశాలలో మతపరమైన హింసను ఎదుర్కొంటున్న వారిని ఎందుకు వదిలిపెట్టారు? శరణార్థుల స్థితికి సంబంధించిన 1951 ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్‌పై, శరణార్థుల స్థితికి సంబంధించిన 1967 ప్రోటోకాల్‌పై భారతదేశం సంతకం చేయలేదు. మన పెద్ద జనాభా, పరిమిత ఆర్థిక వనరులను బట్టి దీన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే, సీఏఏకీ, 1951 కన్వెన్షన్‌కీ మధ్య పూర్తి వ్యత్యాసం ఉంది. కన్వెన్షన్ శరణార్థులు ఎదుర్కొనే వివిధ అణచివేత అంశాలను పేర్కొంటోంది. జాతి, మతం లేదా ఒరిజనల్ దేశం ఆధారంగా వారిపై వివక్ష చూపకుండా ఆయా దేశాలను నిషేధిస్తుంది. ఈ ఒక్క అంశానికి సంబంధించి మాత్రమే భారత ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ తప్పుబట్టి ఉంటుంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 77 ఏళ్లు అవుతుందనీ, మనం ఆధునిక యుగంలోకి అడుగు పెట్టామనీ గుర్తుంచుకోవాలి. భారతదేశం బహుళ సాంస్కృతిక, లౌకిక ప్రజాస్వామ్య ప్రాతిపదికన ఏర్పడింది. మతపరమైన వర్గీకరణ, ఇతర పొరుగు దేశాలను సీఏఏ నుండి మినహాయించడం వల్ల దేశం లౌకిక మూలాలపై బహుశా అనుద్దేశపూర్వకంగా అయినా సరే, అనుమానాలు ఉన్నాయి. ఈ అంశం దురదృష్టవశాత్తూ ఈ చట్టంలోని సంక్షేమ ఆధారిత లక్ష్యాన్ని కప్పివేసింది.

వ్యాసకర్త సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది

అసంపూర్ణ చట్టం

విశ్లేషణ



సంజయ్ హజారికా

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), 2019కి జవసత్వాలు అందించే 39 పేజీల నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర పాలనా యంత్రాంగం ఓటర్లను విభజించాలని చూస్తోందంటూ ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్న తరుణంలో లోక్‌సభ ఎన్నికలకు కొన్ని వారాల ముందుగా చోటు చేసుకున్న ఈ పరిణామం వివాదాన్ని రేకెత్తించింది. కాగా, మరో ఎన్నికల హామీని తాను నెరవేర్చినట్లు బీజేపీ చెప్పుకొంది. పౌరసత్వాన్ని హరించడానికే సీఏఏని ఉపయోగిస్తారనే భయాలు కేవలం నిరాధారమైనవని తిప్పికొట్టింది.

అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో హింసాత్మక చర్యల కారణంగా పారిపోయి భారతదేశంలో అక్రమంగా లేదా అనధికారికంగా స్థిరపడిన ఆరు మతాలకు చెందిన మైనారిటీలకు పౌరసత్వం అందించడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ఈ ఆరు మత బృందాలు ఆ దేశాలకు చెందిన హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు, సిక్కులు, పార్సీలు, జైనులు. ఆ దేశాలకు చెందిన ముస్లింలను సీఏఏ నుంచి మినహాయించారు. ఈ దేశాలకు చెందిన ముస్లింలను పై చట్టం నుంచి మినహాయించడానికి హేతువు ఏమిటంటే... ఆ మూడు దేశాలూ ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ఇస్లామిక్ దేశాలు. కాబట్టి వారు తమతమ దేశాలలో తగు న్యాయం పొందగలరని ఇది సూచిస్తుంది.

దరఖాస్తులను పర్యవేక్షించడానికి కేంద్ర అధికారులతో కూడిన కమిటీలను రూపొందించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియపై నియంత్రణను కలిగి ఉంది. పాత విధానంలో జిల్లా అధికారులే అభ్యర్థనలను స్వీకరించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశం ప్రకారం పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడంలో నిరీక్షణ వ్యవధిని, సీఏఏ 11 నుండి ఐదు సంవత్సరాలకు తగ్గిస్తుంది. అయితే దరఖాస్తుదారులు వారి మాతృభూమి నుండి అధికారిక పత్రాలను సమర్పించాలి.

అస్సాం, పశ్చిమ బెంగాల్, కేరళతోపాటు దేశంలోని ఇతర ప్రాంతాలలో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నప్పటికీ, 2019–20లో భారతదేశం అంతటా ఈ సవరణ చట్టంపై వీచిన తుపానుతో పోలిస్తే ఇవి పెద్దగా సద్దులేనివిగానే కనిపిస్తాయి. అయితే, రాబోయే కొద్ది వారాల్లో అభ్యంతరాలు పెరిగే అవకాశం ఉంది. ఈ అంశంలో మరొక పెద్ద సమస్య దాగి ఉంది. ముఖ్యంగా రాజ్యాంగబద్ధతను వ్యతిరేకిస్తున్న సీఏఏకి సంబంధించిన అనేక చట్టపరమైన సవాళ్లను సుప్రీంకోర్టు ఇంకా వినలేదు, తీర్పు ఇవ్వలేదు. ఇక్కడ కీలకమైన వాదన ఏమిటంటే, మతాన్ని పౌరసత్వానికి గుర్తుగా ప్రతిష్ఠించడం ద్వారా, రాజ్యాంగానికి చెందిన ప్రాథమిక స్వరూపాన్నే పౌరసత్వ సవరణ చట్టం ఉల్లంఘిస్తుందన్నదే. అదే సమయంలో భారత రాజ్యాంగం మతపరమైన వివక్షను నిషేధిస్తుంది. చట్టం ముందు ప్రజలందరికీ సమానత్వం, చట్టం ద్వారా సమాన రక్షణకు హామీ ఇస్తుంది.

ఈ చట్టంపై తొలి సవాలు 2020లో వచ్చింది. సుప్రీంకోర్టు ఈ అభ్యంతరాలను ఇంకా వినలేదు. అయితే, ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, గత ఏడాది డిసెంబర్‌లో పౌరసత్వ చట్టం, 1955లోని సెక్షన్ 6ఏ చెల్లుబాటుకు సంబంధించిన మరో కేసులో తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నిర్దిష్ట సవరణ 1985లో కుదిరిన అస్సాం ఒప్పందం నాటిది. ఇది బంగ్లాదేశ్ నుండి అక్రమ వలసలకు సంబంధించిన శాశ్వత సవాలుపై రాష్ట్రంలో స్థిరత్వాన్ని తీసుకురావడానికి ప్రయత్నించింది. చట్టవిరుద్ధంగా వచ్చిన వారిని భారతీయ పౌరులుగా గుర్తించడానికి ఇది ఒక యంత్రాంగాన్ని అందించింది. అస్సాంలో బంగ్లాదేశ్ వలసదారులకు పౌరసత్వం మంజూరు చేయడానికి 1971 మార్చి 25ని కటాఫ్ తేదీగా నిర్ణయించడమైంది.

పౌరసత్వ సవరణ చట్టం భారతదేశం అంతటా ఒకే విధంగా వర్తించదు. ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, ప్రత్యేక రాజ్యాంగ రక్షణ ఉన్న అస్సాం (తక్కువ జనాభాతో), త్రిపురలోని మూడు గిరిజన ప్రాబల్య ప్రాంతాలలో ఈ చట్టం అమలు కాదు.


2019లో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్నార్సీ)ని తీసుకురావడం ద్వారా అస్సాంలో పరిస్థితి క్లిష్టంగా మారింది. 19 లక్షల దరఖాస్తుదారులు దీనికి వెలుపలే ఉండిపోయారు. వీరిలో ఎక్కువమంది హిందువులు, స్థానిక సంఘాల సభ్యులే ఉన్నారు తప్పితే, ముస్లింలు కాదు. ఇది బీజేపీనీ, దాని మిత్రపక్షాలనూ ఆశ్చర్యానికి గురి చేసింది. అప్పటి నుంచి వారు ఈ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తున్నారు. అస్సాంలో అక్రమ వలసలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్యకర్తలు కూడా సీఏఏని వ్యతిరేకించారు. మతం పౌరసత్వాన్ని నిర్ణయించకూడదని వాదించారు.

సహాయాన్ని పొందవలసిన సామాజిక బృందాల జాబితా కూడా అసంపూర్ణంగా కనిపిస్తోంది. ఇందులో శ్రీలంకలోని తమిళ హిందువులు, క్రైస్తవులు వంటి సమూహాలు లేవు. వీరిలో 90,000 మందికి పైగా భారత్‌లో శరణార్థులుగా ఉన్నారు. మయన్మార్ నుండి వచ్చిన చిన్ క్రైస్తవులు కూడా జాబితాలో లేరు. వీరిలో 45,000 మందికి పైగా ఒక్క మిజోరంలోనే ఉన్నారు.

ఒక మతానికి చెందినవారైనప్పటికీ, ఆ మతంలోని మైనారిటీ శాఖలపై వేధింపుల ప్రమాదం తగ్గదు. అయినా పాకిస్తాన్ లోని అహ్మదీయులు, అఫ్గానిస్తాన్‌లోని హజారాలు వంటి బలహీనమైన ముస్లిం సమూహాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం సీఏఏకి కనిపించలేదు.

వ్యాసకర్త రచయిత, కాలమిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

నేర్వవలసిన చరిత్ర పాఠాలు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు


ప్రపంచంలో సంభవించే ఘటనలను, లేదా పరిణామాలను హేతువాదం ద్వారా కార్య కారణ సంబంధాల పరిశోధనల ద్వారా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలే గాని – కనిపించని ఏ దేవుళ్లకో మొత్తుకుంటేనో ప్రకృతి రహస్యాలు అర్థం కావు."
– సుప్రసిద్ధ ప్రపంచ తార్కికులు థేల్స్, అనాక్సిమాండర్, యూక్లిడ్, బుద్ధుడు!

ధనిక వర్గ వ్యవస్థల్లో, పెట్టుబడిదారీ వ్యవస్థల్లో అనివార్యమైన సామాజిక, ఆర్థిక అసమానతలు ఎలాంటి పరిస్థితుల్ని సామాన్య కష్ట జీవులకు సృష్టించిపెడతాయో ప్రపంచ ప్రసిద్ధ నవలా రచయిత అన్నా రాచెస్టర్ రాసిన ''కార్మికులు– రాక్షసి బొగ్గు'' అన్న నవలలో వివరించాడు.

యలమంచిలి శివాజీ 'ఎదురీత' పుస్తకం కూడా భారత వ్యవసాయ, పారిశ్రామిక వ్యవస్థలలో సామాజిక ఆర్థిక వ్యవస్థల్లోని అసమానతలనూ, వాటిని తొలగించే మార్గాలనూ చెబుతోంది. శివాజీ దశాబ్దం పాటు వెలువరించిన రాజ్యసభ ప్రసంగాలను 'ఎదురీత' మకుటంతో ప్రచురించారు 'రైతు నేస్తం' అధినేత వెంకటేశ్వర్రావు. డా॥ శివాజీ ఈ గ్రంథంలో దేశంలోని ప్రస్తుత నాయకుల వ్యవహార శైలినీ, చట్టసభలు నడుస్తున్న తీరుతెన్నుల్నీ పరిశీలించి విలువలు ఎంతగా పతనమైపోతున్నాయో అని వ్యథను వ్యక్తం చేశారు. అంతేగాదు, చివరికి నాటి ప్రధానీ, ఆర్థిక వేత్తా అయిన మన్మోహన్ సింగ్ తీసుకొనే ప్రతి చర్య దేశంలోని స్టాక్ ఎక్స్ఛేంజీలను జూద గృహాలుగా మార్చడానికే ఉపయోగపడిందని అన్నారు. మన్మోహన్ ప్రభుత్వ చర్యలు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకూ, వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామిక రంగానికీ సంపదను బదిలీ చేయడానికే ఉపయోగపడ్డాయని శివాజీ విమర్శించారు. అలా గాకుండా ఉపాధి కోసమో, ఉన్నత విద్య కోసమో తగినన్ని సౌకర్యాలను గ్రామీణ ప్రాంతాల్లోనే కల్పించాలని శివాజీ కోరారు. తన వైఖరికి ప్రధాన కారణాన్ని ఆయన బాహాటంగానే ప్రకటించారు:

''నేను మధ్యతరగతి రైతు కుటుంబం నుంచి వచ్చిన రాజకీయ నాయకుణ్ణి కావటం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు (కూలీలు) పడే కష్టాలు ఎలా ఉంటాయో ఎవరూ చెప్పకుండానే తెలుసుకోగలిగాను. పస్తులు ఉంటున్నా గుట్టు చప్పుడు కాకుండా జీవించే మనస్తత్వం మన గ్రామీణులది. అలాంటి రైతులు ఈ రోజున తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని బజారునపడి రోదిస్తున్నారు. పత్తి రైతులు, పొగాకు రైతులు కక్కలేక, మింగలేక బతుకులు ఈడుస్తున్నారు'' అని చెప్పారు. చివరగా అన్ని పార్టీలకూ ఒక హెచ్చరిక కూడా శివాజీ చేశారు: ''గూండాలూ, నేర చరిత్ర ఉన్న వ్యక్తులనూ, పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్న కుహనా రాజకీయుల్నీ అన్ని పార్టీలూ బహిష్కరించవలసిన సమయం వచ్చింది. అలా జరక్కపోతే ఈ దేశంలో ఇక ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టనట్టే లెక్క''.

రెండో మాట



నిజానికి, మనం ఇప్పుడు మాట్లాడుకొంటున్నది క్రీ.శ. 21వ శతాబ్దం గురించి. కాని క్రీస్తు పూర్వం 2100 ప్రాంతంలోనే సుమేరియా పాలకులు ప్రజా బాహుళ్య ప్రయోజనాలను ఈడేర్చవలసిన సమాజ సంపదను కొలది మంది ప్రయోజనాల కోసం దుర్వినియోగం కావడం గమనించారు. వ్యక్తిగత దోపిడీకి ఆస్కారమిచ్చే పరిస్థితుల్ని అరికట్టేందుకు తీసుకున్న కఠిన చర్యలను ఇక్కడ మనం గుర్తు చేసుకోవడం మంచిది.

వేల సంవత్సరాల క్రితమే సుమేరియాలో యావత్తు ఆర్థిక వ్యవస్థను నాటి పాలకులు స్వాధీన పరచుకుని దేశ ప్రజాబాహుళ్యం కోసం వినియోగించారు. సాగుభూమినంతనూ పాలకులు ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకోవడంతో, ప్రభుత్వ గిడ్డంగులకు ధాన్యరాశులు చేరి సవ్యంగా ఏకకాలంలో ప్రజలకు అందాయి. దాదాపు అదే కాలపు నాటి బాబిలోనియా పాలకులు కూడా సామాన్య పశుల కాపరులకూ, చేతివృత్తులతో జీవిస్తున్న కళాకారులకూ వేతనాలను నిర్ణయించారు.

అలాగే ఈజిప్టులో పాలకులు (టోలమీలు) భూమిపై అధికారం ద్వారా వ్యవసాయాన్ని నిర్వహించి రైతులకు, కార్మికులకు ప్రయోజనం కల్గించారు. గనులనూ పాలక వర్గమే నిర్వహించింది. ఖనిజ సంపదను కోటికి పడగలెత్తిన సోమరుల నుంచి, స్వార్థపరుల నుంచి రక్షించి ప్రజల ప్రయోజనాల్ని రక్షించింది.

కనుకనే ఈ పరిణామాలన్నింటి సారాంశాన్ని వర్తమాన కాలానికి వర్తింపజేస్తూ సుప్రసిద్ధ చరిత్ర కారుడూ, 'లెసన్స్ ఆఫ్ హిస్టరీ' (చరిత్ర పాఠాలు) గ్రంథ కర్తా అయిన విల్ డ్యూరాంట్ తన అనంతర పరిశీలనను సోషలిస్టు, కేపిటలిస్టు వ్యవస్థల అనుభవాలకు అన్వయింపజేస్తూ ఇలా పేర్కొన్నాడు: ''సోషలిజం... స్వేచ్ఛావాయువుల్ని అనుమతించక తప్పనట్టే మరో వైపున వ్యక్తిగత పెట్టుబడి దోపిడీని స్వేచ్ఛగా అనుమతించడానికి అలవాటుపడిన కేపిటలిజం కూడా తన వ్యవస్థలో సమానత్వ ధోరణులను అనుమతించక తప్పని పరిస్థితి వచ్చింది.''

ఈ చరిత్ర పాఠాలకు శివాజీ కూడా అతీతుడు కాదు. ఆ పాఠాలలో భాగమే అతని 'ఎదురీత' అని పాఠక లోకమూ ఈ పుస్తకాన్ని చదివితే తీర్మానించుకొంటుంది!

abkprasad2006@yahoo.co.in

కృతఘ్నుడు

'కృతఘ్నఘ్నాయ దేవాయ, జ్యోతిషాం పతయే నమః' అని ఆదిత్య హృదయ స్తోత్రంలో కనిపిస్తుంది. కృతఘ్నులను శిక్షించే దైవమైన వెలుగుల రాజు సూర్యుడికి నమస్కారం, అని. అప్పుడప్పుడూ సాటి వాళ్ళ సహాయం అవసరమవకుండా ఎంతటి వారికయినా బతుకు నడవదు. కష్టంలో ఉండగా ఏ బంధువులో, మిత్రులో, ఆప్తులో, అపరిచితులో చేయూత ఇచ్చి చేసిన ఉపకారం వల్ల కాస్త నిలదొక్కుకొని, ఆ కష్టం అధిగమించి ముందుకు సాగడం అందరి జీవితాలలోనూ జరిగేదే.



జ్యోతిర్మయం

ఇతరుల ఉపకారానికి కృతజ్ఞులై, వాళ్ళకు ఎప్పుడెప్పుడు తగిన ప్రత్యుపకారం చేయగలమా, ఎప్పుడెప్పుడు వారి ఋణం తీర్చుకోగలమా అని ఉబలాటపడేవాళ్ల ఉదాత్త స్వభావులు. ఉత్తములు. ఆదికావ్యమైన రామాయణం తెరిచి చూస్తే, అందులో మొట్టమొదటి సర్గలో రెండో శ్లోకంలోనే ధర్మజ్ఞతనూ, కృతజ్ఞతనూ ఉత్తమ పురుషుల లక్షణాలుగా ప్రస్తావించడం కనిపిస్తుంది.

అందరూ ఉత్తములూ, ధీరోదాత్తులూ కాలేరు. తమకు ఒకరు చేసిన ఉపకారానికి ఎత్తుకెత్తుగా తగినంత ప్రత్యుపకారం చేయలేని ఎందరో 'సగటు' మనుషులు ఉంటారు. వాళ్ళలో కూడా చాలా మంది, కనీసం, ఉపకారి పట్ల కొంత విశ్వాసమూ, సద్భావమూ, సుహృద్భావమూ కలిగి ఉంటారు. వీళ్ళు మధ్యములు. ఇతరులు చేసిన సహాయాన్ని తమ కష్టం గడిచిపోయిన తక్షణమే మరిచిపోయే ప్రబుద్ధులు అధములు. వీళ్లలో అధమాధములు, ఇతరులు ఉదార బుద్ధితో చేసిన ఉపకారాన్ని తమ సమర్థతగా, ఆ ఉపకారుల తెలివితక్కువతనంగా భావించి, అవకాశం చిక్కితే ఆ ఉపకారికి అపకారం చేయడానికి కూడా వెనకాడరు. సమాజంలో అన్ని రకాల వాళ్ళూ తటస్థపడతారు.

ఈ లోకంలో జరిగే విషయాలన్నిటికీ ఒక సాక్షి సూర్యభగవానుడు. లోకులు చూపే కృతఘ్నతను కూడా ఆయన కనిపెట్టే ఉంటాడని ఈ స్తోత్రం చెప్తుంది. కేవలం గమనించడమే కాదు, సూర్యుడు 'కృతఘ్నఘ్నుడు'. అంటే, కృతఘ్నులను సరైన సమయంలో తగిన రీతిలో శిక్షిస్తాడు. ('ఘ్న' అంటే చంపడం, హాని చేయడం, లాగి వేయడం, తొలగించడం అన్న అర్థాలు వస్తాయి). మంచి కానీ, చెడు కానీ, మనిషి చేసే ప్రతి చర్యకూ ప్రకృతి లోనే ప్రత్యక్ష సాక్షులున్నారు అని పురాణ కథలు పదే పదే బోధిస్తాయి.

– ఎం. మారుతి శాస్త్రి

27 నుంచి బస్సు యాత్ర

ఇడుపులపాయ నుంచి వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార భేరి

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకారం

సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాల్లో మినహా మిగతా జిల్లాల్లో బస్సు యాత్ర

సాక్షి, అమరావతి : పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు.. మరోసారి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుని అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ప్రచార భేరి మోగించనున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించి.. ఎన్నికల సంగ్రామానికి 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు దాదాపు 21 రోజులపాటు బస్సు యాత్ర కొనసాగనుంది.



పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాలు (విశాఖపట్నం, ఏలూరు, అనంతపురం, బాపట్ల) మినహా మిగతా జిల్లాల్లో బస్సు యాత్ర జరగనుంది. ప్రతి రోజూ ఒక పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బస్సు యాత్ర కొనసాగనుంది. ఈ యాత్రలో ఉదయం పూట వివిధ వర్గాలు, రంగాల ప్రజలతో సీఎం జగన్ సమావేశమవుతారు. ప్రభుత్వ పనితీరును మరింతగా మెరుగు పర్చుకోవడానికి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గంలో బహిరంగ సభ ఉంటుంది. ఆ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఈ సభకు తరలి రానున్నారు. బస్సు యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు సీఎం జగన్ పూర్తిగా ప్రజలతో మమేకం కానున్నారు. యాత్రలోనే ఎక్కడికక్కడ విడిది చేయనున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని చెబుతూ.. ప్రతి ఇంటికీ మేలు చేశామని వివరించనున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014లో వ్యవసాయ రుణాల మాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ, ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి వంటి వాటితోపాటు 650 హామీలు ఇచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి.. వాటిని అమలు చేయకుండా మోసం చేయడాన్ని కూడా ప్రజలకు విశదీకరించి చెప్పనున్నారు. అప్పట్లో మోసం చేసిన కూటమి మరోసారి జట్టుకట్టి మళ్లీ వస్తోందంటూ ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. మీ బిడ్డ పథకాలు వల్ల మీ ఇంటికి మంచి జరిగి ఉంటే.. మీ బిడ్డకు అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేయనున్నారు.

కదనోత్సాహంలో పార్టీ శ్రేణులు

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్.. గత 58 నెలల్లో డీబీటీ రూపంలో 2.70 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో రూ.1.79 లక్షల కోట్లు వెరసి రూ.4.49 లక్షల కోట్ల ప్రయోజనాన్ని 87 శాతం కుటుంబాలకు చేకూర్చారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా గుమ్మం వద్దకే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. చేసిన మంచిని ప్రతి ఇంటా వివరించి.. ఆశీర్వాదం తీసుకోవడానికి చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గత 58 నెలల పాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రతి నియోజవకర్గం, ప్రతి గ్రామం, ప్రతి ఇంటా కనిపిస్తున్నప్పుడు 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించడం సుసాధ్యమేనని సీఎం జగన్.. శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలకు సముద్రంతో పోటీ పడుతూ జనం హాజరయ్యారు. రాప్తాడు, మేదరమెట్ల సభలు రాష్ట్ర చరిత్రలో అతి పెద్ద ప్రజా సభలుగా నిలిచాయి. ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం 'సిద్ధం' సభల్లో కళ్లకు కట్టినట్లు కన్పించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదనోత్సాహంతో కదం తొక్కుతున్నాయి.

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కకావికలు

వైఎస్సార్‌సీపీ సిద్ధం సభలు సూపర్ హిట్ కావడంతో టీడీపీ శ్రేణులు కకావికలమయ్యాయి. జనసేనతో టీడీపీ పొత్తు లెక్క తేలాక, రెండు పార్టీలు ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభ జనం లేక అట్టర్‌ఫ్లాప్ కావడంతో ఆ పార్టీల శ్రేణులు నైతిక స్థైర్యం కోల్పోయాయి. ఈ క్రమంలోనే ఒకే రోజు 175 శాసనసభ, 24 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన సీఎం వైఎస్ జగన్.. అందులో వంద స్థానాలు అంటే 50 శాతం స్థానాలను బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలకు ఇవ్వడంతో ఆ వర్గాల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఇంటింటా ప్రచారం చేస్తూ ప్రజా క్షేత్రంలో దూసుకెళ్తున్నారు. మరో వైపు నైతిక స్థైర్యం కోల్పోయిన శ్రేణుల్లో ధైర్యాన్ని నింపేందుకు ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దల కాళ్లావేళ్లా పడి ఆ పార్టీతో పొత్తు కుదుర్చుకున్నాక.. మూడు పార్టీలు కలిసి చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో ప్రధాని మోదీ పాల్గొన్నప్పటికీ జనం మొహం చాటేయడంతో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. దాంతో మూడు పార్టీల కార్యకర్తలే కాదు నేతలూ పూర్తిగా డీలాపడ్డారు.

క్లీన్ స్వీప్‌పే లక్ష్యంగా అడుగులు

టీడీపీ-జనసేన-బీజేపీ శ్రేణులు నైతిక స్థైర్యం కోల్పోయి కకావికలమైతే.. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ఈ దశలో సీఎం జగన్ బస్సు యాత్ర వారిలో మరింత ఉత్సాహాన్ని నింపనుంది. క్లీన్ స్వీప్ లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు ముందుకు వేస్తున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులను 'మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం.. ఎన్నికల సమరానికి మేమంతా సిద్ధం' పేరుతో గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్టంగా ఎన్నికలకు సన్నద్ధం చేసేలా సీఎం జగన్ దిశా నిర్దేశం చేస్తారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల కానున్న నేపథ్యంలో, ఆలోగా తొలి దశ ప్రచారంగా బస్సు యాత్ర పూర్తి చేయాలని నిర్ణయించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక మలి విడత ప్రచారాన్ని చేపట్టనున్నారు.

ప్రతి గ్రామానికి వెళ్లండి.. ప్రజల ఆశీర్వాదం తీసుకోండి

పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో ఏపీ సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం



సాక్షి, అమరావతి : ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూలుతో అభ్యర్థులకు మరింత సమయం లభించిందని, ప్రతి గ్రామ సచివాలయాన్ని సందర్శించి.. ప్రజల ఆశీర్వాదం తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ వెసులుబాటును అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ ప్రాంతీయ సమన్వకర్తలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. మే 13న ఎన్నికల పోలింగ్ జరుగుతున్నందున అభ్యర్థులకు సరిపడా సమయం ఉందన్నారు. ఈ సమయాన్ని చక్కగా వినియోగించుకోవాలన్నారు. తమ నియోజకవర్గం పరిధిలోని ప్రతి గ్రామ సచివాలయాన్ని సందర్శించి.. వీలైనంత ఎక్కువ మంది ప్రజలను కలిసేలా అభ్యర్థులు కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు. దీనిపై అభ్యర్థులకు మార్గ నిర్దేశం చేయాలని ప్రాంతీయ సమన్వయకర్తలను ఆదేశించారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా 81 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 18 పార్లమెంటు నియోజకవర్గాల్లో మార్పులు చేశామన్నారు. అభ్యర్థులకు ఇప్పుడున్న సమయం చాలా చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణులు, నాయకత్వాన్ని సంఘటిత పరిచి, వారిని ఏకతాటిపైకి తీసుకువచ్చి కలిసికట్టుగా ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు నడవాలని లక్ష్య నిర్దేశం చేశారు. ఈ దిశగా కలిసి వచ్చే ప్రతి అంశాన్నీ వినియోగించుకుని, ఘన విజయాలు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ సమన్వయకర్తలు ఎప్పటికప్పుడు తమ తమ ప్రాంతాల్లో పరిస్థితులను తెలుసుకుంటూ అభ్యర్థులకు చేదోడు, వాదోడుగా నిలవాలని సూచించారు. బస్సు యాత్రను విజయవంతం చేయడానికి అన్ని రకాలుగా సిద్ధం కావాలని ఆదేశించారు. బస్సు యాత్రలో భాగంగా జరిగే సభలు.. సిద్ధం సభల తరహాలోనే చరిత్రాత్మకం కావాలని దిశా నిర్దేశం చేశారు.

కూటమి ఆశలు పటాపంచలు

- మూడు పార్టీల అనైతిక కలయికకు ప్రజా స్పందన కరవు
- తాడేపల్లిగూడెం, చిలకలూరిపేట సభలు రెండూ అట్టర్ ఫ్లాపే
- కాపు, కమ్మ సామాజికవర్గాలు బలంగా ఉండే ప్రాంతాలైనా ప్రయోజనం శూన్యం
- చిలకలూరిపేట సభ జరిగిన తీరుపై మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల్లో నైరాశ్యం
- ప్రధాని మోదీకి సభలో అవమానం
- జనం వచ్చారని చెప్పుకోవడానికి రోడ్డుపై కార్లు అడ్డంపెట్టి ట్రాఫిక్‌జామ్ చేసిన నేతలు
- 2,500 ఆర్టీసీ బస్సులు అడిగి.. ఆఖరి నిమిషంలో 1,540 బస్సులు క్యాన్సిల్
- మైక్ టవర్లపై కార్యకర్తలను ఎక్కించి టీడీపీ అతి.. చురకలు వేసిన ప్రధాని
- ఐదేళ్ల క్రితం విడిపోయి ఇప్పుడెందుకు కలిశారో చెప్పలేక పోతున్న మూడు పార్టీల నేతలు
- తాడేపల్లిగూడెం సభలో సీఎం జగన్‌పై తిట్ల దండకానికే పరిమితం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వైభవంగా లక్ష్మీనారసింహుడి కల్యాణ మహోత్సవం

సాక్షి, యాదాద్రి: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు జగత్ రక్షకుడైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో 10.59 గంటలకు మాంగళ్యధారణ జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు తలంబ్రాల కార్యక్రమం నిర్వహించి దంపతులను ఒకచోటకు చేర్చారు. జయజయనారసింహ జయనారసింహ నమో నారసింహ అంటూ భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. స్వామివారి కల్యాణోత్సవంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, అనువంశిక ధర్మకర్త నరసింహామూర్తి, ఆలయ ఈఓ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి. చిత్రంలో అయిలయ్య

బీఆర్‌ఎస్‌లోకి క్యూ కట్టాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తులను తిరిగి చేర్చుకునే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తన అనుచరులతో కలిసి సోమవారం రాత్రి సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు.

చంద్రబాబు రైతుల్ని ఇబ్బంది పెట్టారు

'వంద రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత ప్రారంభమైంది. నేను అకుంఠిత దీక్షతో మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నల్లా నీటిని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టా. కానీ ప్రస్తుతం మిషన్ భగీరథ నీళ్లు ఎందుకు ఇవ్వలేకపోతున్నారో అర్థం కావడం లేదు. కరెంటు సరఫరా పరిస్థితి కూడా అలాగే ఉంది. నాటి ఉమ్మడి పాలనలో తెలంగాణపై కరెంటు సహా అన్ని రంగాల్లో వివక్ష కొనసాగింది. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రపంచ బ్యాంకు పిచ్చితో ఆర్థిక సంస్కరణల పేరిట రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేసే చర్యలకు పాల్పడ్డారు. చంద్రబాబుకు ఏమీ తెలియదు. అన్నీ తెలిసినట్లు నటించే వారు. విద్యుత్ కష్టాల నేపథ్యంలో చంద్రబాబును సైతం ఎదిరించా. తెలంగాణ ఉద్యమంలో నేను తిన్న తిట్లు ఎవరూ తినలేదు. నాపై దండకాలు రాసి పత్రికల్లో వేశారు. మరోవైపు రూ.5 వేల కోట్లు, కేంద్ర మంత్రి పదవి ఆఫర్ ఇచ్చి ఉద్యమం నుంచి తప్పుకోవాలని ఒత్తిడి తెచ్చారు. అయినా ఏనాడూ తెలంగాణ ఉద్యమాన్ని వీడలేదు..' అని కేసీఆర్ వెల్లడించారు.

ఓటమి పార్టీకి మంచిదే..

'అగాధంలో ఉన్న తెలంగాణకు బీఆర్‌ఎస్ పాలనలో ధైర్యం వచ్చింది. ఇప్పుడిప్పుడే గాడిన పడిన ఈ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మి అధికారాన్ని అప్పగించారు. కానీ కొద్ది రోజుల్లోనే ప్రజలకు కాంగ్రెస్ పాలన అర్థమైంది. బీఆర్‌ఎస్ ఒక్కసారి ఓడిపోవాలని నేను కూడా భావించా. ఈ ఓటమి పార్టీకి మంచే చేస్తుంది. ఒక్కసారి ఓడితే నష్టమేమీలేదు. గాడిద వెంబడి పోతేనే కదా... గుర్రం విలువ తెలిసేది.

దళితశక్తితో పాటు బహుజన శక్తి కలిసి నడవాలి

దళితబంధు వల్ల ఓడిపోయామనే భావన ఎన్నికల ఫలితాల సమీక్ష తర్వాత బయటకు వచ్చింది. దళిత వర్గాలకు ఎలాంటి బ్యాంకు ష్యూరిటీలు లేకుండా రూ.10 లక్షల చొప్పున అందజేసి ఆ కుటుంబాల్లో వెలుగులు నింపడం తప్పా? దళిత సమాజం దీనిని సానుకూలంగా ఎందుకు తీసుకోలేకపోయిందో విశ్లేషించాల్సిన అవసరముంది. దళితశక్తితో పాటు బహుజన శక్తి కలిసి నడవాలి. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా సచివాలయానికి అంబేద్కర్ పేరును పెట్టడమేగాకుండా భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశాం..' అని కేసీఆర్ తెలిపారు.

ప్రవీణ్‌కుమార్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకటిస్తాం

'ప్రవీణ్‌కుమార్ నిబద్ధత కలిగిన నాయకుడు. ఆయనను బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా త్వరలోనే ప్రకటిస్తాం. భవిష్యత్‌లోనూ ప్రవీణ్‌కుమార్ ఉన్నత స్థానంలో ఉంటారు. ప్రవీణ్‌తో కలిసి దళిత శక్తిని ఏకం చేసేందుకు, బలహీన వర్గాలను ఏకతాటి మీదకు తెచేందుకు ఎజెండా తయారు చేయాల్సిన అవసరముంది. ఈ విధానం దేశానికే టార్చ్ బేరర్‌గా మారాలి..' అని బీఆర్‌ఎస్ అధినేత పేర్కొన్నారు.

అలాగైతే ప్రతిపక్ష పార్టీలో ఎందుకు చేరతా: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

తెలంగాణ వాదం, బహుజన వాదం వేర్వేరు కాదని ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ చెప్పారు. వివక్షకు, అణచివేతకు వ్యతిరేకంగా ఈ రెండు ఉద్యమాలు పుట్టుకొచ్చాయని తెలిపారు. తాను ప్యాకేజీ తీసుకుని బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్టు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్యాకేజీ తీసుకునే వ్యక్తినే అయితే ప్రతిపక్ష పార్టీలో ఎందుకు చేరతానని ప్రశ్నించారు. రేవంత్ బెదిరింపులు మానుకోండి. 'సీఎం రేవంత్‌రెడ్డి నన్ను పొగుడుతూనే సుతిమెత్తగా వార్నింగ్‌లు ఇస్తున్నారు. నేనూ పాలమూరు బిడ్డనే, నడిగడ్డ తిండి తిన్నవాడినే. మీ దారికి రాని వారికి బెదిరింపులు మానుకోండి. వార్నింగులు ఇచ్చి మీ హోదాను తగ్గించుకోవద్దు..' అని ప్రవీణ్ కుమార్ సూచించారు. ఫామ్‌హౌస్‌కు వెళ్లేముందు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవి చేపట్టాల్సిందిగా నన్ను సీఎం రేవంత్ ఆహ్వానిస్తే నేను తిరస్కరించిన మాట నిజమే. ప్రజాక్షేత్రంలో ఉండాలనుకుని ఆయన ఆహ్వానాన్ని తిరస్కరించా. అయితే నేను బీఆర్‌ఎస్‌లోకి వెళ్తే సమాధానం చెప్పాలని రేవంత్ అంటున్నారు. అయితే ఏ వేదిక మీద పనిచేయాలో చెప్పే స్వేచ్ఛ తెలంగాణ ప్రజలకు లేదా. మీరు గేట్లు తెరిస్తే పిరికిపందలు, అసమర్థులు, స్వార్థపరులు గొర్రెల మందలా వస్తున్నారు. కానీ నిజాయితీ కలిగిన నేను ఆ గొర్రెల మందలో ఒకడిని కాలేను. నేను ప్యాకేజీ తీసుకునే వాడినే అయితే రేవంత్ గేటు వద్ద ఉండే వాడిని. నేను దొంగ ఆస్తులు రక్షించుకునేందుకు వచ్చే పిరికిపందను కాను. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవ కోసం వచ్చా' అని ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

కేసీఆర్ ప్రజల గుండెల్లో ఉన్నారు

'తరతరాల అణచివేతకు గురైన తెలంగాణకు విముక్తి కల్పించి వెలుగు వైపు నడిపించింది కేసీఆర్. ఆయన దురదృష్టవశాత్తూ అధికారంలో లేకున్నా ప్రజల గుండెల్లో ఉన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు అయ్యేందుకు బహుజన వాదులు కేసీఆర్ వెంట నడవాలని అనుకుంటున్నారు..' అని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చిన్నారికి శ్రీయా పూలేగా నామకరణం

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు అకినేపల్లి శిరీష-ప్రవీణ్ దంపతుల ద్వితీయ కుమార్తెకు శ్రీయా పూలేగా కేసీఆర్ నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జనసేన దుకాణం క్లోజ్!

- పార్టీ కార్యాలయం మూసివేత

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: జనసేన పార్టీ ఉత్తరాంధ్ర కార్యాలయం మూతపడింది. ఉత్తరాంధ్రలో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు విశాఖలోని మాధవధార ప్రాంతంలో ఏర్పాటు చేసిన జనసేన కార్యాలయాన్ని కొద్ది రోజులుగా తెరవడంలేదు. ఇప్పుడు కార్యాలయం భవనాన్ని అద్దెకిస్తామంటూ భవనం యజమాని టు లెట్ బోర్డు పెట్టారు. పార్టీ కార్యాలయం ఖర్చును భరించేందుకు స్థానిక నేతలెవరూ ముందుకు రాకపోవడం, కనీసం అద్దె కూడా చెల్లించకపోవడంతో భవనం యజమాని పార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేయించినట్టు సమాచారం. ఓ పక్క పొత్తుల్లో అధిక శాతం సీట్లు కోల్పోవడం, ఉన్న సీట్లను కూడా కొత్తగా వచ్చిన వారికి ఇస్తుండటంతో స్థానిక నేతలందరూ పార్టీ అధినాయకత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. ఇన్నాళ్లూ డబ్బు ఖర్చుపెట్టుకొన్న తమను పొత్తులు, కొత్తవారికి సీట్లతో దెబ్బ తీశారని కుతకుతలాడుతున్నారు. పొత్తులో భాగంగా విశాఖ దక్షిణం, పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లి సీట్లు జనసేనకు వచ్చాయి. పార్టీలో మొన్ననే చేరిన వంశీకృష్ణకు విశాఖ దక్షిణ స్థానాన్ని, అంతకుముందు చేరిన పంచకర్లకు పెందుర్తి, నిన్న చేరిన కొణతాలకు అనకాపల్లి సీటు కేటాయించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీలో మొదటి నుంచీ ఉండి పనిచేసిన తమను కాదని కొత్తగా వచ్చిన వారికి పెద్దపీట వేయడాన్ని జనసేన నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఇప్పటికే అనకాపల్లి నేత పరుచూరి భాస్కర్‌రావు, పెందుర్తి నేత కంచిపాటి కాశీవిశ్వనాథనాయుడు పార్టీకి రాజీనామ చేశారు. మరి కొందరు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. నేతలెవ్వరూ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూడటంలేదు. ఆ భవనం అద్దె కూడా వృథా అని భావించి, అద్దె కట్టడం మానేసినట్లు సమాచారం.



ఉత్తరాంధ్ర జనసేన పార్టీ కార్యాలయం (ఫైల్)

ఇది రెండోసారి

జనసేన పార్టీ కార్యాలయం మూతపడటం ఇది రెండోసారి. గతంలో నరసింహనగర్ రైతు బజార్ సమీపంలోని అపార్టుమెంటలో పార్టీ కార్యాలయం ఉండేది. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈ కార్యాలయాన్ని మూసివేశారు. కొద్ది రోజులు పార్టీ కార్యాలయం లేకుండానే కాలం వెళ్లదీశారు. రెండేళ్ల క్రితం మాధవధారలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయం ఇప్పుడు ఎన్నికలకు ముందే మూతపడటంతో ఉత్తరాంధ్రలో ముందుగానే దుకాణం సర్దేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గృహజ్యోతిపై ఆదేశాలు సబబే

- సమర్థించుకున్న ఈఆర్‌సీ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలకు స్పందిస్తూ ప్రకటన విడుదల


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా సబ్సిడీ ఇస్తేనే గృహజ్యోతి పథకం కింద గృహ విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేయాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లను ఆదేశిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్‌సీ) సమర్థించుకుంది. ప్రభుత్వం ముందస్తుగా సబ్సిడీ చెల్లించాలని ఈఆర్‌సీ ఇచ్చిన ఆదేశాలను విమర్శిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు పరోక్షంగా స్పందిస్తూ ఈఆర్‌సీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యుత్ చట్టానికి కట్టుబడి నిర్భయంగా, నిష్పక్షపాతంగా, నీతినిజాయతీతో పనిచేస్తోందని స్పష్టం చేసింది. గతంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాలో ఇలాంటి నిబంధనలు పెట్టలేదని, ఇప్పుడు గృహజ్యోతి పథకానికి కావాలనే కుట్రపూరితంగా ఈఆర్‌సీ పెట్టిందని రేవంత్‌రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందిస్తూ వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు లేకపోవడంతో వారికి ఆరు నెలలకోసారి కస్టమర్ చార్జీలతో బిల్లులు జారీ చేస్తున్నారని, జీరో బిల్లులు జారీ చేయడం లేదని ఈఆర్‌సీ గుర్తు చేసింది. రిటైల్ టారిఫ్ ఆర్డర్‌లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల టారిఫ్ జీరోగా ఉంటుందని స్పష్టం చేసింది. వినియోగదారులకు అందించే సబ్సిడీని ప్రభుత్వం ముందస్తుగా డిస్కంలకు విడుదల చేయాలని, లేనిపక్షంలో సబ్సిడీపై విద్యుత్ సరఫరా వర్తించదని విద్యుత్ చట్టంలోని సెక్షన్ 65 స్పష్టం చేస్తోందని గుర్తు చేసింది. ఈ నిబంధన కిందే గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లుల జారీకి అనుమతిస్తూ షరతులు విధించినట్టు స్పష్టం చేసింది. ఇస్త్రీషాపులు, ధోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నా, జీరో బిల్లులు జారీ చేయడం లేదని, ప్రభుత్వం ఇందుకు సంబంధించిన సబ్సిడీ ఇస్తే బిల్లుల్లో సర్దుబాటు చేస్తున్నారని తెలిపింది. గృహజ్యోతికి అనుమతిస్తూ డిస్కంలు ఇచ్చిన ఆదేశాలపై ఏమైనా అభ్యంతరాలుంటే సరైన అథారిటీ(అప్పీలేట్ అథారిటీ)కి అప్పీల్ చేసుకోవచ్చని సూచించింది.



హైకోర్టుకు మరో ఇద్దరు జడ్జీలు

- జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ సుజోయ్ పాల్ బదిలీకి రాష్ట్రపతి ఆమోదం
- గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన కేంద్రం
- కొత్తవారితో 28కి చేరనున్న న్యాయమూర్తుల సంఖ్య

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ సుజోయ్ పాల్‌లను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం చేసిన సిఫార్సులకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆమోద ముద్ర వేశారు. గత నెలలో వీరిద్దరి అభ్యర్థనపై బదిలీ చేయడానికి సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. తమ వ్యక్తిగత కారణాల దృష్ట్యా తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని జస్టిస్ మౌషుమి భట్టాచార్య (కోల్‌కతా), జస్టిస్ సుజోయ్ పాల్ (మధ్యప్రదేశ్) కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని కేంద్రానికి సిఫార్సు చేసింది. ఆ సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయగా, కేంద్ర న్యాయశాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.



28కి చేరనున్న జడ్జీల సంఖ్య...

రాష్ట్ర హైకోర్టులో ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితో కలిపి 26 మంది న్యాయమూర్తులు ఉన్నారు. తాజాగా రాష్ట్రపతి ఆమోదం తెలిపిన ఇద్దరు జడ్జీలు బాధ్యతలు చేపడితే ఆ సంఖ్య 28కి చేరనుంది. హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 42 కాగా.. ఇంకా 14 ఖాళీలు ఉంటాయి.

జస్టిస్ మౌషుమి భట్టాచార్య...


1967, అక్టోబర్ 27న జన్మించారు. కలకత్తాలోని లోరెటో హౌస్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం నుంచి బీఏ ఆనర్స్ (ఇంగ్లిష్) చదివారు. 1996లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో రోటరీ అంబాసిడోరియల్ స్కాలర్‌షిప్‌తో ఎల్‌ఎల్‌ఎం చదివారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన ట్రైనింగ్ రూల్స్ 1996లోని రూల్ 5 ప్రకారం శిక్షణను పూర్తి చేసి, 1997, నవంబర్ 19న పశ్చిమ బెంగాల్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. కలకత్తాలోని హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు, ఢిల్లీ, పట్నా, హైదరాబాద్ హైకోర్టుల్లో న్యాయవాదిగా సమర్థ వాదనలు వినిపించారు. కంపెనీ లా బోర్డు, డెట్ రికవరీ ట్రిబ్యునల్, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియాలోనూ ప్రాక్టీస్ చేశారు. 2017, సెప్టెంబర్ 21న కలకత్తా హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019, సెప్టెంబర్ 16న ఇదే కోర్టులో జస్టిస్ మౌషుమి భట్టాచార్య శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ సుజోయ్‌పాల్...

1964, జూన్ 21న జన్మించారు. 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. సివిల్, రాజ్యాంగ, సర్వీస్ కేసుల్లో సమర్థవంతంగా వాదనలు వినిపించారు. 2011, మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2014, ఏప్రిల్ 14న జస్టిస్ సుజోయ్‌పాల్ శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

ఇంద్రకీలాద్రిపై బఫే పద్ధతితో అన్నప్రసాదం

- శుక్ర, శని, ఆదివారాల్లో అందించాలని నిర్ణయం
- మహా మండపం మొదటి అంతస్తులో ఏర్పాట్లు



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి వచ్చే భక్తులందరికీ అన్నప్రసాదం అందేలా అధికారులు చర్యలు చేపట్టారు. క్యూలైన్‌లో వేచి ఉండకుండా నేరుగా ప్రసాద వితరణ హాల్‌లోకి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నిత్యం అమ్మవారి దర్శనానికి సుమారు 30 వేల నుంచి 40 వేల మంది విచ్చేస్తుంటారు. వీరిలో అత్యధికులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారే. సాధారణ రోజుల్లో నాలుగు వేల మందికి, శుక్ర, శని, ఆదివారాల్లో రోజుకు ఐదు వేల మందికి అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. మహా మండపం రెండో అంతస్తులో రెండు హాల్స్‌లో అన్న ప్రసాద వితరణ జరుగుతుంది. శుక్ర, శని, ఆదివారాలు అన్న ప్రసాదం స్వీకరించేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వస్తుంది. ఇటీవల ఈవో కేఎస్ రామారావు, చైర్మన్ కర్నాటి రాంబాబు అన్నదానం వితరణను పరిశీలించిన క్రమంలో పలువురు భక్తులు తమ ఇబ్బందులను వారి దృష్టికి తీసుకువచ్చారు. మహా మండపం మొదటి అంతస్తులో బఫే పద్ధతిలో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన రావడంతో పాటు దానిని అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక దఫా వంద మంది చొప్పున రోజులో 1500 మందికి అన్న ప్రసాదం అందించే వీలు కలుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ వారమే దీన్ని అమలు చేయాలని నిర్ణయించారు.

తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 12 మంది ప్రముఖులను ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తోంది. 2022వ సంవత్సరానికి గాను విశ్వవిద్యాలయం వివిధ ప్రక్రియల్లో ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ సోమవారం వివరాలు వెల్లడించారు. వైద్యం వెంకటేశ్వరాచార్యులు(కవిత్వం), డాక్టర్ డి.రాజారెడ్డి(పరిశోధన), అన్నవరం శ్రీనివాస్(చిత్రలేఖనం), టి.గంగాధర్(శిల్పం), డాక్టర్ పసుమర్తి రామలింగశాస్త్రి(నృత్యం), డాక్టర్ పప్పు వేణుగోపాలరావు(సంగీతం), ఆర్.దిలీప్‌రెడ్డి (పత్రికారంగం), బి.హెచ్.కళ్యాణి (నాటకం), కొంకుల్ల ఎల్లయ్య (జానపద కళారంగం), డాక్టర్ గంద్ర లక్ష్మణరావు (అవధానం), ఆచార్య కొలక లూరి మధుజ్యోతి (ఉత్తమ రచయిత్రి), దేవులపల్లి కృష్ణమూర్తి (నవల/కథ), పురస్కారాలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 28న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేస్తామని, పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.20,116 నగదు పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు

జలమండలి కేసులోనూ ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కేసులో ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ గైర్హాజరుల పర్వం ఢిల్లీ జలమండలి కేసులోనూ పునరావృతమైంది. మద్యం అవకతవకల కేసులో కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలుమార్లు సమన్లు జారీచేయడం ఆయన గైర్హాజరవడం తెల్సిందే. తాజాగా ఢిల్లీ జల్‌బోర్డ్‌లో అక్రమాలు జరిగాయంటూ నమోదైన కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ విచారణ కోసం సోమవారం తమ ఎదుట హాజరుకావాలని ఇప్పటికే సమన్లు జారీచేయగా కేజ్రీవాల్ ఈడీ ఆఫీస్‌కు రాలేదు. తనకు సమన్లు పంపడం చట్టవ్యతిరేకమని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మనీ లాండరింగ్ సంబంధించిన సమన్లు అందుకున్న రెండో కేసు ఇది. మద్యం ఎక్సయిజ్ కేసులో ఇప్పటికే ఎనిమిది సార్లు సమన్లు అందుకోవడం, ప్రతిసారీ ఆఫీస్‌కు రాకుండా మిన్నకుండిపోవడం తెల్సిందే. మద్యం కేసులో విచారణ నిమిత్తం మార్చి 21వ తేదీన తమ ఆఫీస్‌కు రావాలని ఈడీ తాజాగా ఆయనకు తొమ్మిదోసారి సమన్లు జారీ చేయడం గమనార్హం.

నేడు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగిన నేపథ్యంలో బీజేపీ మూడో జాబితాపై కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ కానుంది. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్‌సంతోష్ తోపాటు, పార్లమెంటరీ బోర్డు సభ్యులు పాల్గొంటారు. సీఈసీ భేటీలో తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 13 రాష్ట్రాల ఎంపీ అభ్యర్థుల ఎంపికపై చర్చించి ఆమోద ముద్రవేయనున్నారు. ఇప్పటికే ప్రకటించిన రెండు జాబితాల్లో తెలంగాణలోని 15 స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. మూడో జాబితాలో తెలంగాణలోని రెండు స్థానాలు, ఆంధ్రప్రదేశ్‌లోని ఆరు సీట్లకు అభ్యర్థుల పేర్లు ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో పది రాష్ట్రాలకు చెందిన కోర్ కమిటీ నేతలతో జేపీ నడ్డా, అమిత్ షా, బీఎల్ సంతోష్ భేటీ అయ్యారు. ఆయా రాష్ట్రాల ఎంపీ అభ్యర్థుల పేర్లపై చర్చించి జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది.

బీజేపీ 17, జేడీ(యూ) 16

బిహార్‌లో కుదిరిన సీట్ల సర్దుబాటు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బిహార్‌లో ఎన్డీఏ కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. దీని ప్రకారం 17 చోట్ల బీజేపీ పోటీ చేయనుంది. 16 చోట్ల నితీశ్ సారథ్యంలోని జేడీ(యూ), ఐదో చోట్ల చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి (రామ్‌విలాస్) పార్టీ బరిలో దిగనున్నాయి. హిందుస్తానీ అవామ్ మోర్చా, ఉపేంద్ర కుష్వాహా సారథ్యంలోని రాష్ట్రీయ లోక్‌మోర్చా చెరో స్థానం నుంచి పోటీ చేస్తాయి. 'ఇండియా' కూటమితో తెగతెంపులు చేసుకుని మళ్లీ తమతో జట్టుకట్టిన జేడీ(యూ) కంటే బీజేపీ బిహార్‌లో తొలిసారిగా ఎక్కువ స్థానాల్లో పోటీకి దిగడం విశేషం. ఈసారి రాష్ట్రంలో మొత్తం 40 స్థానాలూ ఎన్డీఏవేనని బిహార్ ఎన్నికల ఇన్‌చార్జ్, బీజేపీ నేత వినోద్ తావ్డే ధీమా వ్యక్తంచేశారు.

కాంగ్రెస్ రెబల్స్‌కు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లోని అధికార కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు రెబల్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ అనర్హులుగా ప్రకటించడంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ ఆరుగురు శాసనసభ్యులు ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. అనర్హత నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరు దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం విచారణ జరిపింది. నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలంటూ స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా కార్యాలయానికి నోటీసు పంపింది. పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున అసెంబ్లీ కార్యకలాపాలతోపాటు ఓటింగ్‌లోనూ పాల్గొనరాదని ఆరుగురికి ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను మే 6వ తేదీకి వాయిదా వేసింది. ఖాళీ అయిన ఆరు స్థానాల్లో నామినేషన్ల దాఖలుకు మే 7 ఆఖరు తేదీ.

సోషల్ మీడియా... నయా యుద్ధరంగం

ఎన్నికల ప్రచారంలో కొన్నేళ్లుగా కీలక పాత్ర

సోషల్ సైట్లలో ప్రచారమే ఇప్పటి ట్రెండు	అదే బాట పడుతున్న పార్టీలు, నేతలు	సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్లకు పెరుగుతున్న డిమాండ్

ఒకప్పుడు ఎన్నికల ప్రచారమంటే గోడలపై రాతలు, పోస్టర్లు, బ్యానర్లు. ఇప్పుడా రోజులు పోయాయి. అక్కడక్కడా ఫ్లెక్సీలున్నా అవన్నీ బడా నేతల దృష్టిలో పడేందుకు చోటా, మోటా లీడర్ల ప్రయత్నాల్లో భాగమే. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియాది కీలక పాత్ర. వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్... రీల్స్, షార్ట్స్, మీమ్స్.. మాధ్యమమేదైనా సరే.. ఓటరు మానసిక స్థితిని ప్రభావితం చేసే మార్గాలే! అందుకే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను వాడుకుంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు నేతలు. ఓటర్లను ఆకట్టుకోవడానికి, ప్రచారం కోసం వారిని ఆశ్రయిస్తున్నారు. పార్టీలు తమ విధానాలను బలంగా జనంలోకి తీసుకెళ్లేందుకు సోషల్ బాట పడుతున్నాయి...

- సాక్షి, నేషనల్ డెస్క్

కరోనా తర్వాతి ప్రపంచంలో సమాచార సాధనంగా సోషల్ మీడియా పట్ల దృక్పథమే పూర్తిగా మారిపోయింది. డేటా–సేకరణ, విజువలైజేషన్ ప్లాట్‌ఫాం స్టాటిస్టికా ప్రకారం ఫేస్‌బుక్‌కు భారత్‌లో 36.7 కోట్ల యూజర్లున్నారు. వాట్సాప్‌కు 50 కోట్ల మంది యాక్టివ్ యూజర్లున్నారు. వారి అభిప్రాయాలను ప్రభావితం చేయడంలో వీటితో పాటు ఎక్స్, ఇన్‌స్టా, వాట్సప్ చానళ్లదీ కీలక పాత్రే. అందుకే పార్టీలు ప్రచారానికి సోషల్ ప్లాట్‌ఫాంలను ఎంచుకుంటున్నాయి. ఫేస్‌బుక్‌లో ప్రతి పార్టీకీ జాతీయ స్థాయి నుంచి రాష్ట్ర, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి దాకా ఓ పేజ్ ఉంది. ప్రతి రాజకీయ నాయకుడికీ ఓ సైన్యమే ఉంది. ఇక వాట్సాప్ గ్రూప్‌లకైతే కొదవే లేదు. ఇవి కూడా జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కులాలు, మతాలవారీగా ఎప్పుడో ఏర్పాటయ్యాయి. ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలనే ఆయుధంగా చేసుకుని బీజేపీ 2014లో అధికారంలోకి వచ్చింది. ఎక్స్‌లో ప్రధాని మోదీకి ఏకంగా 9.7 కోట్ల ఫాలోయర్లున్నారు. రాహుల్‌కు 2.5 కోట్ల మంది ఉన్నారు.

పర్సనల్ అప్రోచ్..

ఎన్నికలంటే ఇంటింటికీ వెళ్లి ఓట్లగడం పాత పద్ధతి. ఇప్పుడంతా పర్సనల్ అప్రోచ్. బీజేపీ ఇటీవల వాట్సాప్ ఉన్న వాళ్లందరికీ 'ప్రధాని నుంచి లేఖ' పంపింది. కేంద్రం ఇప్పటిదాకా ఏం చేసింది, ఇంకా ఏం చేస్తే బాగుంటుందో చెప్పాలని పౌరులను కోరింది. 'మై ఫస్ట్ ఓట్ ఫర్ మోదీ' అనే వెబ్‌సైట్‌నూ ప్రారంభించింది. మోదీకి ఎందుకు ఓటేయాలనుకుంటున్నదీ చెబుతూ వీడియో చేసి పెట్టడానికి వీలు కల్పించింది. సాధారణ పౌరుడిని ప్రధానే నేరుగా అభిప్రాయం కోరడం, ఓటేయడానికి కారణాన్ని అడిగి తెలుసుకోవడం కచ్చితంగా వారి అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మారుస్తుందన్నది బీజేపీ అంచనా. రాహుల్ గాంధీ వాట్సాప్ చానల్‌ను కాంగ్రెసే నిర్వహిస్తోంది. అందులో రాహుల్ ప్రజలతో సంభాషిస్తారు. వారి ప్రశ్నలకు బదులిస్తారు. ఈ వాట్సాప్ సమాచారం సర్క్యులేషన్‌ను జిల్లా స్థాయిలో పర్యవేక్షిస్తారు. ఎక్కువ వాట్సాప్ గ్రూపుల ద్వారా మరింత ఎక్కువ మంది ఓటర్లతో వేగంగా, మెరుగ్గా అనుసంధానం కావచ్చన్నది కాంగ్రెస్ భావన.



"దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ వ్యాప్తి సగటున 40 శాతం ఉందని అంచనా. ఆ లెక్కన 2 లక్షల ఓటర్లుండే అసెంబ్లీ స్థానంలో సోషల్ మీడియా ద్వారా కనీసం 70 నుంచి 80 వేల మందిని ప్రభావితం చేసే వీలుంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. చాలాసార్లు విజేతను తేల్చడంలో ఐదారు వేల ఓట్లు కూడా నిర్ణాయకంగా మారుతున్న నేపథ్యంలో ఇది చాలా పెద్ద సంఖ్యేనని పార్టీలు భావిస్తున్నాయి. అందుకే సోషల్ మీడియాను ఇప్పుడు ఏ పార్టీ కూడా తేలిగ్గా తీసుకోవడం లేదు.

- అంకిత్ లాల్, అడ్వైజర్, పొలిటికో

ప్రభావశీలతపై సందేహాలూ..

సోషల్ మీడియా ప్రభావంపై అనుమానాల్లేకపోయినా ఓటర్లుగా ఫలానా పార్టీకి ఓటేసేలా ప్రభావితం చేయడంలో వాటి శక్తిపై మాత్రం సందేహాలున్నాయి. వాటి ప్రచారం తటస్థ ఓటర్ల వైఖరిలో మార్పు తేవచ్చేమో గానీ సంప్రదాయ ఓటర్లు, పార్టీ మద్దతుదారుల అభిప్రాయాలను ప్రభావితం చేయబోదని విశ్లేషకుల అంచనా. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థి కులం, స్థానిక అనుబంధం, పార్టీకి విధేయత వంటివే సంప్రదాయ ఓటర్లను ప్రభావితం చేస్తాయంటున్నారు. అభ్యర్థి చరిష్మా, విశ్వసనీయత, పార్టీకి ప్రజాదరణ కూడా ఓటర్లను కదిలిస్తాయని విశ్లేషిస్తున్నారు.

కీలకంగా ఇన్‌ఫ్లుయెన్సర్లు...

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు. ఎక్కువమందిని ఆకర్షించగల, ప్రభావితం చేయగల వ్యక్తులు. రీల్స్, షార్ట్స్ ప్రాచుర్యంతో వీరి ప్రాబల్యం మరింతగా పెరిగింది. ఎన్నికల్లో కూడా కీలక ప్రచారకర్తలుగా మారారు. సామాజిక మాధ్యమాల్లో 10,000 మంది ఫాలోయర్స్ ఉన్నవారిని 'నానో' ఇన్‌ఫ్లుయెన్సర్లని, లక్ష దాకా ఉంటే మైక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లు, 10 లక్షలుంటే మాక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లు, అంతకు మించితే మెగా ఇన్‌ఫ్లుయెన్సర్లని అంటారు. గ్రామీణ ప్రాంతాల్లో మైక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లు కీలకంగా మారారు.

ముందున్న బీజేపీ..

2024 సార్వత్రిక ఎన్నికల వేళ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు డిమాండ్ పెరిగింది. పార్టీలు వారికి ప్రధాన ఖాతాదారులుగా మారుతున్నాయి. ఈ విషయంలో బీజేపీ ముందుంది...

- ప్రభుత్వ పథకాలపై కంటెంట్ కోసం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌తో కలిసి పని చేయడానికి నాలుగు ప్రైవేట్ ఏజెన్సీలను ఎంపిక చేసినట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ పార్లమెంటుకు తెలిపారు. ఇదంతా బీజేపీకి లబ్ధి చేసేదే.
- వివిధ ప్రాంతాల్లో ఇన్‌ఫ్లుయెన్సర్లతో బీజేపీ 50కి పైగా సమావేశాలను ఏర్పాటు చేసింది. మోదీ నేతృత్వంలో మంత్రులు కూడా ప్రధాన చానళ్లకు బదులు పాడ్‌కాస్ట్ షోలు, యూట్యూబ్ చానళ్లలో కనిపిస్తున్నారు.
- ఎస్.జైశంకర్, స్మృతీ ఇరానీ, పీయూష్ గోయల్, రాజీవ్ చంద్రశేఖర్ వంటి కేంద్ర మంత్రులు యూట్యూబ్‌లో 70 లక్షలకు పైగా ఫాలోవర్లున్న పాడ్‌కాస్టర్ రణ్‌వీర్ అలహాబాదియాకు ఇంటర్వ్యూలిచ్చారు.

కాంగ్రెస్‌దీ అదే బాట...

ఇన్‌ఫ్లుయెన్సర్ల సేవలను వాడుకునే విషయంలో కాంగ్రెస్ కూడా ఏమీ వెనకబడి లేదు. భారత్ జోడో యాత్రలోనూ, తాజాగా ముగిసిన భారత్ జోడో న్యాయ్ యాత్రలోనూ వారిని బాగానే ఉపయోగించుకుంది...

- రెండు జోడో యాత్రల్లోనూ ప్రధాన మీడియా కంటే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకే రాహుల్ ప్రాధాన్యమిచ్చారు.
- 'అన్ ఫిల్టర్డ్ విత్ సమ్‌దీశ్' యూ ట్యూబర్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు.
- ట్రావెల్ అండ్ ఫుడ్ వీడియో పాడ్‌కాస్ట్ కర్లీ టేల్స్ వ్యవస్థాపకుడు కామియా జానీతో తన భోజనం తదితరాల గురించి పిచ్చాపాటీ మాట్లాడారు.
- రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ తన హయాంలో 'జన్ సమ్మాన్' వీడియో పోటీలు నిర్వహించారు. సంక్షేమ కార్యక్రమాలపై సోషల్ ప్లాట్‌ఫాంల్లో 30 నుంచి 120 సెకన్ల వీడియోలు షేర్ చేసిన వారిలో విజేతలకు నగదు బహుమతులిచ్చారు.

నేడు సీడబ్ల్యూసీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గెలుపు వ్యూహాలను సిద్ధం చేసేందుకు కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) మంగళవారం భేటీ కానుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ భేటీలో మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు కీలక నేతలు హాజరు కానున్నారు. ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోకు తుది రూపు ఇవ్వనున్నారు. రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాలే లక్ష్యంగా 'భాగిదారీ న్యాయ్'(భాగస్వామ్య న్యాయం), 'కిసాన్ న్యాయ్', 'నారీ న్యాయ్', 'శ్రామిక్ న్యాయ్','యువ న్యాయ్'పేరిట ఇప్పటికే తన హామీలను ప్రజల ముందుంచిన కాంగ్రెస్ వాటిపై నేతలకు మార్గనిర్దేశం చేయనుంది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, రైతులకు వడ్డీలేని రుణాలు, ప్రస్తుతం కేంద్రం అందిస్తున్న సాయం పెంపు, యువత కోసం 30 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ లేక ప్రైవేట్ రంగంలో 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ప్రతి డిప్లొమా లేక డిగ్రీ హోల్డర్‌కు అప్రెంటిస్ షిప్ శిక్షణకు రూ.లక్ష సాయం, 30 ఏళ్లలోపు యువత స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడానికి రూ.5,000 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు, పేపర్ లీకేజీల నివారణకు ప్రత్యేక చట్టం, మహిళల కోసం నిరుపేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి రూ.లక్ష సాయం వంటి 25 హామీలపై చర్చించనుంది.

అభ్యర్థుల ఎంపికపై సీఈసీ..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ఇప్పటికే పలు మార్లు భేటీ అయిన కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) మంగళవారం మళ్లీ సమావేశం కానుంది. ఇప్పటికే రెండు విడతలుగా 82 మంది పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. 19న జరిగే భేటీలో తెలంగాణలోని మిగతా స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేసే అవకాశాలున్నాయి. భేటీలో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ముంబై నుంచి నేరుగా ఢిల్లీ చేరుకోగా, సీఈసీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ మంగళవారం ఉదయానికి ఢిల్లీ చేరుకునే అవకాశం ఉంది.

బెంగాల్ డీజీపీ తొలగింపు

ఆరు రాష్ట్రాల హోం శాఖ కార్యదర్శులపైనా ఈసీ వేటు

సాక్షి, న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం భారీ కసరత్తుకు తెరతీసింది. ఉత్తరప్రదేశ్, గుజరాత్, బిహార్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ హోం శాఖ కార్యదర్శులతోపాటుగా, పశ్చిమబెంగాల్ డీజీపీ రాజీవ్ కుమార్‌ను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. మిజోరం, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల సాధారణ పరిపాలన విభాగాల కార్యదర్శులను కూడా తొలగించింది.

గతంలోనూ చర్యలు

2016 అసెంబ్లీ ఎన్నికలతోపాటు 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ పశ్చిమబెంగాల్ డీజీపీకి ఎన్నికల విధుల నుంచి ఈసీ తొలగించడం గమనార్హం. తాత్కాలికంగా డీజీపీ రాజీవ్ కుమార్‌కు ఎన్నికలతో సంబంధం లేని బాధ్యతలను అప్పగించాలని బెంగాల్ చీఫ్ సెక్రటరీకి ఈసీ సూచించింది. ఆయనకు జూనియర్‌గా ఉన్న మరో అధికారికి డీజీపీ బాధ్యతలివ్వాలని కోరింది. డీజీపీ పోస్టుకు అర్హులైన ముగ్గురు అధికారుల పేర్లను తమకు పంపించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

వీరికి రెండు విధులు

గుజరాత్, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల హోం శాఖ కార్యదర్శులు సంబంధిత రాష్ట్రాల సీఎం కార్యాలయాల బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారని, దీనివల్ల ఎన్నికల సంబంధ విధుల అమలులో ఎంతో కీలకమైన నిష్పాక్షికత, తటస్థత కొరవడే ప్రమాదముందని ఈసీ పేర్కొంది. ముఖ్యంగా శాంతిభద్రతలు, బలగాల మోహరింపుపై ఇది ప్రభావం చూపొచ్చని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే వీరిని విధుల నుంచి తప్పించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

బీఎం కమిషనర్ తొలగింపు

ఎన్నికల సమయంలో మూడేళ్లు ఒకే చోట బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని, సొంత జిల్లాల్లో విధుల్లో ఉన్న వారిని ఎన్నికల సంబంధ విధుల నుంచి బదిలీ చేయడం ఆనవాయితీ. అయితే, మహారాష్ట్ర ప్రభుత్వం తమ సూచనలను పాటించకపోవడంపై ఈసీ అసంతృప్తిగా ఉంది. దీంతో, బృహన్ముంబై మున్సిపల్ కమిషనర్ ఇక్బాల్ సింగ్ చహల్‌తోపాటు అదనపు కమిషనర్లు, ఉప కమిషనర్లను విధుల నుంచి తప్పించాలని ఆదేశాలిచ్చింది. ఇతర కార్పొరేషన్ల మున్సిపల్ కమిషనర్లు, అదనపు, ఉప కమిషనర్లను కూడా బదిలీ చేయాలని కోరింది.



చీఫ్ జస్టిస్ చంద్రచూడ్

కామెంట్లకు మేమూ అతీతం కాదు!

ఎన్నికల బాండ్ల తీర్పును సోషల్ మీడియాలో దుర్వినియోగం చేస్తున్నారని, కేంద్రంపై అభ్యంతరకర కామెంట్లు పెడుతున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ వాదించారు. ప్రస్తుతం కోర్టులో ఉన్నవారే దీనిపై ఇంటర్వ్యూలిస్తూ కావాలనే సుప్రీంకోర్టుకు కూడా ఇబ్బందికర పరిస్థితి సృష్టిస్తున్నారన్నారు. ఈ వ్యాఖ్యలతో సీజేఐ ఏకీభవించలేదు. ''మా తీర్పులను ఎవరెలా వ్యాఖ్యానిస్తున్నారన్న దానితో మాకు సంబంధం లేదు. మా ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నదే మాకు ముఖ్యం. న్యాయమూర్తులుగా మేం రాజ్యాంగబద్ధంగా తీర్పులు వెల్లడిస్తాం. చట్టాలకు అనుగుణంగా నడుచుకుంటాం. మీడియా, సోషల్ మీడియా కామెంట్లకు మేం కూడా అతీతమేమీ కాదు. కానీ వాటిని తట్టుకునే శక్తి మాకు, న్యాయవ్యవస్థకు ఉంది'' అని ఆయన అభిప్రాయపడ్డారు.

బాండ్ల నంబర్లేవి?

ఎస్‌బీఐపై సుప్రీం మండిపాటు

- నంబర్లతో పాటు ఎన్నికల బాండ్ల వివరాలన్నీ వెల్లడించాల్సిందే
- ఎల్లుండి సాయంత్రానికల్లా ఈసీకి అందించాలని ఆదేశం

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీరుపై సుప్రీంకోర్టు మరోసారి మండిపడింది. బాండ్లను కొనుగోలు చేసిన వారు, నిధులందుకున్న పార్టీల వివరాలను బయట పెట్టే యునిక్ బాండ్ నంబర్లను ఎందుకు వెల్లడించలేదని బ్యాంకును నిలదీసింది. బాండ్ల వివరాలను ఒక్కటొక్కటిగా కాకుండా ఈ నెల 21 సాయంత్రానికల్లా పూర్తిస్థాయిలో ఈసీకి అందజేయాలని ఆదేశించింది. ''యునిక్ బాండ్ నంబర్లతో పాటు బ్యాంకు దగ్గరున్న మొత్తం సమాచారాన్ని వెల్లడి చేయాల్సిందే. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకూ తావులేదు'' అని కుండబద్దలు కొట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఎస్‌బీఐ అందజేసిన వివరాలన్నిటినీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ఉన్నారు.

చైర్మన్, ఎండీ అఫిడవిట్ దాఖలు చేయాలి

ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగవిరుద్ధమని, దాతలు, గ్రహీతల వివరాలను మార్చి 13వ తేదీ కల్లా వెల్లడించాలని ఎస్‌బీఐని ఆదేశిస్తూ రాజ్యాంగ ధర్మాసనం ఇటీవల చారిత్రక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. వివరాల వెల్లడికి గడువు కోరుతూ ఎస్‌బీఐ వేసిన పిటిషన్‌ను ఈ నెల 11న న్యాయస్థానం కొట్టివేసింది. అనంతరం ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల అరకొర వివరాలను ఎన్నికల సంఘానికి అందజేసింది. దీనిపై సుప్రీంకోర్టు ఎస్‌బీఐని సోమవారం సంజాయిషీ కోరింది. ''21వ తేదీ సాయంత్రానికల్లా పూర్తి వివరాలు ఈసీకివ్వండి. ఎన్నికల బాండ్లకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారమంతటినీ ఈసీకి అందించామని, ఇంతకుమించి ఎలాంటి సమాచారమూ లేదని పేర్కొంటూ ఎస్‌బీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అఫిడవిట్ దాఖలు చేయాలి'' అని స్పష్టం చేసింది. బాండ్ల వివరాలను వెల్లడించరాదన్న తమ పిటిషన్లపై సత్వరం విచారణ జరపాలన్న పరిశ్రమల సంఘాల విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. ఎన్నికల బాండ్ల పథకం మొదలైన 2018 మార్చి నుంచి 2019 ఏప్రిల్ దాకా విక్రయించిన బాండ్ల వివరాలను బయట పెట్టాలన్న పిటిషన్‌నూ కొట్టేసింది. బాండ్ల వివరాలను వెల్లడించాలన్న తీర్పుపై సుమోటోగా సమీక్ష జరపాలంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిశ్ సి.అగర్వాలా రాసిన లేఖను కూడా బుట్టదాఖలు చేసింది. ఇవన్నీ ప్రచార స్టంట్లంటూ సీజేఐ మండిపడ్డారు.

'శక్తి' అంతమే విపక్షాల లక్ష్యం

రాహుల్ వ్యాఖ్యలపై మోదీ ఎదురుదాడి

శివమొగ్గ/కోయంబత్తూర్: 'శక్తి'ని అంతం చేయడమే తమ లక్ష్యమన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారాస్త్రంగా మలుచుకున్నారు. సోమవారం కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. ''శక్తిని అంతం చేస్తామని ముంబై శివాజీ గ్రౌండ్ సభలో విపక్ష ఇండియా కూటమి ప్రకటించింది. శక్తిని నాశనం చేయడమే వారి లక్ష్యమైతే శక్తి ఉపాసనే మా సంకల్పం. శివాజీ పార్కులో ప్రతి పిల్లాడూ జై భవానీ, జై శివానీ మంత్రం వింటూ, పఠిస్తూ పెరుగుతాడు. మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్ తుల్జా భవానీ మాత ఆశీస్సులతోనే దేశ స్వేచ్ఛ కోసం పోరాడారు. శక్తిని ఆరాధించారు. ఆయన పేరిట ఉన్న శివాజీ పార్కులోనే శక్తిని అంతమొందిస్తామని విపక్షాలు ప్రతినబూనాయి. ఈ మాట వింటే శివసేన వ్యవస్థాపకుడు దివంగత బాల్ ఠాక్రే ఆత్మ క్షోభిస్తుంది. ఎందుకంటే ఆయన కుమారుడు ఉద్ధవ్ అదే సభా వేదికపై ఉన్నారు. ప్రతి భారతీయ మహిళా శక్తికి ప్రతిరూపమే. నారీ శక్తికే మా ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. చంద్రయాన్–3 దిగిన చోటుకు శివశక్తిగా నామకరణం చేశాం'' అని మోదీ గుర్తుచేశారు. ''నారీ శక్తే నాకు నిశ్శబ్ద ఓటరని కొందరు రాజకీయ విశ్లేషకులంటున్నారు. కానీ నా దృష్టిలో నారీ శక్తి అంటే అమ్మవారి శక్తి స్వరూపం'' అన్నారు. ''అమ్మవారి శక్తి స్వరూపమంటే భరతమాతకు మరో పేరు. కన్నడ కవి, జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత కువెంపు సైతం కర్ణాటక మాత అంటే శక్తి స్వరూపిణి అన్నారు. ఇండియా కూటమి నేతలు మాత్రం ఏకంగా శక్తినే నాశనం చేస్తామంటున్నారు. ఇది మన తల్లులు, సోదరీమణులు, కూతుళ్లపై, మహిళా సంక్షేమ పథకాలపై దాడి. ధర్మాగ్రహ శక్తే ఉగ్రవాదాన్ని, అరాచకాలను అంతమొందిస్తుంది. ఆ శక్తినే విపక్షాలు సవాలు చేస్తున్నాయి. శక్తి సత్తా ఏంటో, శక్తికి ఎదురెళ్తే ఏమైతుందో ప్రతి మహిళ, కుమార్తె, సోదరీ కాంగ్రెస్‌కు తెలిసేలా చేయాలి'' అన్నారు.



కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలామంది సీఎంలున్నారంటూ మోదీ ఎద్దేవా చేశారు. ''వెయిటింగ్ సీఎం, కాబోయే సీఎం, సూపర్ సీఎం, షాడో సీఎం. అధిష్టానానికి నిధులు పంపించే కలెక్షన్ మంత్రి విడిగా ఉన్నారు. ప్రభుత్వాన్ని నడపడానికి కూడా పైసల్లేకుండా నిధులన్నీ నొక్కేశారు'' అంటూ దుయ్యబట్టారు. కోయంబత్తూర్‌లో మోదీ 2.5 కి.మీ. పొడవున రోడ్ షో చేశారు.

'శక్తి' వ్యాఖ్యలు మతపరమైనవి కావు: రాహుల్



న్యూఢిల్లీ: 'శక్తి'పై పోరాటం చేస్తామన్న తన వ్యాఖ్యలను ప్రధాని మోదీ వక్రీకరించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం ఆరోపించారు. ''నిష్ఠుర సత్యాలు మాట్లాడతాను కాబట్టే మోదీజీకి నా మాటలు అస్సలు ఇష్టం ఉండదు. వాటిని తరచూ వక్రీకరిస్తారు. శక్తి (అధికారం) అంటూ నేను ప్రస్తావించింది ముసుగుమాటున దాక్కున్న మోదీ గురించే. ఆ అధికారమే ఇప్పుడు దేశ గొంతుకను నొక్కేస్తోంది. సీబీఐ, ఐటీ, ఈడీ, ఈసీ, మీడియా, పారిశ్రామిక రంగం... అన్ని వ్యవస్థలనూ ఆ శక్తే గుప్పిట్లో పెట్టుకుంది. ఆస్తులన్నీ కొందరికే కట్టబెట్టింది. అగ్నివీర్ పథకం ముసుగులో యువత కలలను కల్లలు చేసింది. వీటిపై నేను గొంతెత్తితే మోదీ, ఆయన అనుచరగణం అసహనంతో ఊగిపోతారు'' అన్నారు. ఏదో ఒకటి చేసి ప్రజల దృష్టి మరల్చడంతో మోదీ నిపుణుడని కాంగ్రెస్ నేతలు ప్రియాంకా గాంధీ, పవన్ ఖేడా తదితరులు అన్నారు. మహిళా రెజ్లర్లు బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్ సింగ్ చేతుల్లో లైంగిక వేధింపులకు గురైనపుడు మోదీ శక్తి ఉపాసన ఏమైందని ప్రశ్నించారు. ఈసారి పోరు అసురశక్తికి, దైవశక్తికి మధ్యేనని వారన్నారు.

రష్యాతో నాటో ఘర్షణకు దిగితే... మూడో ప్రపంచ యుద్ధమే

పశ్చిమదేశాలకు పుతిన్ హెచ్చరిక ● ఐదోసారి రష్యా అధ్యక్షుడిగా విజయం



మాస్కో: రష్యా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మరుక్షణమే వ్లాదిమిర్ పుతిన్ పశ్చిమ దేశాలకు యుద్ధ హెచ్చరికలు పంపారు. ''అమెరికా సారథ్యంలోని నాటో కూటమి, రష్యా సైన్యం మధ్య ప్రత్యక్ష ఘర్షణలు జరిగితే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది. ఆధునిక ప్రపంచంలో ఏదైనా సాధ్యమే. కానీ అంతటి దారుణ విపత్తును ఎవరూ కోరుకోరు'' అన్నారు. ఉక్రెయిన్ సైన్యానికి తోడుగా కదనరంగంలోకి ఫ్రాన్స్ బలగాలను దింపే ఉద్దేశముందన్న ఆ దేశ అధ్యక్షుడు మేక్రాన్ వ్యాఖ్యలపై పుతిన్ ఇలా స్పందించారు. ''ఉక్రెయిన్ యుద్ధంలో వందలాది ఇంగ్లిష్, ఫ్రెంచ్ సైనికులు చనిపోయారు. ఇది సరికాదు'' అన్నారు.

చర్చలకు సదా సిద్ధం

ఉక్రెయిన్ సైన్యం దాడులు ఇలాగే కొనసాగితే దాని చుట్టూ ఒక బఫర్ జోన్‌ను సృష్టిస్తామని పుతిన్ అన్నారు. ''దాన్ని దాటి వైరి సైన్యం రష్యా భూభాగంలోకి అడుగుపెట్టడం అసాధ్యం. పూర్తిగా ఓటమి పాలయ్యేలోపు శాంతి బాట పట్టడం ఉత్తమం. చర్చలకు సిద్ధమని మేం మొదట్నుంచీ చెబుతున్నాం'' అన్నారు. రష్యా అధ్యక్ష ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగలేదన్న అమెరికా, పశ్చిమ దేశాల వాదనను పుతిన్ కొట్టిపారేశారు. అమెరికాలోనే ఎన్నికలు సజావుగా జరగడం లేదని విమర్శించారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా అధ్యక్షుడు బైడెన్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

2030 దాకా అధ్యక్ష పీఠంపై

రష్యా రాజకీయ వ్యవస్థపై పుతిన్ పట్టు మరోసారి రుజువైంది. అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ఘనవిజయం సాధించారు. పోలైన ఓట్లలో 87.29 శాతం (7.6 కోట్ల) ఓట్లు ఆయనకు పడ్డట్టు సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ సోమవారం ప్రకటించింది. పుతిన్‌కు ఇన్ని ఓట్లు రావడం ఇదే తొలిసారి. ఆరేళ్లపాటు, అంటే 2030 దాకా పుతిన్ అధ్యక్షునిగా కొనసాగుతారు. ఆయనకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఇరుదేశాల భాగస్వామ్యం మరింత సుదృఢంకావాలని అభిలషించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఉత్తరకొరియా పాలకుడు కిమ్, హోండురాస్, నికరాగ్వా, వెనిజులా, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ దేశాధినేతలూ పుతిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పశ్చిమదేశాలు మాత్రం ఈ ఎన్నికలు పెద్ద మోసమని విమర్శించాయి.

నవాల్నీని వదిలేద్దామనుకున్నాం..

దివంగత విపక్ష నేత అలెక్సీ నవాల్నీ ప్రస్తావనను పుతిన్ తొలిసారిగా బహిరంగంగా తెచ్చారు. ''ఖైదీల మార్పిడిలో భాగంగా నవాల్నీని విదేశాలకు అప్పగించి పశ్చిమదేశాల జైళ్ల నుంచి రష్యన్లను వెనక్కు తెద్దామని మా అధికారుల సలహాకు వెంటనే ఒప్పుకున్నా. ఆ లోపే ఆయన జైల్లో చనిపోయారు. కొన్ని అలా జరుగుతాయంతే. ఇదే జీవితం'' అన్నారు.

సాక్షి
కరీంనగర్
మంగళవారం । 19 । మార్చి । 2024



ఓటరుగా నమోదు చేసుకోండి

ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశం ఇచ్చింది. అర్హులందరూ ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ 6:25	బుధ 4:53

గరిష్టం/కనిష్టం
34.0/25.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల అప్పుడప్పుడు ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎంసీహెచ్ ల్యాబ్‌లో మద్యం కలకలం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) ల్యాబ్‌లో పనిచేసే సిబ్బంది మద్యం సేవించే వీడియో కలకలం రేపింది. రాత్రి వేళల్లో వారు తరచూ మద్యం సేవిస్తున్నారనడానికి ఇదే నిదర్శనమని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రతీరోజు వందలాది మంది గర్భిణులు వైద్య పరీక్షల కోసం, పదుల సంఖ్యలో డెలివరీ కోసం రాత్రీపగలు తేడా లేకుండా వస్తుంటారు. మద్యం తాగి విధులు నిర్వహిస్తే తప్పుడు రిపోర్టులు ఇస్తే అవి వైద్యులను తప్పుదారి పట్టించే అవకాశం ఉంది. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డిని వివరణ కోరగా తమ దృష్టికి రాగానే సిబ్బందిని డీఎంహెచ్‌వోకు సరెండర్ చేసి, కలెక్టర్‌కు సమాచారం అందించామని తెలిపారు.

ప్రతీ సోమవారమే ఫిర్యాదులు స్వీకరిస్తాం

- సీపీ అభిషేక్ మహంతి



కరీంనగర్ క్రైం: పోలీసులు లోక్‌సభ ఎన్నికల విధుల్లో ఉన్నందున కరీంనగర్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతీ సోమవారం మాత్రమే బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని సీపీ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ ఫిర్యాదుల సెల్‌కు రావాలనుకునేవారు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కరీంనగర్: 57 ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట జిల్లా సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయల లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి, 77 ఏళ్లు గడుస్తున్నా విద్య, వైద్య, వ్యవసాయ, రాజకీయ రంగాల్లో మాల మాదిగలే పురోగతి సాధించారన్నారు. ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు బాణాల రాజారాం, ఔషధం రవీందర్, తల్వారి పరమేశ్వర్, బొల్లంపల్లి సాగర్, తోటపల్లి రాజలింగం, పురుషోత్తం ప్రభాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ రెండో విడత మూల్యాంకనం

కరీంనగర్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల రెండో విడత మూల్యాంకనాన్ని ఈ నెల 20 నుంచి ప్రారంభిస్తున్నట్లు డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని(ప్రభుత్వ, ప్రైవేటు, సాంఘిక సంక్షేమ, మహాత్మా జ్యోతిబాపూలే, ఆదర్శ, కేజీబీవీ, మైనార్టీ) జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు హాజరు కావాలన్నారు. భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం సబ్జెక్టులను ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల)లో మూల్యాంకనం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎగ్జామినర్ నియామక ఉత్తర్వులు tsbie.cgg.gov.in లో అందుబాటులో ఉన్నాయన్నారు.



సభకు హాజరైన జనం

మరెన్నో ఇస్తాం

- ఎన్‌హెచ్–563, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ, టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేశాం
- రైతులు, మహిళలు, యువతను ఆదుకున్నాం..
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తెరచాటు మిత్రులు
- బీజేపీని గెలిపించండి
- జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి ప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల/జగిత్యాలరూరల్: తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ల పరిధిలో నిజామాబాద్–ఖమ్మం వరకు ఎన్‌హెచ్–563, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ, రైలు మార్గాల నిర్మాణం, టర్మరిక్ బోర్డు, నిజాం షుగర్ ఫ్యాక్టరీకి నిధులు.. ఇలా ఎన్నో ఇచ్చాం.. వచ్చే పదేళ్లలో తెలంగాణ ప్రగతిపై ఫోకస్ చేసి, మరెన్నో ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో రోడ్లు, రైలు, గోదాంలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రసంగించారు. రాష్ట్రంతోపాటు ఉమ్మడి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ కోసం బీజేపీని గెలిపించాలని, అబ్ కీ బార్ 400 పార్ అని పిలుపునిచ్చారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరతో రైతులను, సంక్షేమ పథకాలతో మహిళలను, రుణాలిచ్చి యువతను ఆదుకున్నామని తెలిపారు. పసుపు మద్దతు ధర, టర్మరిక్ బోర్డు ఏర్పాటు, నిజాం షుగర్ ఫ్యాక్టరీకి, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణకు రూ.6,400 కోట్లు వెచ్చించామన్నారు. కాళేశ్వరం అవినీతి విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల తీరును ఎండగట్టారు. ఆ పార్టీలు తెరచాటు మిత్రులని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ అగ్రనాయకులు లక్ష్మణ్, సత్యనారాయణరావు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, నిర్మల్ ఎమ్మెల్యే పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



వేదికపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, గోమాస శ్రీనివాస్, ఎమ్మెల్యేలు రామారావుపటేల్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ నాయకులు బొడిగె శోభ, బోగ శ్రావణి తదితరులు

రజాకార్ సినిమా చూడండి



వీరులను కన్న గడ్డ జగిత్యాలలో పీఎఫ్‌ఐ లుచ్చాగాళ్లు అడ్డా పెట్టి, పాకిస్తాన్ జిందాబాద్ అంటుంటే వాళ్లకు ఆర్థిక సాయం చేస్తున్న వాళ్లను వదిలేద్దామా? నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులు జగిత్యాల సొంతం. రాముని పేరు చెబితే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వాళ్ల గజగజ వణుకుతున్నరు. దేశ ప్రజల భాగస్వామ్యంతో అయోధ్యలో రాముని గుడిని కట్టింది బీజేపీయే. మా పార్టీ బరాబర్ శ్రీరాముని పేరుతో ఎన్నికల్లోకి వెళ్తంది. మీకు దమ్ముంటే బాబర్ పేరుతో ఓట్లడగండి. తెలంగాణ ప్రజాలారా... ప్రతిఒక్కరూ రజాకార్ సినిమా చూడండి. నిజాం సమాధి వద్ద మోకరిల్లిన కేసీఆర్, ఒవైసీ సోదరులను కట్టేసి, ఈ సినిమా చూపించండి.

– ఎంపీ బండి సంజయ్



దేశ ప్రజలందరూ ప్రధాని కుటుంబమే

ప్రధాని నరేంద్ర మోదీకి కుటుంబం లేదంటున్న విపక్షాలకు సిగ్గులేదు. దేశ ప్రజలందరూ ఆయన కుటుంబమే. వేములవాడ రాజన్న ఆశీర్వాదంతో తెలంగాణ నుంచి బీజేపీ తరఫున అత్యధిక ఎంపీ స్థానాలు గెలిచి, ప్రధానికి కానుకగా ఇద్దాం. పదేళ్ల యూపీఏ హయాంలో జరగని స్కాం లేదు. బీఆర్‌ఎస్ కాళేశ్వరం నుంచి కరెంటు వరకు అవినీతి మయం చేసింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయలేక చేతులెత్తేసింది.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత



ఐదో ఆర్థిక శక్తిగా మన దేశం

ప్రధాని మోదీ వల్లే మన దేశం ప్రపంచ దేశాల్లో బలమైన ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగింది. మయన్మార్, పాకిస్తాన్ లాంటి దేశాలను దారికి తెచ్చిన ఘనత ఆయనదే. మోదీ వల్లే దేశంలో సుస్థిరత, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయి. ఇటీవల సీఏఏ అమలు చేశారు. త్వరలో ఎన్‌ఆర్‌సీ, యూసీసీ కోడ్‌ను కూడా అమలు చేస్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి.

– ఎంపీ ధర్మపురి అర్వింద్

వేడినీళ్లు పడి విద్యార్థినులకు తీవ్రగాయాలు

- గంధ్రపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఘటన

జమ్మికుంట(హుజూరాబాద్): వేడినీళ్లు పడి, ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాలయ్యాయి.. ఈ ఘటన గంధ్రపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలిక పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్‌కు మంజూరైన గురుకుల పాఠశాలను జమ్మికుంట మండలం గంధ్రపల్లి శివారులోని ఓ ప్రైవేటు బిల్డింగ్‌లో కొనసాగిస్తున్నారు. మంచిర్యాల జిల్లా సోమగూడెంకు చెందిన శరణ్య, జమ్మికుంట మండలంశంభునిపల్లికి చెందిన సిరిచందన ఈ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వీరిని మెస్ ఇన్‌చార్జులు నియమించడంతోపాటు వంట పనులు చేయిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వంట చేస్తుండగా వేడినీళ్లు పడి, ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయమై 'సాక్షి' వైస్ ప్రిన్సిపాల్, కుక్, ఎంఈవో నర్సింహారెడ్డికి ఫోన్ చేస్తే స్పందించలేదు.



చర్మం ఊడిపోయిన శరణ్య కాలు

తొలిరోజు 'పది' పరీక్ష ప్రశాంతం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు.. పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- 75 కేంద్రాల్లో హాజరైన 12,445 మంది విద్యార్థులు

కరీంనగర్: పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఎస్సెస్సీ బోర్డు అధికారులు గంట ముందే సెంటర్లకు చేరుకోవాలని చెప్పడంతో తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయగా రాష్ట్ర పరిశీలకులు, జిల్లా పరిశీలకులతోపాటు డీఈవో జనార్దన్‌రావు, ఫ్లయింగ్‌స్క్వాడ్ పర్యవేక్షించారు.

మాల్ ప్రాక్టీస్ జరగలేదు..

మొదటి పేపర్ తెలుగు పరీక్ష జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. మొత్తం 75 కేంద్రాల్లో పరీక్ష జరగగా 12,458 మంది విద్యార్థులకు 12,445 మంది హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 43 మందికి 23 మంది వచ్చారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగలేదని డీఈవో తెలిపారు. ఐదు ప్రత్యేక తనిఖీ బృందాలు 26 పరీక్ష కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ 7, జిల్లా విద్యాశాఖాధికారి 7, రాష్ట్ర పరిశీలకులు 6, అదనపు కలెక్టర్ 1, కలెక్టర్ పమేలా సత్పతి 2 కేంద్రాలను సందర్శించినట్లు పేర్కొన్నారు.

కరీంనగర్ పట్టణంలోని జ్యోతినగర్ సెయింట్ ఆల్ఫోన్స్, మంకమ్మతోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ధన్గర్‌వాడీ)ల్లోని పరీక్ష పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీ చేశారు. వసతుల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్లు మోహన్ రెడ్డి, ప్రమోదలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటూ..

నీరు.. రోజు విడిచి రోజు

- నగరంలోని 9 డివిజన్లలో నీటి ఎద్దడి
- తెలిసినవారి ఇళ్ల నుంచి వాహనాల్లో తరలింపు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కరీంనగర్ కార్పొరేషన్: వేసవి ప్రారంభమైంది. ఎండలు ముదరకముందే డ్యాంలో నీటిమట్టం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే నీటి సమస్య తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. కానీ, వీటన్నింటికన్నా ముందే నగరంలోని ఆ 9 డివిజన్లలో నీటి ఎద్దడి మొదలైంది. మిగతా డివిజన్లలో ప్రతీరోజు నల్లా ద్వారా తాగునీటి సరఫరా జరుగుతున్నా వీటికి మాత్రం రోజు విడిచి రోజు వస్తోంది.

ఎస్సారార్ రిజర్వాయర్ పరిధిలో..

నగరంలోని ఎస్సారార్ రిజర్వాయర్ పరిధిలోకి 20, 21, 22, 23, 39, 40, 41, 57 డివిజన్లతోపాటు 2వ డివిజన్‌కు సంబంధించిన కొంత ప్రాంతం వస్తుంది. గతంలో కోర్టు రిజర్వాయర్ నుంచి ఈ ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేశారు. శాతవాహన యూనివర్సిటీ వద్ద నూతనంగా రిజర్వాయర్ నిర్మించాక, అక్కడి నుంచి నీరందిస్తున్నారు. కోర్టు, అంబేడ్కర్ తదితర రిజర్వాయర్ల నుంచి మోటారు పంపింగ్ ద్వారా చేస్తుండగా, ఎస్సారార్ రిజర్వాయర్ నుంచి మాత్రం గ్రావిటీ ద్వారా సరఫరా అవుతోంది. ఇదే సమస్యగా మారింది. ఎల్ఎండీలో క్రమంగా నీటిమట్టం తగ్గుతుండటంతో నీరు తగినంత ప్రెషర్‌తో రావడం లేదు. ఫలితంగా ఈ 9 డివిజన్లకు రోజు విడిచి రోజు తాగు నీరందిస్తున్నారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి. నీటి సరఫరా వేళలు కూడా తగ్గిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటికి వాటర్ ట్యాంకులపై ఆధారపడుతున్నారు. ఇతర కాలనీలకు చెందిన తెలిసినవారి ఇళ్ల నుంచి వాహనాల్లో నీటిని తరలిస్తున్నారు. మార్చి నెలలోనే ఇలా ఉంటే, ఏప్రిల్, మే నెలల్లో చుక్క నీరు కూడా దొరకదేమోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే, గ్రావిటీ ద్వారా సరఫరా అయ్యే కోతిరాంపూర్ రిజర్వాయర్ పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ నిత్యం తాగునీటి సరఫరాను నిలిపివేసి, రోజు విడిచి రోజు ఇస్తున్నారు. ఎల్ఎండీలో గతేడాది ఇదే సమయంలో 13 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ఇప్పుడు 7.5 టీఎంసీలకు పడిపోయింది.



తెలిసినవారి ఇంటి నుంచి వాహనంలో నీటిని తరలిస్తున్న నగరవాసులు

పంపింగ్ ద్వారా నీరివ్వాలి



వేసవి ప్రారంభంలోనే మా ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు మొదలయ్యాయి. మాకు గతంలో కోర్టు రిజర్వాయర్ నుంచి పంపింగ్ ద్వారా నీటి సరఫరా జరిగేది. శాతవాహన రిజర్వాయర్‌కు మార్చాకే నీటి సమస్య తలెత్తింది. పంపింగ్ ద్వారానే నీరివ్వాలి. ఎల్ఎండీకి నీటిని విడుదల చేయాలి.

– గంట కల్యాణి, కార్పొరేటర్, 22వ డివిజన్

'రీసెర్చ్ మెథడాలజీ'తో ఉపయోగాలు

- ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్
- వర్సిటీలో 7 రోజుల కోర్సు ప్రారంభం

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సెవెన్ డేస్ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ఫర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్ అండ్ యంగ్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్సెస్ ఇన్ తెలంగాణ రీజియన్ కార్యక్రమాన్ని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్ సంకశాల సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 7 రోజుల ఈ కోర్సును వర్సిటీలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పరిశోధక విద్యార్థులకు దీనివల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. విశిష్ట అతిథి ఆచార్య బి.సుధాకర్ రెడ్డి హానరరీ డైరెక్టర్ ఐసీఎస్ఎస్ఆర్ సదరన్ రీజియన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇనేబుల్డ్ రీసెర్చ్ ఇన్ సోషల్ సైన్సెస్ అనే అంశంపై మాట్లాడారు. పరిశోధన అంశాలపై నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలకు ఐసీఎస్ఎస్ఆర్ ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ హరికాంత్, కార్యక్రమ కో–కోఆర్డినేటర్ మనోహర్, కోఆర్డినేటర్ శ్రీరంగప్రసాద్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన 14 మంది ఆచార్యులు వివిధ అంశాలపై సెషన్స్ తీసుకుంటారని పేర్కొన్నారు. లెక్చరర్లు మనోజ్‌కుమార్, కృష్ణకుమార్, తిరుపతి, నరేశ్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ మల్లేశ్

ఈదురుగాలులతో భారీ వర్షం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో సోమవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. 45వ డివిజన్ రాజీవ్‌నగర్‌లో ఓ ఇంటిముందున్న చెట్టు విరిగిపడి, బైక్ ధ్వంసమైంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు.



కోడ్ ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయండి

- 24 గంటలు అందుబాటులో కంట్రోల్‌రూం
- టోల్ ఫ్రీ నంబర్లు 1950, 18004254731
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయాలని, యంత్రాంగం 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఈ మేరకు పర్యవేక్షణ, ఫిర్యాదుల స్వీకరణ కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేయగా సోమవారం ఆమె ప్రారంభించారు. నిబద్ధతతో విధులు నిర్వహించాలని అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు. కంట్రోల్ రూం సిబ్బంది నిరంతరం ఫోన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి, యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. మొత్తం మూడు బృందాలను నియమించామని, 24 గంటలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా డబ్బు, మద్యం తరలించినా, పంపిణీ చేసినా ప్రజలు నిర్భయంగా కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నంబర్లు 1950, 18004254731లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈడీఎం శ్రీరామ్ శ్రీనివాస్‌రెడ్డి నోడల్ అధికారిగా వ్యవహరిస్తుండగా ఉద్యోగులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఓటరు కార్డు రాకున్నా, ఓటుహక్కు ఉందా లేదా తెలుసుకోవడంతోపాటు పలు అనుమానాల నివృత్తి కోసం ఆయా నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. సీ విజిల్ యాప్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలకు, బ్యానర్లు, పోస్టర్లు, మైక్‌లు, సౌండ్ బాక్స్‌ల ఏర్పాటు కోసం రాజకీయ పార్టీలు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



కంట్రోల్‌రూంను ప్రారంభించిన కలెక్టర్ పమేలా సత్పతి

ఎన్నికల నిబంధనలు పాటించాలి..

లోక్‌సభ ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. సభలు, సమావేశాల నిర్వహణకు 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ పత్రాలు ఇస్తామన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే ఘటనలు జరిగితే సీ విజిల్ యాప్‌లో సంబంధిత ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయాలన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారని తెలిపారు. అభ్యర్థుల ఖర్చుల వివరాలపై అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, ఆర్డీవో మహేశ్వర్, టౌన్ ఏసీపీ నరేందర్, నాయకులు మడుపు మోహన్, నాంపల్లి శ్రీనివాస్, అనిల్ కుమార్, కల్యాడపు ఆగయ్య, మిల్కూరి వాసుదేవ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

కరీంనగర్ క్రైం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పాటించాల్సిన ఎన్నికల నియమావళిని సీపీ అభిషేక్ మహంతి సోమవారం విడుదల చేశారు. దీని ప్రకారం..

- ఎన్నికల సంబంధిత సభలు, సమావేశాల నిర్వహణకు ఈ–సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకొని, అనుమతి పొందాలి. వ్యక్తిగత దూషణలు చేసుకోరాదు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించిన వారిపై చర్యలుంటాయి.
- డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగించరాదు. లౌడ్ స్పీకర్ ఉపయోగించేందుకు అనుమతి తీసుకోవాలి.
- ఆలయాలు, మసీదులు, చర్చిలు ఇతర ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచార నిమిత్తం వినియోగించరాదు.
- ప్రచారం కోసం వాడే వాహనాలకు సంబంధిత అనుమతి పత్రాన్ని అంటించాలి.
- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వ్యక్తిగతంగా కించపరిచే పోస్టులు పెడితే చర్యలుంటాయి.
- ఓటర్లను ప్రలోభపెట్టే అక్రమ మద్యం రవాణా, డబ్బు, ఉచితంగా వస్తువుల పంపిణీ నిషేధం. ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలుంటాయి.

క్లుప్తంగా

డీజే వాహనం సీజ్

జమ్మికుంట: అధిక శబ్దంతో అసౌకర్యం కలిగించిన డీజే వాహనాన్ని సీజ్ చేశామని టౌన్ సీఐ వరగంటి రవి సోమవారం తెలిపారు. మండలంలోని పాపక్కపల్లి గ్రామంలో ఓ వివాహ వేడుకల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం దుగ్యాల గ్రామానికి చెందిన దేశెట్టి సాయికుమార్ అనే వ్యక్తి డీజే సౌండ్‌తో అసౌకర్యం కలిగిస్తున్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డీజే వాహనాన్ని సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేశామని సీఐ రవి వివరించారు.

‘రైతు నేస్తం’లో నేడు

కరీంనగర్ అర్బన్: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మెలకువలపై శాస్త్రవేత్తలు వివరిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 11.30 వరకు ఎంపిక చేసిన రైతు వేదికల్లో రైతులు నేరుగా వీక్షించవచ్చని వివరించారు. కరీంనగర్ జిల్లాలో తిమ్మాపూర్, కొత్తపల్లి, గంగాధర, హుజూరాబాద్ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను ఏర్పాటు చేశామని, సమీప గ్రామాలు, మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్‌ఫామ్, వేసవిలో సాగు చేసే కూరగాయలు, వాటిపై వాడే పురుగుమందుల అవశేషాల గురించి శాస్త్రవేత్తలు వివరిస్తారని పేర్కొన్నారు.

సన్మానం



సమ్మయ్యకు సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసి పదోన్నతి పొంది చర్లపల్లి సెంట్రల్ జైలుకు బదిలీ అయిన జి.సమ్మయ్యను సోమవారం జైలు అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కె.శ్రీనివాస్, జైలు డాక్టర్ వేణుగోపాల్, జైలర్లు శ్రీనివాస్, రమేశ్, డిప్యూటీ జై లర్లు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేశ్, ఎన్.సంగీత, జగిత్యాల, హుజూరాబాద్ జైలు అధికారులు మొగిలేష్, గణేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘునందన్‌రావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు తీవ్రగాయాలు



గాయపడిన శ్రీనివాస్

ఓదెల(పెద్దపల్లి): ఇందుర్తి గ్రామంలోని అసిస్టెంట్ లైన్ మెన్ బత్తుల శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురయ్యారు. బాయమ్మపల్లెలో సోమవారం విద్యుత్ స్తంభం ఎక్కి కరెంటు తీగలు సరిచేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అయ్యింది. ఈక్రమంలో విద్యుదాఘాతంతో కిందపడ్డారు. కాళ్లు, చేతులు కాలిపోవడంతో వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. సిబ్బంది తప్పిదంతోనే విద్యుత్ సరఫరా అయి శ్రీనివాస్ కరెంట్ షాక్‌కు గురయ్యారని గ్రామస్తులు ఆరోపించారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

- ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులకు అవకాశం
- ప్రత్యేక క్యాంపెయిన్‌లో అర్జీలు అత్యల్పం



కరీంనగర్ అర్బన్: ఓ వైపు పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుంటే మరో వైపు యువత నుంచి ఓటరు నమోదుకు ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. ఆధార్‌కార్డు నమోదు, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొందడంలో సాంకేతికతను వినియోగిస్తున్న యువత ఓటరు నమోదుకు ఎందుకు వెనకడుగేస్తున్నట్లు..? అధికారుల నిర్లక్ష్యమా.. పర్యవేక్షణ లోపమా.. యుద్ధప్రతిపాదికన చర్యలకు దిగాల్సిన తరుణమిది. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు మరో అవకాశమిచ్చింది. ఏప్రిల్ 15వ తేదీ వరకు ఓటరు నమోదుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒకప్పుడు కార్యాలయాల చుట్టూ తిరిగి ఓటరుగా నమోదు చేసుకునే పరిస్థితులుండేవి. కాలానుగుణంగా వస్తున్న మార్పుల దృష్ట్యా అరచేతిలోనే ఓటరుగా నమోదు చేసుకునే సౌలభ్యం అందించింది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలన్నది ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యం. అందుకే వివిధ కార్యక్రమాలతో దగ్గరవుతోంది. ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకుంటే ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడుతుంది.

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు

ఓటరుగా నమోదు కావాలనుకునేవారు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫారం–6 లో వివరాలను పొందుపరిచి అక్కడే సమర్పించాలి. ఆధార్‌కార్డు, ఇంటి చిరునామాను సూచించే కరెంట్ బిల్లు, ఇతరత్రా ఏదేని ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది. బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో విచారించి ఓటరుగా నమోదు చేస్తారు.

ఓటరు నమోదుకు పలు మార్గాలు

క్యాంపెయిన్‌కు వెళ్లలేనివారు అరచేతిలోనే ఓటరుగా నమోదు కావచ్చు. http:///voters.eci.gov.i n వెబ్‌సైట్‌లోకి వెళ్తే సర్వీస్ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మొబైల్ నంబర్‌తో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ కావాలి. ఆన్‌లైన్‌లో కొత్త ఓటరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం, తప్పులు సరిచేసుకోవడానికి, ఓటుహక్కును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ చేసుకోవడానికి, జాబితాలో రెండు ఓట్లు ఉంటే ఒకటి తొలగింపు, ఇతర అంశాలకు సంబంధించి వేర్వేరుగా ఫారం–6, 7, 8 కనిపిస్తాయి. వాటిలో కావాల్సిన దానిపై క్లిక్ చేసి అందులో వివరాలు పొందుపరిచి సబ్మిట్ చేయాలి. వివరాలు ఏఈఆర్వోకు వద్దకు వెళ్తాయి. పరిశీలించి ఆమోదిస్తారు.

యాప్‌తో కూడా..

బీఎల్వో వద్దకు వెళ్లలేని వారు.. వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మొబైల్‌లో voter helpline mobile App డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా.. లేదా చూసుకునే అవకాశం కల్పించారు.

గుర్తింపు కార్డు పొందడం ఇలా..

ఓటరు గుర్తింపుకార్డు కావాలనుకునేవారు http:///voters.eci.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఈ–ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మొబైల్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గుర్తింపుకార్డు ఫోన్ నంబర్‌కు అనుసంధానమైతే ఓటీపీ వస్తుంది. లేదంటే ఫారం–8 ద్వారా ఫోన్‌నంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. తర్వాత గుర్తింపు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

జిల్లా జనాభా:	11,50,202
ఓటర్లు:	10,68,280
18 – 19 ఏళ్ల యువత:	48,379
ఓటర్లుగా నమోదైనవారు:	4,560
నమోదు కావాల్సినవారు:	40,740

నియోజకవర్గాల వారీగా 18-19 ఏళ్ల యువత

నియోజకవర్గం	యువత	నమోదు చేసుకున్నవారు
కరీంనగర్	14,663	2,994
హుజూరాబాద్	11,268	4,824
మానకొండూరు	10,796	2,735
చొప్పదండి	11,652	2,814

గృహజ్యోతి దరఖాస్తుల తిరస్కరణ

- ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని లబ్ధిదారుల ఆందోళన
- ఎన్నికల కోడ్ ఎఫెక్ట్



ముస్తాబాద్‌లోని గృహజ్యోతి కౌంటర్ వద్ద లబ్ధిదారుల ఆందోళన

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రంలో గృహజ్యోతి అర్జీదారులు ఆందోళనబాట పట్టారు. మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన గృహజ్యోతి దరఖాస్తుల కౌంటర్‌ను ఎన్నికల కోడ్ వచ్చిందని మూసివేయడంపై అర్జీదారులు ఆందోళన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం కోసం అన్ని రకాల పత్రాలతో దరఖాస్తు చేసుకున్నా తప్పుగా నమోదు చేశారన్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చిందంటూ ఎడిట్ ఆప్షన్ కూడా ఇవ్వకుండా చేయడం సరికాదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేయడంలో దొర్లిన తప్పులకు తాము శిక్ష అనుభవిస్తున్నామన్నారు. సవరణకు అవకాశం కల్పించాలని కంప్యూటర్ ఆపరేటర్ రాణితో వాగ్వాదానికి దిగారు. ఆన్‌లైన్‌లో సవరణకు అవకాశం కల్పించకుండా కోడ్ వచ్చిందని మరో మూడు నెలలు నిలిపివేయడం సరికాదని బైరగౌని రాజు, కుంబాల రాజిరెడ్డి, లచ్చపేట రాజు, సురేశ్, రామస్వామి, ప్రమీల, గౌరవ్వ, రాజవ్వ పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తి చాటాలి



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్ రావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్మన్ సాగర్ రావు

- ‘జ్యోతిష్మతి’లో స్పోర్ట్స్ ఫీస్టా 2024
- పోటీలను ప్రారంభించిన చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలని జ్యోతిష్మతి కళాశాలల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతిష్మతి అటానమస్ కళాశాలలో స్పోర్ట్స్ ఫీస్టా 2024ను సోమవారం సాగర్‌రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీలు 12 రోజులు సాగుతాయని, కళాశాల ఆవరణలో జరిగే క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. చదువుతోపాటు ఆటల్లో రాణిస్తూ కళాశాల, తల్లిదండ్రులకు పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ ఫీస్టాలో భాగంగా క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారం, త్రోబాల్, టేబుల్ టెన్నిస్‌తో పాటు బాస్కెట్‌బాల్ పోటీలు ఉంటాయని వివరించారు. అనంతరం టాస్ వేసి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, అకాడమిక్స్ డీన్ డాక్టర్ వైశాలి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ సంపత్‌రావు, కో ఆర్డినేటర్స్ సీహెచ్ సజన్‌రావు, రాజేశ్, సత్య తేజ, ఉదయ్ ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

గొంతునులిమి.. చెట్లపొదల్లో పడేసి..

- ప్రాణం తీసిన మొదటి భర్త
- విడాకులైనా ఇద్దరి మధ్య సాన్నిహిత్యం
- ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన



అంజలి (ఫైల్)

మల్యాల(చొప్పదండి): వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఇద్దరి మధ్య కలహాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. దీంతో యువతిని మరో వ్యక్తికిచ్చి వివాహం జరిపించారు. అయినప్పటికీ ఆమె తన మొదటి భర్తతో సన్నిహితంగానే ఉంటోంది. ఇంతలో ఏమైందో తెలియదుగానీ.. ఆమెను గొంతునులిమి హతమార్చి చెట్లపొదల్లో పడేశాడు. ఈ సంఘటన మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల పట్టణానికి చెందిన కరిపే అంజలి.. గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేశ్ ప్రేమించుకున్నారు. నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. కుటుంబకలహాల కారణంగా రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. అనంతరం అంజలిని సిద్దిపేటకు చెందిన వ్యక్తికిచ్చి మరో పెళ్లి చేశారు. అయినా మొదటి భర్త నరేశ్ అంజలితో ఫోన్‌లో తరచూ మాట్లాడుతున్నాడు. రెండు రోజుల క్రితం సిద్దిపేట నుంచి జగిత్యాలలోని పుట్టింటికి వచ్చిన అంజలికి ఫోన్ చేసిన నరేశ్.. ఈనెల 17న తన బైక్‌పై తీసుకెళ్లాడు. మ్యాడంపల్లి శివారులోకి చేరగానే ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె గొంతునులిమి చంపి చెట్లపొదల్లో పడేశాడు. సోమవారం అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నీలం రవి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జగిత్యాలకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



నర్సింగం (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): కొత్తూరు గ్రామానికి చెందిన భూతగడ్డల నర్సింగం(35) సోమవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు బావిలో దిగి ప్రమాదవశాత్తు తూరితీగ చేతులకు చుట్టుకోవటంతో మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన సాగల నారాయణ పొలం వద్దగల వ్యవసాయ బావిలో చేపలు పట్టేందుకు లోనికి దిగిన నర్సింగం.. బావిలోని తూరితీగ చెతులకు చుట్టుకుని నీట మునిగి ఊపిరాడక మరణించినట్లు మృతుడి భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బరాత్‌లో నృత్యం చేస్తూ కరీంనగర్ వాసి..

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామంలో వివాహ వేడుకలో నృత్యం చేస్తూ కరీంనగర్‌కు చెందిన రావుల విజయ్‌కుమార్(30) హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడితో ఓదెలకు చెందిన ఓ యువతితో ఆదివారం వివాహం జరిగింది. ఆ తర్వాత రాత్రి వేళ భరాత్ జరిగింది. ఇందులో నృత్యం చేస్తుండగా విజయ్‌కుమార్ అకస్మాత్తుగా కుప్పకూలాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య రావుల పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి తెలిపారు. దాదాపు 48 ఏళ్ల వయస్సు వ్యక్తి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో నాలుగు రోజుల క్రితం కిందపడిపోయాడని స్థానికులు తెలపడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతదేహం ఆస్పత్రిలో ఉందని తెలిసిన వారు సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

అరుదైన వ్యాధితో యువకుడు..

- రూ.15 లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం



సాయికృష్ణ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అరుదైన వ్యాధితో నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు మృతిచెందిన సంఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన పెరుమండ్ల సాయికృష్ణ (23) లిప్టో స్పైరోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబం కావడంతో అప్పులు చేసి రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినా ప్రాణాలు దక్కలేదు. మృతుడికి తండ్రి వెంకటేశం, తల్లి లలిత, చెల్లెలు అశ్విత ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



యోగాసన చేస్తున్న శకుంతల

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకురాలు మార్కొండ శకుంతల రాష్ట్రస్థాయి యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, జాతీయ స్థాయి యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికయ్యారు. 19 నుంచి 23 వరకు పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీలో జరిగే సీనియర్ జాతీయస్థాయి యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారు. గతంలో వివిధ జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 2017, 2018, 2020లో కాంస్య పతకాలు, 2021, 2023లో బంగారు పతకాలు సాధించారు. జిల్లాస్థాయి పోటీల్లో 2017లో రజతం, 2018లో కాంస్యం, 2019, 2021లో రజతం, 2023లో బంగారు పతకం సాధించారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొనబోతున్న ఆమెను కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లక్ష్మయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): గంగారం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మొట్లపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి లక్ష్మయ్య(86), తిరుపతి(44) ఆదివారం ఉదయం పని నిమిత్తం సుల్తానాబాద్ మండలం మియాపూర్‌లో బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణంలో కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో లక్ష్మయ్య, తిరుపతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మయ్య సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు. తిరుపతి చికిత్స పొందుతున్నారని అన్నారు.

దివ్యాంగులకు అండగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి

తిమ్మాపూర్(మానకొండూర్): దివ్యాంగులకు అందరూ అండగా ఉండాలని ఎల్ఎండీ కాలనీలోని కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వత్తి శిక్షణ కేంద్రం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి కోరారు. పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెండెకరాల స్థలంలో పాఠశాల నిర్మించుకున్నామని, 125 మంది మానసిక వికలాంగ విద్యార్థులకు ఆశ్రయమిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, ఆయాలు, సిబ్బంది 40 మంది నిర్వహణ ఖర్చులకు ఏటా రూ.62 లక్షల వ్యయం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.16 లక్షలు మాత్రమే మంజూరయ్యాయని, మిగతావి విరాళాలు, అప్పులు తెచ్చి సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి సమావేశానికి ముఖ్య అతిథిగా తనను ఆహ్వానించారని, అక్కడ కోరగానే పాఠశాలకు బస్సు కోసం రూ.25 లక్షలు విరాళం ఇచ్చారన్నారు. ట్రస్టు సభ్యులు కూడా కార్పొరేట్ సంస్థలను సంప్రదించి విరాళాలు సేకరించాలని కోరారు. పిల్లల తల్లిదండ్రులు తమకు తోచినంత ఇచ్చారు. మరికొంత మంది ఇస్తామని హామీ ఇచ్చారు. ట్రస్టు సభ్యులు సముద్రాల జనార్దన్ రావు, గాజుల భగవాన్, జాప వెంకటరమణా రెడ్డి, సైకాలజిస్టు గాలిపెల్లి నాగేశ్వర్, ముదుగంటి సుధాకర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి బాలరాజు, ప్రిన్సిపాల్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ రేషన్ బియ్యం

మానకొండూర్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జిల్లా పౌరసరాఫరాలశాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. మండలంలోని ముంజంపల్లి మీదుగా టాటా ఏస్ ట్రాలీ ఆటోలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో తిమ్మాపూర్ మండలం పొరండ్ల శివారులో అధికారులు తనిఖీ నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో జిల్లా పౌరసరాఫరాలశాఖ అధికారి గౌరీశంకర్, తిమ్మాపూర్ డీటీసీఎస్ ఎం. వేణుగోపాల్, కరీంనగర్ డీటీసీఎస్ సురేందర్, తిమ్మాపూర్ సీఎస్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్, కరీంనగర్ సీఎస్ ఇన్‌స్పెక్టర్ కమలేశ్వర్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన ఏడుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఏడుగురికి కరీంనగర్ కోర్టు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీముల్లా ఖాన్ తెలిపారు. సోమవారం 19 మందిని కోర్టులో ప్రవేశపెట్టగా ఏడుగురుకి మూడు రోజుల జైలు శిక్ష, రూ.16 వేలు జరిమానా, మిగితా 12 మందికి కలుపుకొని రూ.18 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



లారీ టైర్ కింద వ్యక్తి మృతదేహం

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ గ్రామపరిధిలోని ఎన్టీఆర్‌కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డస్ట్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఎలగందుల మూలమలుపు తిరుగుతుండగా ఎదురుగా సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని ఢీకొంది. సైకిల్‌పై ఉన్న వ్యక్తి టిప్పర్ టైర్ల కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి మహారాష్ట్రకు చెందిన వాసిగా, ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడని స్థానికుల ద్వారా తెలిసింది.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు

కరీంనగర్‌క్రైం: నగరంలోని కిసాన్‌నగర్‌లో ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్‌నగర్‌లోని బేతెస్త చర్చి సెక్రెటరీ ఆధ్వర్యంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా చర్చి సెక్రెటరీ కవ్వంపల్లి తిమోతిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

‘అల్ఫోర్స్’ విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థులకు సైన్స్ కీలకమని, పలు పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి ఉపకరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిలవ్రోజోన్ ఫౌండేషన్‌వారు నిర్వహించిన అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు గడ్డం విహాన్ రెడ్డి 3వ తరగతి, కె.అమ్షన్ రెడ్డి 5వ తరగతి, జి.అశ్రునయా రెడ్డి 5వ తరగతి, సిద్విక్ నార్ల 6వ తరగతి, అమాన్ ఉల్లా బేగ్ మిర్జా 6వ తరగతి, టి.అమిత్‌విక్రమ్ 7వ తరగతి, పి.అన్షుల్ 7వ తరగతి, పి.అభినవ్ సహస్ర 8వ తరగతి, కె.తనీష్ రెడ్డి 8వ తరగతి, బి.ఆద్యారెడ్డి 8వ తరగతి తదితరులు పతకాలు సాధించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సోమవారం వారికి పుష్పగుచ్ఛాలు అందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో ఏటీఎం చోరీ



ధ్వంసమైన ఏటీఎం మిషన్

హుజూరాబాద్: పట్టణంలోని కరీంనగర్ రోడ్డులోని కోర్టు కాంప్లెక్స్‌లో ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. ఏటీఎం నెట్‌వర్క్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్‌చారి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. దుండగులు సుమారు రూ. 8,64,100 ఎత్తుకెళ్లారని, చోరీ ఆనవాళ్లు దొరక్కుండా ఉండేందుకు ఏటీఎంను ధ్వంసం చేసి తగులబెట్టారని ఫిర్యాదు పేర్కొన్నాడు. ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ బొల్లం రమేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కరీంనగర్ నుంచి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.



రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న ఐజీ రంగనాథ్ దంపతులు



రాజన్నను దర్శించుకునేందుకు ఆలయంలో బారులుతీరిన భక్తులు

కోడెమొక్కుల స్వామికి కోటి దండాలు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామిని ఐజీ రంగనాథ్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు నాగుల మహేశ్, డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ శ్రీనివాస్ ఉన్నారు. రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.

క్లుప్తంగా

మిల్లెట్ ఫుడ్‌పై అవగాహన


మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీనారాయణ

కరీంనగర్: పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా కిసాననగర్ సెక్టార్ పరిధిలోని శివనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం గర్భిణులు, పాలు ఇచ్చే తల్లులకు మిల్లెట్ ఫుడ్‌పై అవగాహన, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి.లక్ష్మీనారాయణ, కిసాన్‌నగర్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, స్కూల్ టీచర్ సందీప్, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: లోకసభ ఎన్నికల సందర్భంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం కరీంనగర్‌లోని బస్టాండ్ ఏరియా, నాఖా చౌరస్తా, గీతాభవన్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఎన్నికల నియమావళి ముగిసే వరకు వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీపీ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల నియమావళి పాటించాలని, ఉల్లంఘించి పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీపీ స్పష్టం చేశారు.

22న జయంతోత్సవ కమిటీల నియామకం

కరీంనగర్: ఏప్రిల్ 5, 14న జరుగబోయే బాబూజగ్జీవన్‌రామ్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతోత్సవ కమిటీలను ఈనెల 22న కరీంనగర్‌లోని అర్అండ్‌బీ అతిథి గృహంలో నియమిస్తున్నట్లు తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం (టీఏవైఎస్) జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సంఘాల ప్రతినిధులు, అంబేడ్కర్ వాదులు హాజరై జయంతోత్సవ కమిటీలను విజయవంతం చేయాలని కోరారు.

28న హుండీల ఆదాయం లెక్కింపు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని దేవాదాయ శాఖ పరిధిలోని మంకమ్మతోట భక్తాంజనేయ స్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని 28న ఉదయం 10 గంటలకు, జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయ హుండీలను మధ్యాహ్నం 12 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయాల ఈవో ఎన్.అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది సకాలంలో హాజరు కావాలని, ఔత్సాహిక భక్తులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

23న వేంకటేశ్వర ఆలయ హుండీ..
నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను శనివారం మధ్యాహ్నం 1 గంటకు లెక్కించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు గిద్దెపెరుమాండ్ల ఆలయంలో..
నగరంలోని కోతిరాంపూర్‌లో గల పోచమ్మ ఆలయం హుండీలను మంగళవారం ఉదయం 10 గంటలకు, కోతిరాంపూర్‌లోని గిద్దెపెరుమాండ్ల ఆలయంలోని హుండీలను మధ్యాహ్నం 12 గంటలకు లెక్కిస్తున్నట్లు ఈవో మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక భక్తులు పాల్గొనవచ్చని అన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్లకు చెందిన గీత కార్మికుడు బుర్ర హన్మాండ్లు సోమవారం తాటిచెట్టుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. హన్మాండ్లు సోమవారం ఉదయం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ఆకస్మాత్తుగా మోకు జారడంతో కిందపడ్డాడు. వెంటనే సమీపంలో ఉన్న గీతకార్మికులు చికిత్స కోసం హన్మాండ్లును కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. కాలు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు చికిత్స చేశారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా మంగళవారం రేకుర్తి 11కేవీ ఫీడర్ పరిధిలోని ఇందిరమ్మకాలనీ, పారడైస్ స్కూల్, బుడగజంగాలకాలనీ, విజయపురికాలనీ, పాతవాడ, కొత్తవాడ, ఐ ఆస్పత్రి రోడ్, సాలెహ్‌నగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్‌రూరల్ ఏడీఈ కె.రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

వహ్.. హలీం!

- నగర వాసులకు నోరూరిస్తున్న వెరైటీ రుచులు
- 1956లో ప్రారంభమైన హలీం ప్రస్థానం
- తొలిదశలో పోస్టు కార్డులతో ప్రచారం
- నేడు స్టార్ హోటల్స్ మొదలు గల్లీ మసీదుల వద్ద హలీం కేంద్రాలు



విద్యానగర్(కరీంనగర్): రంజాన్ మాసంలో గుర్తొచ్చేది కఠోర ఉపవాసాలు, దాన ధర్మాలు, ప్రత్యేక దైవప్రార్థనలు. వీటితో పాటు నోరూరించే ప్రత్యేక వంటకాలు. ఉపవాస దీక్షలు కొనసాగించే వారికి ఇఫ్తార్ సమయంలో ఇచ్చే విందులు ప్రాముఖ్యత సంతరించుకుంటాయి. పగలంతా ఉపవాస దీక్ష పాటించే ముస్లింలు నిరంతరం దైవ ప్రార్థన చేయడమే కాకుండా తమ ఆహార అలవాట్లను క్రమబద్ధం చేసుకుని ఆరోగ్యాలను మెరుగుపర్చుకుంటారు. భౌతికంగా, ఆధ్యాత్మికంగా మనిషిని శుద్ధి చేయడమే రంజాన్ ముఖ్య లక్ష్యం. ప్రత్యేక వంటకాలను రూపొందించుకుని వాటిని రుచి చూడడం ఆనవాయితీ. నెల రోజుల పాటు లభించే హలీం వంటకంతో కరీంనగర్‌లో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ముకరంపుర, రాజీవ్‌చౌక్, బస్టాండ్ రోడ్, మసీదుల ప్రాంతాల్లో ఈ వంటకాలను నగర వాసులకు అందిస్తున్నారు.

స్టార్ హోటల్స్ నుంచి గల్లీ మసీదుల వరకు



ఇరానీ సంప్రదాయాలు ఇప్పుడు మనతో మమేకమయ్యాయి. ఇరానీ రుచులు తొలి నుంచి ఉమ్మడి జిల్లా వాసులకు పరిచయమే. ప్రస్తుతం కరీంనగర్‌లో పేరున్న స్టార్ హోటల్స్‌తో పాటు గల్లీ మసీదుల వద్ద ప్రత్యేక స్టాల్స్ ఏర్పాట్లు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు.

21 ఏళ్లుగా అమ్మకాలు



21 ఏళ్లుగా మహేక్ క్యాటరింగ్ సెంటర్ ద్వారా హలీం, హరీస్, బిర్యానీ, అరేబియన్ వంటకాలను కరీంనగర్ వాసులకు రుచి చూపిస్తున్నాం. హలీం తయారీలో ఇరానీ పద్ధతులు పాటిస్తూ, ఆహార అలవాట్లకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం. స్వచ్ఛమైన మసాలా దినుసులు ఉపయోగించి తయారు చేయడం ప్రత్యేకత.

– బాబా పటేల్, మాహేక్ క్యాటరింగ్, కింగ్స్ హలీం సెంటర్, కరీంనగర్

మతాలకు అతీతంగా..



రంజాన్ స్పెషల్ వంటకాలను మతాలకు అతీతంగా అందరూ ఇష్టపడి తింటారు. నాణ్యతతో హలీం తయారు చేస్తాం. అమ్మకాలు బాగున్నాయి.

– మహ్మద్ అర్షిత్, దుకాణదారు, రాజీవ్ చౌక్, కరీంనగర్

హలీం ప్రస్థానం



హలీం అంటే రంజాన్ అనే స్థాయిలో ప్రాచుర్యం పొందిన వంటకం. ఇరాన్‌కు చెందిన హుస్సేన్ జాబిత్ 1947లో హైదరాబాద్‌లోని మదీనా సర్కిల్‌లోని హోటల్ ప్రారంభించి ఇరాన్ వంటకాలను హైదరాబాదీలకు రుచి చూపించాడు. తర్వాత కాలంలో 1956లో రంజాన్ మాసం ప్రారంభమైన తొలిరోజు హలీం పేరుతో కొత్త వంటకాన్ని తయారు చేసి 25పైసలకు ఒక పాత్రలో ఇవ్వడంతో హలీం ప్రస్థానం ప్రారంభమైంది. తొలిరోజుల్లో అంతగా ఆదరణ లభించకపోవడంతో బిర్యానీకి హలీం ఫ్రీ అని ప్రకటించారు. తర్వాత సంవత్సరం హలీం విశిష్టతను తెలియజేస్తూ పోస్టు కార్డులతో ప్రచారం నిర్వహించారు. టెలిఫోన్ డైరెక్టరీ ఆధారంగా అందులో ఉన్న అడ్రస్‌లకు పోస్టుకార్డులు రాశారు. దీంతో కొంత మేర విక్రయాలు పెరిగాయి. 1956–1960 వరకు పోస్టు కార్డులు, పత్రిక ప్రకటనలు, పోస్టర్లు తదితర మార్గాల్లో హుస్సేన్ ప్రచారం నిర్వహించగా ప్రయత్నం ఫలించి 1961 నుంచి హలీంకు డిమాండ్ పెరిగింది.

నేడు విశ్వవ్యాప్తం

హలీం ఇప్పుడు విశ్వవ్యాప్తమైన రంజాన్ స్పెషల్ వంటకం. రంజాన్ మాసంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి హలీంను పెద్ద ఎత్తున తయారు చేసి విక్రయించడం ప్రారంభమై మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ఆదరణ పొందింది.

డ్రైనేజీ నీరు తొలగించాలి


కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న బాలాజీనగర్‌వాసులు

కరీంనగర్ కార్పొరేషన్ :తమ కాలనీలో నిలుస్తున్న డ్రైనేజీ నీటిని తొలగించాలని, శాశ్వత పరిష్కారం చూపాలంటూ నగరంలోని 21వ డివిజన్ బాలాజీనగర్ వాసులు సోమవారం నిరసన తెలిపారు. వీ పార్క్ హోటల్ వెనుక మురుగునీరు నిలిచిన ప్రాంతానికి చేరుకున్న స్థానికులు డ్రైనేజీ నీటితో ఎలా ఉండేదంటూ ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఈఈ మహేందర్, డీఈ వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీహరి, ఏఈ గంగాధర్ తదితరులు అక్కడికి చేరుకొన్నారు. సైడ్ డ్రైన్‌నుంచి మురుగునీరు తొలగించేలా చూస్తామని చెప్పినప్పటికీ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మురుగునీటిని నేరుగా రహదారి వైపున్న మెయిన్ డ్రైన్‌కు కలిపేలా చూడాలని, అందుకు అడ్డుగా ఉన్న ప్రైవేట్ భూమికి సంబంధించిన యజమానికి ఒప్పించాలని స్థానికులు పేర్కొన్నారు. గతంలోనే ప్రైవేట్ భూమిని డ్రైనేజీ స్థలం కొనుగోలు చేసేందుకు డబ్బులు వసూలు చేశారని, కాని ఇప్పటికీ సమస్య అలానే ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యానగర్, శ్రీహరికాలనీ, యూనివర్సిటీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ నీటిని ఇటువైపే మళ్లించారని, అవి బయటకు వెళ్లే మార్గం చూపలేదంటూ స్థానికులు అండెం ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీమతిరెడ్డి తదితరులు మండిపడ్డారు. స్థానికంగా ఆక్రమణలు చోటుచేసుకున్నాయని, ప్రైవేట్ భూముల్లో ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయని తెలిపారు.. దీంతో దరఖాస్తు ఇస్తే ప్రభుత్వ భూములను వెలికితీసి డ్రైనేజీ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని అధికారులు చెప్పారు.

ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం

- వాల్ పోస్టర్లు, రాతలు తొలగించని అధికారులు



దుర్శేడ్‌లో ఎంపీ సంజయ్ వాల్ రైటింగ్



మొగ్దుంపూర్‌లో వినోద్‌కుమార్ వాల్‌పోస్టర్

కరీంనగర్‌రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్‌ను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడటంతో ఆదివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో పలు రాజకీయ పార్టీలకు చెందిన గోడరాతలు, వాల్‌పోస్టర్లను తొలగించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన నాయకులు గ్రామాల్లో పోటాపోటీగా వాల్‌పోస్టర్లు అంటించడంతో పాటు గోడరాతలు రాయించారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఐదేళ్ల కాలంలో గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వివరాలతో గ్రామాల వారీగా పెద్దసంఖ్యలో వాల్‌పోస్టర్లను అంటించారు. ప్రధాన చౌరస్తాల్లో భారీసైజుఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఎంపీగా తాను చేసిన అభివృద్ధి పనులతో వాల్‌పోస్టర్లు అంటించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాలు, గోడలపై ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లు, రాతలను అధికారులు తొలగించకపోవడంతో ఇంకా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా వాల్‌పోస్టర్లు, రాతలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యం


మాట్లాడుతున్న డాక్టర్ ప్రతిష్టారావు

కరీంనగర్‌టౌన్: కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యపడుతుందని మెడికవర్ ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ ప్రతిష్టారావు అన్నారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి, ఎస్సారార్ కళాశాల మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఎస్సారార్ కళాశాలలో నిర్వహించిన హెల్త్ టాక్‌లో మాట్లాడారు. కేన్సర్ వ్యాధి ఏ కారణం చేతనైనా రావచ్చని, అయితే గతంలో మాదిరిగా కేన్సర్ సోకిన వారు భయపడాల్సిన పనిలేదన్నారు. సర్వైకల్ కేన్సర్ అయినా మరే ఇతర క్యాన్సర్లయినా తొలిదశలో గుర్తిస్తే నయం చేసేందుకు పూర్తి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వైద్య రంగంలో రోజురోజుకు ఎన్నో మార్పులు వస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే సర్వైకల్ కేన్సర్ బారిన పడకుండా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. అనంతరం కేన్సర్ వంటి ప్రమాదకర జబ్బులను అధిగమించేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సహకార చట్టాల ప్రకారం పాలక మండలిని నియమించాలి

విద్యానగర్(కరీంనగర్): సహకార చట్టాల ప్రకారం రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఫిషరీస్ ఫెడరేషన్)కు పాలక మండలిని నియమించాలని మన తెలంగాణ ముదిరాజ్ మహాసభ మత్స్యకారుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేశ్ అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిషరీస్ ఫెడరేషన్‌కు నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్‌ను నియమించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, సహకార వ్యవస్థ నియమాలకు విరుద్ధమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన నాటి నుంచి గత ప్రభుత్వం రాష్ట్రంలో మత్స్య సహకార సంఘాల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. మత్స్యకారుల వృత్తిలో కొనసాగుతున్న వారు ఎక్కువగా ముదిరాజ్ కులస్తులేనని వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫెడరేషన్‌కు నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్‌ను నియమించడం సరికాదన్నారు. సహకార చట్టాల ప్రకారం 33 జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించి, రాష్ట్రస్థాయి సమాఖ్య (ఫిషరీస్ ఫెడరేషన్)కు పాలక మండలిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మామిడి తిరుపతి, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాల కనకయ్య, తెలంగాణ ఫిషరీస్ సొసైటీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల ద్వారా ఉన్నత విజయాలు అందుకోవచ్చు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్‌సిటీ: నైపుణ్యాల ద్వారా విద్యార్థులు ఉన్నత విజయాలు అందిపుచ్చుకోవచ్చని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఇంటర్ పర్సనల్ స్కిల్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ట్రైనర్ ప్రవీణ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్.మారుతితో పాటు లెఫ్టినెంట్ పి.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు


మోదీ సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని 17, 18, 19 డివిజన్ల రేకుర్తి నుంచి సోమవారం జగిత్యాలలో జరిగే ప్రధాని మోదీ విజయ సంకల్ప సభకు పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డిలు మాట్లాడుతూ దేశంలో మళ్లీ మోదీ ప్రధాని కాబోతున్నారని, 400 పార్లమెంటు సీట్లు పైచిలుకు బీజేపీ గెలవబోతుందని అన్నారు. ప్రపంచం మోదీ వైపు చూస్తోందని భారతదేశాన్ని విశ్వ గురువు స్థానంలో నింపడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు విష్ణు ప్రసాద్‌రావు, ప్రతాపరెడ్డి, నాంపల్లి శంకర్, దుర్గం ఆంజనేయులు, రాకేశ్, నాయక్, ఉపేందర్, విద్యాసాగర్, ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి గోదారి నరేష్, ఎర్రోళ్ల ప్రశాంత్, రావుల భాస్కరాచారి, గోనె లక్ష్మణ్, మల్లయ్య, తాటికొండ శంకర్, దీకొండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు సందర్శన


అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్‌డీఓ, ఏసీపీ

ఇల్లందకుంట: కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన సిరిసేడు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును హుజూరాబాద్ డివిజన్ ఎన్నికల అధికారులు, ఆర్‌డీఓ రమేశ్‌బాబు, ఏసీపీ శ్రీనివాస్‌జీ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో పలుఅంశాలపై చర్చించారు. చెక్‌పోస్టుల వద్ద చేపట్టాల్సిన ఎన్నికల నియమావళి చర్యల గూర్చి వివరించారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు మీదుగా అక్రమ మద్యం, డబ్బు రవాణా కట్టడికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తనిఖీల్లో నిర్లక్ష్యం వహించొద్దని అలాచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, ఎస్సై రాజ్‌కుమార్, ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

తిమ్మాపూర్: పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని తిమ్మాపూర్ సర్కిల్ సీఐ స్వామి సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, ఓటర్లకు అండగా ఉన్నామని తెలియజేసేందుకు తిమ్మాపూర్‌లో కేంద్ర బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. అనంతరం సీఐఎస్ఎఫ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ విక్రాంత్ షాకీన్, సీఐ మాట్లాడా రు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లను బాధ్యులుగా చేస్తామన్నారు. కులం,మతం పేరుతో పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ మరమ్మతులు చేసేదెలా..?



గ్రామీణ ప్రాంతాల్లో ఓ ప్రైవేట్ ఇంటర్నెట్ సంస్థ ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలను వినియోగిస్తుండటంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కరీంనగర్ మండలం బొమ్మకల్, గుంటూరుపల్లి, గోపాల్‌పూర్, దుర్శేడ్ తదితర గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలకు ఇంటర్నెట్ వైర్లు, జంక్షన్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. విద్యుత్ సిబ్బంది ఏదైనా మరమ్మతులు వచ్చినపుడు స్తంభాలపైకి ఎక్కేందుకు వైర్లు అడ్డుగా ఉండటంతో పడరానీ పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను అక్రమంగా వినియోగిస్తున్న సంస్థపై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

వైభవంగా పుష్పార్చన


పుష్పార్చన నిర్వహిస్తున్న వేదపండితులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి 52వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేదపండితులు పుష్పార్చన అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలోవిశేష అభిషేకం, అధ్యయనోత్సవం, ద్రావిడ వేద పారాయణం, స్వామివారి ఆరాధన కార్యక్రమాలు చేశారు. కల్యాణదాతలు వంగళ వెంకటమ్మ, రాజగోపాల్‌రెడ్డిభారతమ్మ, శ్రీనివాస్‌రెడ్డి శారద, వంచ రవీందర్‌రెడ్డిలక్ష్మీ, బండ శ్రీనివాస్‌రెడ్డిపద్మ, చింతిరెడ్డి అంజిరెడ్డిలక్ష్మీభార్గవితో పాటు దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చెన్నమనేని రాజేందర్‌రావు, మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి, వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం 20వ తేదీన మధ్యాహ్నం నిర్వహించనున్నామని దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్లు చెన్నమనేని రాజేందర్‌రావు, వీర్ల ప్రభాకర్‌రావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

జమ్మికుంట: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపీవో శ్రావణ్‌కుమార్‌పై ఎంపీపీ వెంకటరాధ దాడిని నిరసిస్తూ జమ్మికుంట ఎంపీడీవో కార్యాలయం ఎదుట అధికారులు, సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై ప్రజాప్రతినిధులు దాడులకు దిగడం హేయమైన చర్య అని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వ ఉద్యోగులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపిక

కరీంనగర్‌సిటీ: కమిషనరేట్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిజ్ఞాస–స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ అటానమస్ కళాశాల నుంచి 8 ప్రాజెక్టులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో కళాశాల నుంచి 14 సబ్జెక్టుల్లో జిజ్ఞాస ప్రాజెక్టులు సమర్పించగా 8 ప్రాజెక్టులు (తెలుగు, హిందీ, భౌతికశాస్త్రం, మైక్రోబయాలజీ, ఎకానమిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్) ఎంపికయ్యాయన్నారు. అందుబాటులో ఉన్న వనరులతో సృజనాత్మకతను జోడించి సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేసినందుకు అధ్యాపకులు, విద్యార్థులను, కళాశాల జిజ్ఞాస కోఆర్డినేటర్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కళాశాలకు బహుమతులు తీసుకువచ్చి కళాశాల ప్రతిష్ట పెంచాలని ఆకాంక్షించారు.



ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ చాంపియన్స్ అల్‌కరాజ్, స్వియాటెక్

ప్రతిష్టాత్మక ఇండియన్ వెల్స్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) టైటిల్ నిలబెట్టుకోగా... మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) రెండోసారి విజేతగా నిలిచింది. కాలిఫోర్నియాలో జరిగిన ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 7–6 (7/5), 6–1తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)ను ఓడించగా... స్వియాటెక్ 6–4, 6–0తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 2016లో జొకోవిచ్ తర్వాత ఇండియన్ వెల్స్ టోర్నీని వరుసగా రెండేళ్లు సాధించిన ప్లేయర్‌గా అల్‌కరాజ్ నిలిచాడు. అల్‌కరాజ్ కెరీర్‌లో ఇది ఐదో మాస్టర్స్ సిరీస్ టైటిల్. విజేతలుగా నిలిచిన అల్‌కరాజ్‌కు 11 లక్షల డాలర్ల (రూ. 9 కోట్ల 11 లక్షలు) ప్రైజ్‌మనీ, 1000 ర్యాంకింగ్ పాయింట్లు... స్వియాటెక్‌కు 11 లక్షల డాలర్ల (రూ. 9 కోట్ల 11 లక్షలు) ప్రైజ్‌మనీ, 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



‘సూరీడు’ నిప్పులు చెరిగేదెప్పుడు?

- నిలకడలేమితో సన్‌రైజర్స్ హైదరాబాద్
- ఈసారి కొత్త కెప్టెన్, కొత్త హెడ్ కోచ్ ఆధ్వర్యంలో బరిలోకి

మరో 3 రోజుల్లో ఐపీఎల్

ఎనిమిది, ఎనిమిది, పది... గత మూడు ఐపీఎల్ సీజన్‌ల పాయింట్ల పట్టికలో వరుసగా సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థానాలు ఇవి! 2023లోనైతే మరీ ఘోరంగా టీమ్ నాలుగే విజయాలు సాధించింది. 2020లో డేవిడ్ వార్నర్ సారథ్యంలో మూడో స్థానంలో నిలిచిన తర్వాత జట్టు మళ్లీ కోలుకో లేదు. తర్వాతి ఏడాది విభేదాలతో వార్నర్‌ను ఎనిమిది మ్యాచ్‌లకే పరిమితం చేసిన టీమ్ మేనేజ్‌మెంట్ ఆ తర్వాత ఎన్ని ప్రయోగాలు చేసినా ఏవీ కలిసి రాలేదు. విదేశీ ఆటగాళ్లు అక్కడక్కడా మెరవడం మినహా భారత క్రికెటర్లు ఎవరూ జట్టును గెలిపించలేకపోతున్నారు. అభిమానుల కోణంలో అయితే వారంతా అపరిచితుల్లా కనిపిస్తున్నారు. లీగ్‌లో ప్రతీ టీమ్ ఏదో ఒక దశలో విధ్వంసక ఆటతీరుతో అందరి దృష్టినీ ఆకర్షిస్తుండగా సన్‌రైజర్స్ మాత్రం పాతకాలపు ఆటతోనే నడిపిస్తోంది. విదేశీ ఆటగాళ్లు కూడా తమపై ఉన్న అంచనాలు, ఒత్తిడిని అధిగమించి ఏ మేరకు రాణిస్తారనేది చెప్పలేం. ఈ నేపథ్యంలో మరో సీజన్‌కు జట్టు సిద్ధమైంది. వన్డే వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ కమిన్స్ సారథ్యంలో, కొత్త హెడ్ కోచ్ డానియల్ వెటోరి పర్యవేక్షణలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్న సన్‌రైజర్స్ టోర్నీలో ఎంత దూరం వెళుతుందనేది ఆసక్తికరం.

సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యానికే చెందిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ సౌతాఫ్రికా టి20 టోర్నీలో వరుసగా రెండేళ్లు టైటిల్స్ సాధించింది. ఈ రెండు సార్లూ కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ జట్టును విజేతగా నిలిపాడు. అయినా సరే అతడిని కాదంటూ ఆస్ట్రేలియా స్టార్ ప్యాట్ కమిన్స్‌ను రైజర్స్ ఈసారి కొత్త కెప్టెన్‌గా నియమించింది. వేలంలో కమిన్స్‌ను రైజర్స్ రూ. 20 కోట్ల 50 లక్షల భారీ ధరకు కొనుక్కుంది. గత ఏడాది కాలంలో నాయకుడిగా ఆసీస్‌కు అసాధారణ విజయాలు అందించిన కమిన్స్ అగ్రశ్రేణి టి20 లీగ్‌లో ఒక జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా కమిన్స్ 2023లో ఐపీఎల్ ఆడలేదు. 2022లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున 5 మ్యాచ్‌లే ఆడిన అతను ఏకంగా 10.68 ఎకానమీతో 7 వికెట్లే తీశాడు. అంతకుముందు సీజన్‌లోనూ 7 మ్యాచ్‌లలో 9 వికెట్లే తీసి భారీగా పరుగులిచ్చాడు. ఓవరాల్‌గా కమిన్స్‌కు టి20ల్లో అంత ఘనమైన రికార్డు ఏమీ లేదు. జట్టులో సమర్థులైన విదేశీ ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నా కూడా కెప్టెన్ హోదాలో కమిన్స్ అన్ని మ్యాచ్‌లు ఆడతాడు. ఇటీవల అతని బౌలింగ్ మెరుగైనా... తీవ్ర ఒత్తిడిలో జట్టుకు మంచి ఫలితాలు అందించడం కీలకం. సన్‌రైజర్స్ తమ తొలి మ్యాచ్‌ను ఈనెల 23న ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడుతుంది.

విదేశీ బృందం ఇలా...

కమిన్స్‌ను మినహాయిస్తే మరో ముగ్గురు విదేశీయులకే తుది జట్టులో చాన్స్ ఉంది. ఇలాంటి స్థితిలో రైజర్స్ అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లలో ఎవరిని ఎంచుకుంటుందో చూడాలి. బ్యాటర్లలో వరల్డ్‌కప్ ‘ఫైనల్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ట్రవిస్ హెడ్, గత ఏడాది టీమ్ టాప్ స్కోరర్ హెన్రిచ్ క్లాసెన్, దక్షిణాఫ్రికా టి20 కెప్టెన్ మార్క్‌రమ్, దూకుడుగా ఆడగల గ్లెన్ ఫిలిప్స్ అందుబాటులో ఉన్నారు. తాజా ఫామ్, గుర్తింపును బట్టి చూస్తే హెడ్, క్లాసెన్‌లు ఖాయంగా కనిపిస్తున్నారు. అప్పుడు బౌలింగ్‌లో అగ్రశ్రేణి లెగ్ స్పిన్నర్, ఐపీఎల్‌లో మంచి రికార్డు ఉన్న హసరంగకు తుది జట్టులో చోటు ఖాయం. ఆల్‌రౌండర్‌గా మార్కో జాన్సెన్ కూడా సిద్ధంగా ఉన్నా అతడిని ఆడించడం కష్టంగా మారనుంది. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ కారణంగా హసరంగ లీగ్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. అప్పుడు జాన్సెన్‌కు అవకాశం లభించవచ్చు.

–సాక్షి క్రీడా విభాగం


వెటోరి


ట్రవిస్ హెడ్


కమిన్స్

జట్టు వివరాలు

కమిన్స్ (కెప్టెన్), మార్క్‌రమ్, ఫిలిప్స్, క్లాసెన్, హెడ్, జాన్సెన్, హసరంగ, ఫజల్ హక్ (విదేశీ ఆటగాళ్లు). అబ్దుల్ సమద్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్, అన్‌మోల్‌ప్రీత్, ఉపేంద్ర యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, అభిషేక్, వాషింగ్టన్ సుందర్, సన్వీర్ సింగ్, జాతవేద్ సుబ్రహ్మణ్యం, ఆకాశ్ సింగ్, షహబాజ్ అహ్మద్, భువనేశ్వర్, ఉనాద్కట్, నటరాజన్, ఉమ్రాన్, మయాంక్ మర్కండే (భారత ఆటగాళ్లు).

మనోళ్లు సత్తా చాటుతారా...


భువనేశ్వర్

బ్యాటింగ్ కోణంలో భారత ఆటగాళ్లంతా అంతంతమాత్రం ప్రదర్శనే కనబరుస్తున్నారు. ఏదో ఒక మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ మినహా నిలకడే లేదు. మయాంక్ అగర్వాల్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠిలలో ఒక్కరు కూడా గత సీజన్‌లో కనీసం 300 పరుగులైనా చేయలేకపోయారు. సమద్, అన్‌మోల్‌ప్రీత్ ప్రభావం చూపలేకపోగా... ఉపేంద్ర, నితీశ్ కుమార్ రెడ్డి, సన్వీర్ ఏమాత్రం ఆడతారో చూడాలి. రెండేళ్ల క్రితమే భారత జట్టుకు దూరమైన భువనేశ్వర్‌పైనే ఇంకా పేస్ బౌలింగ్ భారం ఉంది. ఉమ్రాన్ మాలిక్ తన వేగం మాత్రమే కాక ఇతరత్రా బౌలింగ్ మెరుగుపర్చుకొని ఉంటే ప్రభావం చూపించగలడు. నటరాజన్‌లో నాటి పదును తగ్గిపోగా, సీనియర్ జైదేవ్ ఉనాద్కట్ జట్టులో ఉండటం ఉపయోగపడవచ్చు. జట్టు స్పిన్ బలహీనంగా కనిపిస్తోంది. వాషింగ్టన్ సుందర్, షహబాజ్ అహ్మద్ ఫర్వాలేదనిపించే ఆటగాళ్లే. ఇన్నేళ్లుగా ఆడుతున్నా ఒక్క సీజన్‌లోనూ వీరిద్దరు ఎనిమిదికి మించి వికెట్లు తీయలేదు. మయాంక్ మార్కండే లెగ్‌స్పిన్ కొంత వరకు ప్రభావం చూపించవచ్చు.

రోహిత్ నన్ను భుజం తట్టి నడిపిస్తాడు: పాండ్యా



ముంబై: ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌ను నడిపించేది తనే అయినా కీలక పాత్ర మాత్రం మాజీ కెప్టెన్ రోహిత్ శర్మదేనని కొత్త కెప్టెన్ హార్దిక్ పాండ్యా అన్నాడు. ‘కెప్టెన్సీ మార్పు భిన్నమైందని నేననుకోను. రోహిత్ ఎప్పుడూ మా జట్టులో భాగమే. మేమిద్దరం కలిసి పదేళ్లుగా ఆడుతున్నాం. నా మొత్తం కెరీర్ అతని సారథ్యంలోనే సాగిపోయింది. ఇకమీదటా అతని అండదండలతోనే సాగుతుంది. ఈసారి ఐపీఎల్‌లో రోహిత్ నన్ను భుజం తట్టి నడిపిస్తాడు. ఇందులో ఎలాంటి సందేహం లేదు’ అని 2015 నుంచి 2021 వరకు ముంబై ఇండియన్స్‌కు ఆడిన పాండ్యా వివరించాడు. కొత్త ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌కు 2022, 2023లలో సారథ్యం వహించిన పాండ్యా ఈ రెండుసార్లూ జట్టును ఫైనల్‌కు చేర్చి ఓసారి విజేతగా నిలిపాడు. దీంతో ముంబై ఫ్రాంచైజీ తమ భవిష్యత్ ప్రయోజనాల కోసమంటూ ఐదు సార్లు ముంబైని చాంపియన్‌గా నిలిపిన రోహిత్‌ను తప్పించిమరీ పాండ్యాకు పగ్గాలు అప్పగించింది.

దివ్యాంశ్, రమిత కొత్త ప్రపంచ రికార్డులు




డార్ట్‌మండ్ (జర్మనీ): ఇంటర్నేషనల్ సైసన్ స్టార్ట్ ఫర్ షూటర్స్ (ఐఎస్ఎఎస్) షూటింగ్ టోర్నీలో భారత రైఫిల్ షూటర్లు దివ్యాంశ్ సింగ్ పన్వర్, రమితా జిందాల్ కొత్త ప్రపంచ రికార్డులు సృష్టించారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో దివ్యాంశ్ 254.4 పాయింట్లు స్కోరు చేసి పసిడి పతకం గెలిచాడు. ఈ క్రమంలో 253.7 పాయింట్లతో తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డును దివ్యాంశ్ బద్దలు కొట్టాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో రమిత 254.1 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకం సొంతం చేసుకుంది. అంతేకాకుండా 254 పాయింట్లతో హాన్ జియాయు (చైనా) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును రమిత సవరించింది.



కాంస్యం నెగ్గిన జ్యోతిక శ్రీ

త్రివేండ్రం: ఇండియన్ ఓపెన్ 400 మీటర్ల అథ్లెటిక్స్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దండి జ్యోతిక శ్రీ కాంస్య పతకం సాధించింది. సోమవారం జరిగిన ఈ మీట్‌లో జ్యోతిక 400 మీటర్లను 52.73 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) కోచ్ నాగపురి రమేశ్ వద్ద శిక్షణ తీసుకుంటున్న జ్యోతికకిదే అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన కావడం విశేషం. విత్యా (తమిళనాడు; 52.25 సెకన్లు) స్వర్ణం, పూవమ్మ రాజు (కర్ణాటక; 52.69 సెకన్లు) రజతం సాధించారు.

మైదానంలోకి కోహ్లి



బెంగళూరు: భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సుదీర్ఘ విరామం తర్వాత మైదానంలోకి దిగాడు. ఈ సీజన్ ఐపీఎల్ కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుతో సోమవారం కలిసిన అతను వెంటనే కసరత్తు మొదలు పెట్టాడు. చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ శిబిరం జరుగుతోంది. జట్టు కెప్టెన్ డుప్లెసిస్‌తో కలిసి కోహ్లి ప్రాక్టీస్ సెషన్‌లో గడిపాడు. ఇటీవల కోహ్లి తన భార్య అనుష్క శర్మ ప్రసవం కోసం ఇంగ్లండ్‌తో సొంతగడ్డపై జరిగిన ఐదు టెస్టుల సిరీస్ నుంచి పూర్తిగా విశ్రాంతి తీసుకున్నాడు. ఈ నెల 22న చెన్నైలో జరిగే ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్‌తో బెంగళూరు తలపడుతుంది.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలో....

ఆస్ట్రేలియా పర్యటనకు భారత హాకీ జట్టు



న్యూఢిల్లీ: వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో పర్యటించే భారత పురుషుల హాకీ జట్టును ప్రకటించారు. చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో 28 మంది ఆటగాళ్లతో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ జాబితా నుంచి రబిచంద్ర సింగ్‌ను తప్పించి మిగతా 27 మందితో టీమిండియా ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా, హార్దిక్ సింగ్ వైస్ కెప్టెన్‌గా కొనసాగుతారు. పారిస్ ఒలింపిక్స్ సన్నాహాల్లో భాగంగా భారత జట్టు పెర్త్ వేదికగా ఏప్రిల్ 1, 6, 7, 10, 12, 13వ తేదీల్లో ఆస్ట్రేలియా జట్టుతో ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది.

భారత హాకీ జట్టు: పీఆర్ శ్రీజేశ్, కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కెరా (గోల్‌కీపర్లు); హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, జుగ్‌రాజ్ సింగ్, అమిత్ రోహిదాస్, సంజయ్, సుమిత్, అమీర్ అలీ (డిఫెండర్లు); మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, షంషేర్ సింగ్, విష్ణుకాంత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, నీలకంఠ శర్మ, రాజ్‌కుమార్ పాల్ (మిడ్ ఫీల్డర్లు); ఆకాశ్‌దీప్ సింగ్, మన్‌దీప్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, గుర్జంత్ సింగ్, అరిజీత్ సింగ్ హుండల్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, అభిషేక్, మొహమ్మద్ రాహీల్ మౌసీన్, బాబీ సింగ్ ధామి (ఫార్వర్డ్స్).

సినిమా

అప్పట్నుంచి కీరవాణి ఫ్యాన్‌ని!


● అనుపమ్ ఖేర్, కీరవాణి

– అనుపమ్ ఖేర్

‘‘మా తరానికి చెందిన అద్భుతమైన సంగీతదర్శకుల్లో ఒకరైన కీరవాణితో సినిమా చేసే అవకాశం రావడం నాకు గర్వకారణం. నా కల నిజమైంది’’ అని బాలీవుడ్ ప్రముఖ నటుడు–దర్శకుడు అనుపమ్ ఖేర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఇరవై రెండేళ్ల తర్వాత ఆయన మళ్లీ మెగా ఫోన్ పట్టారు. గతంలో ‘ఓం జై జగదీష్’ (2002) చిత్రానికి దర్శకత్వం వహించారు అనుపమ్ ఖేర్. తాజాగా ‘తన్వీ ది గ్రేట్’ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతదర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటించి, ఆయన ట్రాక్ కంపోజ్ చేస్తున్న ఫొటోను షేర్ చేశారు. ‘‘ఆస్కార్ అవార్డు, గోల్డెన్ గ్లోబ్ అవార్డు విజేత కీరవాణి మా సినిమాకి మ్యూజిక్ ఇవ్వడం ఓ ఆశీర్వాదం. ఏడాదిగా ఈ సినిమాకి కలిసి పని చేస్తున్నాం. కీరవాణి స్వరపరచిన ‘తుమ్ మిలే దిల్ ఖిలే..’ (నాగార్జున, మనీషా కొయిరాలా, రమ్యకృష్ణ నటించిన ‘క్రిమినల్’ సినిమాలోని పాట) విన్నప్పట్నుంచి ఆయనకు అభిమాని అయిపోయాను. ఇప్పుడు నా సినిమా ఒప్పుకున్నందుకు ఆయనకు థ్యాంక్స్’’ అని పేర్కొన్నారు అనుపమ్ ఖేర్.


● రామ్‌చరణ్, కాజల్ అగర్వాల్

ఇక ఊహూ..!


● సమంత

‘ఊ అంటావా మావ..’ అంటూ ‘పుష్ప’లోని ప్రత్యేక పాటలో వీలైనంత గ్లామరస్‌గా కనిపించడంతో పాటు హాట్ స్టెప్స్‌తో, హాట్ హాట్ హావభావాలతో ఐటమ్ సాంగ్ లవర్స్‌ని ఆకట్టుకున్నారు సమంత. అయితే ఈ బ్యూటీ ఈ రేంజ్‌లో చేయడం చాలా మందిని షాక్‌కి గురి చేసింది. ‘అవసరమా?’ అని చర్చించుకున్నవాళ్లూ ఉన్నారు. సమంత కూడా ఈ పాట చేసినప్పుడు చాలా అసౌకర్యంగా ఫీలయ్యారట. ఆ విషయం గురించి ఇటీవల ఓ సందర్భంలో మాట్లాడుతూ – ‘‘ఊ అంటావా..’ పాట ఫస్ట్ షాట్ తీసేటప్పుడు భయంగా అనిపించింది. నా కాళ్లు వణికాయి. నేను అంత అందంగా ఉండనని, కొందరు అమ్మాయిల్లా బాగుండననీ అనుకుంటుంటాను. దాంతో నాకు ‘ఊ అంటావా..’ పాట సవాల్‌లా అనిపించింది. అయితే సెక్సీగా కనిపించడం అనేది నా ఆలోచన కాదు కాబట్టి ఆ పాట చిత్రీకరణ అప్పుడు వణికిపోయాను. కానీ ఓ వ్యక్తిగా, నటిగా నాకు అసౌకర్యంగా అనిపించినవి, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కోవడం నుంచే నేను ఎదిగాను. ‘ఊ అంటావా..’ పాట నాకు సౌకర్యం కాదనిపించినా కొత్తగా ఏదైనా చేయాలని చేశాను. నిజానికి ఆ పాట లిరిక్స్ నాకు సవాల్‌గా అనిపించాయి. అమ్మాయిలంటే అందం మాత్రమే కాదనేలా ఆ పాట ఉంటుంది. అది నచ్చి చేశాను’’ అన్నారు. ఇకపై ఇలాంటి పాటలు చేస్తారా? అనే ప్రశ్నకు ‘‘లేదు.. ఎందుకంటే ఇలాంటి సవాళ్లను స్వీకరించాలనుకోవడంలేదు’’ అన్నారు సమంత. ఇక ప్రత్యేక పాటలకు సమంత ‘ఊహూ’ అంటారని స్పష్టమైపోయింది.


● కరీనా కపూర్

మగధీర మళ్లీ వస్తున్నాడు

మెగా అభిమానులకు శుభవార్త. రామ్‌చరణ్ హీరోగా నటించిన ‘మగధీర’ సినిమా మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నెల 27న చరణ్ బర్త్‌డే సందర్భంగా ‘మగధీర’ చిత్రాన్ని 26న రీ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించారు. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ నిర్మించిన ‘మగధీర’ 2009 జూలై 30న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 14 ఏళ్ల తర్వాత ఈ చిత్రాన్ని శ్రీ విజయలక్ష్మి ట్రేడర్స్ అధినేత యర్రంశెట్టి రామారావు, అరిగెల కిశోర్‌బాబు రీ రిలీజ్ చేస్తున్నారు. ‘‘మగధీర’ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నాం. తెలుగు ప్రేక్షకులు, మెగా అభిమానులు ఈ చిత్రాన్ని ఆదరించి మరోసారి ఘన విజయాన్ని అందించాలి’’ అన్నారు యర్రంశెట్టి రామారావు, అరిగెల కిశోర్ బాబు.

ఈ రోజుల్లోనూ... ఈ నెల రీ రిలీజ్ అవుతున్న చిత్రాల్లో శ్రీ, రేష్మ జంటగా మారుతి దర్శకత్వం వహించిన ‘ఈ రోజుల్లో’ కూడా ఉంది. గుడ్ సినిమా గ్రూప్ బ్యానర్‌పై యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా 2012 మార్చి 23న విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని 12 ఏళ్ల తర్వాత మళ్లీ విడుదల చేస్తున్నారు మేకర్స్. ఈ నెల 23న ‘ఈ రోజుల్లో’ విడుదల కానుంది.

మరోసారి ప్రేమికుడు


● ప్రభుదేవా, నగ్మా

ప్రేమికుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ప్రభుదేవా, నగ్మా జంటగా శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం ‘ప్రేమికుడు’. కేటీ కుంజుమోన్ నిర్మించిన ఈ చిత్రం 1994 సెప్టెంబర్ 17న విడుదలై, సూపర్ హిట్టయింది. ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు రమణ, మురళీధర్. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌కి ముఖ్య అతిథులుగా తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్, ట్రెజరర్ రామ సత్యనారాయణ, దర్శకులు ముప్పలనేని శివ, శివనాగు నర్రా, నిర్మాత శోభారాణి హాజరై, మాట్లాడుతూ– ‘‘రీ రిలీజ్‌లోనూ ‘ప్రేమికుడు’ సినిమా మంచి సక్సెస్ కావాలి’’ అన్నారు. ‘‘30 ఏళ్ల క్రితం సంచలన విజయం సాధించిన ‘ప్రేమికుడు’ని మళ్లీ రిలీజ్ చేయడం చాలా హ్యాపీగా ఉంది’’ అన్నారు నిర్మాతలు రమణ, మురళీధర్.

రాజకీయాల నేపథ్యంలో...


● కోమల్ కుమార్, శ్రీశాంత్

భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ విలన్‌గా, కోమల్ కుమార్, రిషికా శర్మ జంటగా నటించిన చిత్రం ‘యమధీర’. శంకర్ ఆర్ దర్శకత్వంలో వేదాల శ్రీనివాస్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ వేడుకకి తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్, ట్రెజరర్ రామ సత్యనారాయణ, నిర్మాతలు డీఎస్ రావు, పి. శ్రీనివాసరావు అతిథులుగా విచ్చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ‘‘రాజకీయాల నేపథ్యంలో రూపొందిన చిత్రం ‘యమధీర’. ఈవీఎం ట్యాంపరింగ్‌పై ఈ చిత్రకథ సాగుతుంది’’ అన్నారు వేదాల శ్రీనివాస్ రావు.

సౌత్‌కి సై

ఉత్తరాది హీరోయిన్లు శిల్పా శెట్టి, ప్రీతీ జింతా, రవీనా టాండన్, కత్రినా కైఫ్ వంటివారు గతంలో సౌత్‌లో సినిమాలు చేశారు. ఆ తర్వాత కంగనా రనౌత్, ఈ రెండు మూడేళ్లల్లో శ్రద్ధా కపూర్, అలియా భట్ వంటి వారు దక్షిణాదిలో.. మరీ ముఖ్యంగా తెలుగు చిత్రాల్లో నటించారు. తాజాగా ప్రభాస్ ‘కల్కి 2898 ఏడీ’తో దీపికా పదుకోన్, ఎన్టీఆర్ ‘దేవర’తో జాన్వీ కపూర్ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. ఇక మరో బాలీవుడ్ ప్రముఖ తార కరీనా కపూర్ సౌత్ సినిమాకి సై అన్నారని తెలుస్తోంది. ‘కేజీఎఫ్’ ఫేమ్ యశ్ హీరోగా రూపొందుతున్న కన్నడ చిత్రం ‘టాక్సిక్’లో కరీనా ఓ కీలక పాత్ర చేయనున్నారట. ఇటీవల ఓ టీవీ షోలో పాల్గొన్న కరీనా.. యశ్‌తో నటించాలనుంది అన్నారు. అలాగే సోషల్ మీడియా ద్వారా ఫ్యాన్స్‌తో ‘‘దక్షిణాదిలోని ఓ స్టార్ హీరో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రంలో నటించనున్నాను. సౌత్‌లో నాకిది ఫస్ట్ మూవీ. షూటింగ్‌లో పాల్గొనే టైమ్ కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా’’ అని కరీనా చెప్పారు. దాంతో ‘టాక్సిక్’ చిత్రాన్ని ఉద్దేశించే ఆమె ఈ విధంగా పేర్కొన్నారనే ఊహాగానాలు ఉన్నాయి.

కాంబినేషన్ కాదు.. కథే ముఖ్యం


● రాజేశ్ దండా

‘‘మా హాస్య మూవీస్‌లో ‘ఇట్లు మారేడుమిల్లి, ఊరిపేరు భైరవకోన, సామజవరగమన’ చిత్రాలతో హ్యాట్రిక్ సక్సెస్ అందుకున్నాను. ‘అల్లరి’ నరేశ్, సందీప్ కిషన్, శ్రీవిష్ణు, కిరణ్ అబ్బవరం వంటి హీరోలతో సినిమాలు చేస్తున్నాను. నాకు కాంబినేషన్ కాదు.. కథే ముఖ్యం. వైవిధ్యమైన కథలతో సినిమాలు తీస్తుండటంతో ప్రేక్షకులు కూడా ఆదరిస్తున్నారు’’ అన్నారు నిర్మాత రాజేశ్ దండా. సోమవారం రాజేశ్ దండా విలేకరులతో మాట్లాడుతూ– ‘‘స్వామి రారా’ చిత్రంతో పంపిణీదారునిగా నా ప్రయాణం మొదలుపెట్టి దాదాపు 82 సినిమాలు రిలీజ్ చేశాను. అనిల్ సుంకర గారితో కలిసి ‘సామజవరగమన, ఊరిపేరు భైరవకోన’ వంటి చిత్రాలు నిర్మించా. ప్రస్తుతం ‘అల్లరి’ నరేశ్‌తో తీస్తున్న ‘బచ్చలమల్లి’ 50 శాతం పూర్తయింది. అలాగే సందీప్ కిషన్ హీరోగా త్రినాథరావు దర్శకత్వంలో సినిమా చేస్తున్నా. కిరణ్ అబ్బవరం హీరోగా ఓ సినిమా ఉంది. చిరంజీవిగారి కోసం ప్రసన్నకుమార్ బెజవాడ రెడీ చేసిన కథతోనే సందీప్ కిషన్ మూవీ తీస్తున్నాం అనడంలో వాస్తవం లేదు. ఇక ఓ స్టార్ హీరోతో ఓ పాన్ ఇండియా మూవీ చేయబోతున్నా. అది ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్’’ అన్నారు.

చప్పట్లతో ప్రశంసలు


● శోభిత

పట్టుమని పదే సినిమాల్లో నటించిన ఒక ఆర్టిస్ట్‌కి హాలీవుడ్ చాన్స్ వస్తే... పట్టరానంత ఆనందం కలుగుతుంది. హాలీవుడ్ చిత్రం ‘మంకీ మేన్’కి అవకాశం వచ్చినప్పుడు తెలుగు అమ్మాయి శోభితా ధూళిపాళకు అలాంటి ఆనందమే దక్కింది. పైగా ఈ చిత్రానికి ‘స్లమ్ డాగ్ మిలియనీర్’ ఫేమ్ నటుడు దేవ్ పటేల్ డైరెక్టర్ కావడం, హనుమంతుని పురాణం స్ఫూర్తిగా రూపొందడంతో మంచి అవకాశంగా భావిస్తున్నారు శోభిత. ఇటీవల యూఎస్‌లోని ఆస్టిన్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక ‘ఎస్ఎక్స్‌డబ్ల్యు’ (సౌత్ బై సౌత్‌వెస్ట్)లో ఈ చిత్రం ప్రదర్శితమైంది. ఈ ప్రీమియర్‌కి హాజరైన శోభితా ధూళిపాళ మాట్లాడుతూ – ‘‘ఈ వరల్డ్ ప్రీమియర్‌లో మా సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు అరుపులు, చప్పట్లతో నినాదాలు చేశారు. స్టాండింగ్ ఒవేషన్‌తోనూ ప్రశంసించారు. దేవ్ పటేల్‌కి డైరెక్టర్‌గా ఇది ఫస్ట్ మూవీ. హాలీవుడ్‌లో నాకు ఇది ఫస్ట్ మూవీ. ఈ చిత్రంలో నాది పెద్ద భాగం కానప్పటికీ, వేరే భాషలో నటించడం, అది కూడా దేవ్ పటేల్ విజన్‌లో నేను భాగం కావడం చాలా హ్యాపీగా ఉంది’’ అన్నారు. ఇక పలువురు హాలీవుడ్ తారలతో పాటు విపిన్ శర్మ, అశ్వినీ కల్సేఖర్, మకరంద్ దేశ్‌పాండే వంటి భారతీయ తారలు నటించిన ‘మంకీ మేన్’ ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
19-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	105	72,748
నిఫ్టీ ▲	32	22,056

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	16,150	▲	176
డోజోన్స్	38,870	▲	156
ఎఫ్‌టీఎస్‌ఈ 100	77,23	▽	5
డాక్స్	17,933	▽	4
షాంఘై	3,085	▲	30
నికాయ్	39,740	▲	1,033

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	65,612
బంగారం (99.5 స్వచ్ఛత)	65,350
వెండి (కేజీ)	74,156

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	103.88	108.12
€	యూరో	భారతీయ	88.12	91.990
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	47.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	భారతీయ	60.13	64.88
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.65	23.43
¥	చైనా యువాన్	భారతీయ	10.28	12.29

4 నెలల మనవడికి రూ.240 కోట్ల బహుమతి

ఇన్ఫీ నారాయణ మూర్తి కానుక



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి తన నాలుగు నెలల మనవడు ఏకగ్రాహ్ రోహన్ మూర్తికి ఖరీదైన బహుమతిని ప్రదానం చేశారు. ఇన్ఫోసిస్‌కు చెందిన 15 లక్షల షేర్లను ఇచ్చారు. ప్రస్తుత మార్కెట్ ధర (రూ. 1,602) ప్రకారం వీటి విలువ రూ. 240 కోట్లుగా ఇన్ఫోసిస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. కంపెనీలో తనకు గల ఈక్విటీలో 0.04 శాతం వాటాను కుమారుడు రోహన్ పుత్రుడు ఏకగ్రాహ్‌కు నారాయణ మూర్తి రిజిస్టర్ చేశారు. దీంతో ఏకగ్రాహ్ రోహన్ ఇన్ఫోసిస్‌లో బుల్లి బిలియనీర్ వాటాదారుడయ్యారు. నారాయణ మూర్తి కుమార్తె అక్షత, అల్లుడు రిషీ (బ్రిటన్ ప్రధాని)కి ఇద్దరు కుమార్తెలుకాగా.. ఏకగ్రాహ్ మనవడు.

వృద్ధిజోరుకు సహకరించండి

ఏడీబీకి ఆర్థికమంత్రి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెట్ సొల్యూషన్స్) భార్గవ్ దాస్‌గుప్తా సమావేశమయ్యారు. భారత్ తదుపరి పురోగతిలో ఏడీబీ భాగస్వామ్యం కావడానికి సంబంధించిన అంశాలపై వీరు చర్చించినట్లు ఎక్స్‌లో చేసిన ఒక పోస్ట్‌లో ఆర్థికమంత్రిత్వశాఖ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-3-2024	
విశాఖ	430-00
చిత్తూరు	478-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	423-00
విజయవాడ	423-00
18-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00

భారత్ స్టార్టప్‌ల దూకుడు

ఈ ఏడాది 12 బిలియన్ డాలర్ల సమీకరణ • పీక్ ఫిఫ్టీన్ ఎండీ రాజన్ ఆనందన్

న్యూఢిల్లీ: దేశీ అంకుర సంస్థలు జోరు మీదున్నాయి. స్టార్టప్‌లు ఈ ఏడాది దాదాపు 8–12 బిలియన్ డాలర్ల వరకు నిధులు సమీకరించే అవకాశం ఉందని వెంచర్ క్యాపిటల్ సంస్థ పీక్ ఫిఫ్టీన్ ఎండీ రాజన్ ఆనందన్ తెలిపారు. దాదాపు 20 బిలియన్ డాలర్ల మేర ఇన్వెస్ట్ చేయతగిన ప్రైవేట్ నిధులు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ సంస్థలు.. స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు మదుపుదారులు ఆసక్తిగా ఉన్నారని స్టార్టప్ మహాకుంభ్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 2021, 2022లో భారతీయ స్టార్టప్‌లలో ఏటా 8–10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని ఆనందన్ చెప్పారు.

దీంతో ఆ రెండు సంవత్సరాల్లో అంకుర సంస్థల్లోకి వచ్చిన పెట్టుబడులు 60 బిలియన్ డాలర్లకు చేరాయన్నారు. 'గతేడాది 7 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఈ మొత్తం తక్కువని చాలా మంది అంటున్నారు. కానీ, నిజం చెప్పాలంటే ఆరేళ్లకు సరిపడా పెట్టుబడులు రెండేళ్లలోనే వచ్చేసిన నేపథ్యంలో గతేడాది అసలు పెట్టుబడుల పరిమాణం శూన్యంగా ఉండేది. ఈ ఏడాది మనం 8–10 లేదా 12 బిలియన్ డాలర్ల వరకు సమీకరించే దిశగా ముందుకు వెడుతున్నాం. రాబోయే రోజుల్లో 10–12 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాబట్టే స్థాయికి స్టార్టప్ వ్యవస్థ చేరుకోగలదు' అని ఆనందన్ తెలిపారు. దేశీ స్టార్టప్ వ్యవస్థను పటిష్టంగా నిర్మించుకోవడానికి ఏటా 10 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 80,000 కోట్లు) సరిపోతాయని చెప్పారు. ప్రస్తుతం భారత్‌లో 20 స్టార్టప్‌లు లిస్ట్ అయ్యాయని, వచ్చే 7–8 ఏళ్లలో 100 అంకుర సంస్థలు లిస్టింగ్‌కి వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



డీప్‌టెక్ స్టార్టప్స్ కోసం పాలసీ..

డీప్‌టెక్ స్టార్టప్స్ కోసం ప్రత్యేక పాలసీని త్వరలోనే ప్రకటించనున్నట్లు పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. అంకుర సంస్థలకు నిధులే కాకుండా ప్రభుత్వం నుంచి కూడా ఆర్డర్లు దక్కాల్సిన అవసరం ఉందని, గవర్నమెంట్ ఈ–మార్కెట్ ప్లేస్‌తో ఈ అవకాశం లభిస్తోందని సింగ్ వివరించారు. స్టార్టప్స్ నుంచి జీఈఎం ద్వారా ఇప్పటివరకు దాదాపు రూ. 22,000 కోట్ల విలువ చేసే కొనుగోళ్లు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

బీమాలో ఎఫ్‌డీఐల జోరు

న్యూఢిల్లీ: బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐలు) జోరు కొనసాగుతున్నట్లు ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ వివేక్ జోషి పేర్కొన్నారు. గత 9 ఏళ్లలో దాదాపు రూ. 54,000 కోట్ల ఎఫ్‌డీఐలు తరలి వచ్చినట్లు వెల్లడించారు. నిబంధనలను ప్రభుత్వం మరింత సరళీకరించడం సానుకూల ప్రభావం చూపుతున్నట్లు తెలిపారు. 2014లో బీమా రంగంలో తొలుత 26% ఎఫ్‌డీఐలకు కేంద్రం అనుమతినిచ్చింది. 2019 నాటికి దీనిని క్రమంగా 100 శాతానికి పెంచడం ఈ రంగానికి కలిసి వచ్చిన అంశమని మంత్రి వివరించారు.

ఫెడ్ నిర్ణయాలకు ఎదురుచూపు

స్వల్ప లాభాలతో ముగింపు

ముంబై: అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో దేశీయ స్టాక్ సూచీలు సోమవారం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. అయితే రిలయన్స్ (1.45%)తో పాటు మెటల్, ఇంధన, ఆటో షేర్లూ రాణించడంతో స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్‌లో 672 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 105 పాయింట్ల లాభంతో 72,748 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207 పాయింట్ల రేంజ్‌లో 22,124 వద్ద గరిష్టాన్ని, 21,917 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 32 పాయింట్లు పెరిగి 22,056 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రారంభంలోనే నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ తర్వాత ఇటీవల దిగివచ్చిన నాణ్యమైన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో మళ్లీ లాభాల్లోకి మళ్లాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ,, ప్రైవేటు బ్యాంకులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇక బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ స్వల్పంగా 0.4% లాభపడగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.7% నష్టపోయింది.



టీసీఎస్‌లో టాటా సన్స్ వాటాల విక్రయం..

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో ప్రమోటరు సంస్థ టాటా సన్స్ స్వల్ప వాటాలను విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. షేరు ఒక్కింటికి రూ. 4,0001 చొప్పున మంగళవారం సుమారు 2.3 కోట్ల షేర్లను (దాదాపు 0.64 శాతం వాటా) బ్లాక్ డీల్స్ ద్వారా టాటా సన్స్ విక్రయించనున్నట్లు వార్తలు వచ్చాయి. దీని ప్రకారం మొత్తం డీల్ విలువ సుమారు రూ. 9,202 కోట్లుగా ఉండనుంది. మార్కెట్ కన్నా తక్కువ రేటుకి షేర్లను విక్రయించనున్న వార్తలతో సోమవారం (మార్చి 18న) టీసీఎస్ షేరు 2 శాతం క్షీణించి రూ. 4,145 వద్ద క్లోజయ్యింది. దీనితో పోలిస్తే ఆఫర్ ధర 3.45 శాతం తక్కువగా ఉండనుంది.

ఐడీబీఐపై ఫెయిర్‌ఫాక్స్ కన్ను



ముంబై: పీఎస్‌యూ.. ఐడీబీఐ బ్యాంక్ కొనుగోలుకి కెనడియన్ పీఈ దిగ్గజం ఫెయిర్‌ఫ్యాక్స్ ఇండియా హోల్డింగ్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం నగదు రూపేణా చెల్లించేందుకు డీల్ కుదుర్చుకోవడం ద్వారా బ్యాంకును సొంతం చేసుకునేందుకు ఫెయిర్‌ఫాక్స్ అధినేత బిలియనీర్ ప్రేమ్ వత్సా ఆసక్తి చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ వివరాల ప్రకారం కొనుగోలు తదుపరి సైతం బ్యాంక్ గుర్తింపును కొనసాగించేందుకు అంగీకారాన్ని తెలపనుంది. రెండు వారాల క్రితమే ఆర్థిక శాఖకు ఫెయిర్‌ఫాక్స్ తాజా ప్రతిపాదనలు చేరాయి. నిజానికి షేర్ల మార్పిడి ద్వారా బ్యాంకు కొనుగోలు ఒప్పందానికి పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నప్పటికీ ప్రభుత్వం ఇందుకు సన్నద్ధంగా లేదు. దీంతో నగదు చెల్లింపును ఫెయిర్‌ఫాక్స్ తెరపైకి తీసుకువచ్చింది. కెనడా, భారత్‌ల మధ్య రాజకీయ విభేదాలు తలెత్తిన నేపథ్యంలో ఈ డీల్‌కు ప్రాధాన్యత ఏర్పడినట్లు బ్యాంకింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

- నగదు రూపేణా కొనుగోలుకి రెడీ
- తదుపరి బ్యాంక్ పేరుతోనే సేవలు
- ఆర్థిక శాఖతో సంప్రదింపులు షురూ



సీఎస్‌బీ విలీనం

దేశీయంగా సీఎస్‌బీ బ్యాంక్‌కు ఫెయిర్‌ఫాక్స్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తోంది. ఫలితంగా ఐడీబీఐను సొంతం చేసుకుంటే సీఎస్‌బీ ప్రమోటర్‌గా కొనసాగేందుకు వీలుండదు. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం ఒక ఇన్వెస్టర్ రెండు బ్యాంకులకు ప్రమోటర్‌గా వ్యవహరించేందుకు అనుమతి లభించదు. వెరసి ఐడీబీఐలో సీఎస్‌బీ బ్యాంకును విలీనం చేయవలసి ఉంటుంది. ఐడీబీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 90,440 కోట్లుకాగా.. సీఎస్‌బీ విలువ రూ. 6,000 కోట్లు మాత్రమే. కొంతకాలం ఐడీబీఐను విడిగా కొనసాగించాక తదుపరి దశలో సీఎస్‌బీ బ్యాంకులో విలీనం చేసేందుకు గతంలో ఫెయిర్‌ఫాక్స్ ప్రతిపాదించింది. అయితే విస్తారిత కార్యకలాపాలు కలిగిన ఐడీబీఐ బ్యాంక్ గుర్తింపు రద్దుకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో ప్రతిపాదనలను తాజాగా సవరించింది. ఐడీబీఐ బ్యాంకులో సీఎస్‌బీ విలీనానికి ప్రతిపాదించడం ద్వారా ప్రభుత్వం, ఆర్‌బీఐ నుంచి సమ్మతిని పొందే ప్రయత్నాల్లో ఉంది. వాటా విక్రయానికి ప్రభుత్వం తెరతీశాక ఐడీబీఐ బ్యాంక్ షేరు రూ. 60 నుంచి రూ. 84 వరకూ బలపడింది. ఈ నేపథ్యంలో ఐడీబీఐపై కన్నేసిన కొటక్ మహీంద్రా బ్యాంక్.. సవరించిన ఆఫర్ ద్వారా ఫెయిర్‌ఫాక్స్‌కు చెక్ పెడుతుందా లేదా అనేది వేచిచూడవలసి ఉన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

మహిళా ఫుట్‌వేర్ విభాగంలోకి 'లీ కూపర్'

ముంబై: ప్రముఖ డెనిమ్ బ్రాండెడ్ సంస్థ 'లీ కూపర్' మహిళా ఫుట్‌వేర్ విభాగంలోకి అడుగుపెట్టింది. ప్రత్యేకంగా మహిళల కోసం 'షూస్ డోంట్ జడ్జ్ ట్యాగ్‌లైన్'తో స్ప్రింగ్ సమ్మర్'24 పాదరక్షలు విడుదల చేసింది. రిలయన్స్ రిటైల్ ఆధ్వర్యంలో జరిగిన 'నో షూ పార్టీ' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో బాలీవుడ్ నటి సన్య మల్హోత్రా కొత్త కలెక్షన్లను ఆవిష్కరించారు. 'నాణ్యమైన మెటీరియల్‌తో తయారు చేసిన ఎస్ఎస్'24 కలెక్షన్లు అద్భుతమైన స్టైల్, అత్యంత సౌకర్యంగా ఉన్నాయి' అని సన్య తెలిపింది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-ఈపీఎఫ్‌వోలో 323 పర్సనల్ అసిస్టెంట్ పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో పర్సనల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 323
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు స్టెనోగ్రఫీ(ఇంగ్లిష్ లేదా హిందీ) నైపుణ్యం కలిగి ఉండాలి.
» **వయసు:** కనిష్టంగా 18 ఏళ్లు ఉండాలి. గరిష్టంగా యూఆర్/ఈడబ్ల్యూఎస్‌లకు 30 ఏళ్లు, ఓబీసీలకు 33 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 35 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 40 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.03.2024.
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ 327 పోస్టులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్).. ఎగ్జిక్యూటివ్/నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 327

పోస్టుల వివరాలు

» **ఎగ్జిక్యూటివ్ కేడర్:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఈ–ఎం), ఈ2 గ్రేడ్–42, మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సిస్టమ్స్), ఈ2 గ్రేడ్–07.
» **నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్:** జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీ(జేఎంఈటీ), టీ–ఎస్ గ్రేడ్ సీ–100, అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ ట్రెయినీ(మెకానికల్)టీ–ఎస్ గ్రేడ్ సీ–09, అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ ట్రెయినీ(ఎలక్ట్రికల్)టీ–ఎస్ గ్రేడ్ సీ–24, ఫిట్టర్ ట్రెయినీ, క్యాట్ 1–47, ఎలక్ట్రీషియన్ ట్రెయినీ, క్యాట్ 1–98.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** గరిష్ట వయో పరిమితి 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.05.2024
» **వెబ్‌సైట్:** www.scclmines.com

టీఎస్ పీజీఈసెట్-2024

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టీఎస్‌సీహెచ్‌ఈ తెలంగాణ స్టేట్ పోస్టు–గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ పీజీఈసెట్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను జేఎన్‌టీయూ–హైదరాబాద్ నిర్వహించనుంది.

» **కోర్సులు:** ఫుల్ టైమ్ ఎంఈ/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎం.ఆర్క్/గ్రాడ్యుయేట్ లెవల్ ఫార్మా డి (పీబీ).
» **అర్హత:** కోర్సును అనుసరించి బీఈ, బీటెక్, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ).
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుకు చివరి తేది:** 10.05.2024.
» **పరీక్ష తేదీలు:** 06.06.2024 నుంచి 09.06.2024.
» **వెబ్‌సైట్:** https://pgecet.tsche.ac.in/PGECET_HomePage.aspx

ఎన్‌ఎల్‌సీలో 239 ఇండస్ట్రియల్ ట్రైనీ పోస్టులు

నైవేలి(తమిళనాడు)లోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎల్‌సీ).. ఇండస్ట్రియల్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 239
» **పోస్టుల వివరాలు:** ఇండస్ట్రియల్ ట్రైనీ/ఎస్ఎంఈ–టెక్నికల్(ఓ–ఎం)–100, ఇండస్ట్రియల్ ట్రైనీ (మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్)–139.
» **అర్హత:** పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** గరిష్ట వయో పరిమితి యూఆర్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 37ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులు 40 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 42 ఏళ్లకు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు ఇండస్ట్రియల్ ట్రైనీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓ–ఎం) అభ్యర్థులకు రూ.18,000 నుంచి రూ.22,000, ఇండస్ట్రియల్ ట్రైనీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్) అభ్యర్థులకు రూ.14,000 నుంచి రూ.18,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 20.03.2024
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 19.04.2024.
» **వెబ్‌సైట్:** www.nlcindia.in/new_website/index.htm

ఫ్యాషన్, డిజైనింగ్ @ ఎఫ్‌డీడీఐ

ఫ్యాషన్, డిజైనింగ్ రంగాల్లో అవకాశాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది.. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)! డిజైనింగ్, ఫ్యాషన్‌లకు సంబంధించి పలు కోర్సులను అందిస్తున్న ఎఫ్‌డీడీఐ.. వీటిలో ప్రవేశాలకు ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. తాజాగా 2024కు సంబంధించి ఎఫ్‌డీడీఐ ఏఐఎస్‌టీ నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఏఐఎస్‌టీ వివరాలు, ప్రవేశాలు కల్పించే కోర్సులు, క్యాంపస్‌లు, భవిష్యత్తు అవకాశాలు తదితర అంశాలపై విశ్లేషణ..



ఫ్యాషన్ డిజైనింగ్,ప్రొడక్షన్‌లో ప్రత్యేక నైపుణ్యాలు పొందేలా యువతను తీర్చిదిద్దే ఉద్దేశంతో.. కేంద్ర పర్యాటక శాఖ నేతృత్వంలో ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 12 ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లు ఉన్నాయి. అవి..నోయిడా, ఫర్సత్‌గంజ్, చెన్నై, కోల్‌కత, రోహ్‌తక్, జోధ్‌పూర్, ఛింద్వారా, గుణ, అంక్లేశ్వర్, పాట్నా, హైదరాబాద్, చండీగఢ్.

బ్యాచిలర్, పీజీ ప్రోగ్రామ్‌లు

- జాతీయ స్థాయిలో ఉన్న 12 క్యాంపస్‌ల ద్వారా ప్రస్తుతం నాలుగు బ్యాచిలర్ ప్రోగ్రామ్‌లు, 2 పీజీ ప్రోగ్రామ్‌లను ఎఫ్‌డీడీఐ అందిస్తోంది. అవి..
- **బ్యాచిలర్ ప్రోగ్రామ్‌లు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్–ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్; బ్యాచిలర్ ఆఫ్ డిజైన్–ఫ్యాషన్ డిజైన్; బ్యాచిలర్ ఆఫ్ డిజైన్–లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ ; బీబీఏ–రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్.
- **పీజీ ప్రోగ్రామ్‌లు:** ఎం.డిజైన్–ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్; ఎంబీఏ–రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్.
- బ్యాచిలర్ ప్రోగ్రామ్స్‌లో మొత్తం 1880, పీజీ ప్రోగ్రామ్స్‌లో 480 సీట్లు చొప్పున మొత్తం 2,360 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

కోర్సులు-అర్హతలు

- **బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులు:** ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
- **మాస్టర్ ఆఫ్ డిజైన్ (ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్):** ఫుట్‌వేర్/లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైన్/ఫ్యాషన్/ఇంజనీరింగ్/ఫైన్ ఆర్ట్స్/ఆర్కిటెక్చర్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉతీర్ణులు అర్హులు.
- **మాస్టర్ ఆఫ్ డిజైన్ (ఫ్యాషన్ డిజైన్):** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చెండైజ్):** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

» ఎఫ్‌డీడీఐ ఏఐఎస్‌టీ-2024 నోటిఫికేషన్ విడుదల
» ఎఫ్‌డీడీఐలో డిజైన్, ఫ్యాషన్ విభాగాల్లో కోర్సులు
» బ్యాచిలర్, పీజీ స్థాయిలో ప్రోగ్రామ్‌లు

ఏఐఎస్‌టీ ర్యాంక్‌తో ప్రవేశాలు

ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌ల్లో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి.. ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ) నిర్వహిస్తారు. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. పరీక్ష విధానం యూజీ, పీజీ కోర్సులకు వేర్వేరుగా ఉంటుంది.

ఏఐఎస్‌టీ (బ్యాచిలర్ ఆఫ్ డిజైన్/బీబీఏ) ఇలా

బ్యాచిలర్ ప్రోగ్రామ్‌లకు నిర్వహించే పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. సెక్షన్–ఎలో అనలిటికల్ ఎబిలిటీ 25 ప్రశ్నలు–25 మార్కులకు; సెక్షన్–బిలో బిజినెస్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, డిజైన్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు; సెక్షన్–సి జనరల్ అవేర్‌నెస్ 35 ప్రశ్నలు–35 మార్కులకు; సెక్షన్–డిలో కాంప్రహెన్షన్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, గ్రామర్, యూసేజ్ 15 ప్రశ్నలు–15 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

పీజీ ప్రోగ్రామ్‌లకు

పీజీ స్థాయిలో మాస్టర్ ఆఫ్ డిజైన్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లకు నిర్వహించే పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. సెక్షన్ ఏలో అనలిటికల్ ఎబిలిటీ 25 ప్రశ్నలు–50 మార్కులకు; సెక్షన్–బిలో ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ గ్రామర్ 50 ప్రశ్నలు–50 మార్కులకు;సెక్షన్–సిలో జీకే అండ్ కరెంట్ అఫైర్ 50 ప్రశ్నలు–50 మార్కులకు; సెక్షన్–డిలో మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ టెస్ట్, డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 50 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. రెండు స్థాయిలకు పరీక్ష పెన్ పేపర్ విధానంలో జరుగుతుంది.

రాత పరీక్షలో రాణించేలా

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో మంచి మార్కులకు అర్థమెటిక్–రేషియో, మిక్చర్స్, టైమ్ అండ్ వర్క్, యావరేజ్, పర్సంటేజెస్, టైమ్ అండ్ స్పీడ్, ప్రాఫిట్ అండ్ లాస్, ఇంటరెస్ట్, బేసిక్ స్టాటిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా నెంబర్ ప్రాపర్టీస్, ప్రాబబిలిటీ, కౌంటింగ్ ప్రిన్సిపల్స్, జామెట్రీ, డెరివేటివ్స్(మ్యాగ్జిమా–మినిమా) వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

వెర్బల్ ఎబిలిటీ

ఇంగ్లిష్ గ్రామర్‌తోపాటు, లాజికల్ రీజనింగ్ అంశాలు, సీటింగ్ అరేంజ్‌మెంట్, సీక్వెన్సెస్, బ్లడ్ రిలేషన్స్, కోడింగ్, డీ–కోడింగ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

కరెంట్ అఫైర్స్‌తోపాటు, హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ముఖ్య ఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు సంబంధించి ఏదైనా ఒక ఆకృతిని రూపొందించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. బిజినెస్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి ఫ్యాషన్ రంగంలో తాజా పరిణామాలు, ఇండస్ట్రీ పరిణామం, వృద్ధి అంచనాలు తదితర అంశాలపై దృష్టి సారించాలి.

ఆకర్షణీయ వేతనాలు

ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌ల నుంచి బ్యాచిలర్, పీజీ పూర్తి చేసుకున్న వారికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ద్వారా రూ.లక్షల వేతనంతో కొలువులు ఖరారవుతున్నాయి. గత మూడేళ్ల క్యాంపస్ ప్లేస్‌మెంట్ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఎనభై శాతం పైగా విద్యార్థులకు ఆఫర్లు దక్కాయి. సగటు వేతనం రూ.8లక్షలుగా నమోదైంది. అడిడాస్ ఇండియా, ప్యూమా, ఆలైన్ అపారెల్స్, ఆదిత్య బిర్లా తదితర ప్రముఖ సంస్థలు ప్రముఖ రిక్రూటర్స్‌గా నిలుస్తున్నాయి.

లభించే ఉద్యోగాలు

ఎఫ్‌డీడీఐ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఫుట్‌వేర్ డిజైనర్, ప్రొడక్ట్ డెవలపర్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్, క్వాలిటీ కంట్రోలర్, ఫుట్‌వేర్ టెక్నాలజిస్ట్, మెర్కండైజర్, మార్కెటింగ్, ప్లానింగ్ ఎగ్జిక్యూటివ్, ట్రెండ్ అనలిస్ట్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజైన్ మ్యానుఫాక్చరింగ్ ఆపరేషన్స్, స్టోర్ మేనేజర్, ఫ్లోర్ మేనేజర్, ఏరియా మేనేజర్ వంటి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. బీబీఏ, ఎంబీఏ కోర్సులు చేసిన వారికి ప్రముఖ ఈ–కామర్స్, టెక్స్‌టైల్ రంగాల్లోని సంస్థల్లో నిర్వహణ విభాగాల్లో కొలువులు లభిస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 20
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** 2024, మే 6 నుంచి
- **ఏఐఎస్‌టీ పరీక్ష తేదీ:** 2024 మే 12
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.fddiindia.com/admissionprocess



రహదారే.. రన్‌వే

సాక్షి ప్రతినిధి, బాపట్ల/అద్దంకి/మేదరమెట్ల: నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే 16వ నంబర్ జాతీయ రహదారి.. సోమవారం ఉదయం బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో కొంతసేపు నిర్మానుష్యంగా మారింది. ఆ వెంటనే సరిగ్గా 11.03 గంటలకు నాలుగు యుద్ధ విమానాలు వరుసగా ఒకదాని వెంట ఒకటిగా దూసుకువచ్చాయి. స్థానికులు సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండగా.. రెండు యుద్ధ విమానాలు రహదారిని తాకగా.. మరో రెండు అతి సమీపంలో చక్కర్లు కొట్టి వెళ్లిపోయాయి. అంతే అక్కడ ఉన్న వైమానిక దళ అధికారులు, సిబ్బంది, పోలీసులు చప్పట్లతో తమ సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధ విమానాల అత్యవసర ల్యాండింగ్ కోసం చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి–16పై రేణింగివరం నుంచి మేదరమెట్లకు వెళ్లే దారిలో కొరిశపాడు సమీపంలోని పి.గుడిపాడు వద్ద 4.1 కిలోమీటర్ల పొడవున, 33 మీటర్ల వెడల్పుతో ల్యాండింగ్ స్ట్రిప్ నిర్మించారు. గతంలో ఒకసారి దీనిపై ట్రయల్ రన్ నిర్వహించారు. తాజాగా సోమవారం మరోసారి ఈ స్ట్రిప్‌పై బాపట్ల జిల్లా సూర్యలంక వైమానిక దళం ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు.

ఫేక్ యాప్‌లు.. నకిలీ వెబ్‌సైట్లు



సాక్షి, హైదరాబాద్: పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఊదరగొడ్తూ అమాయకులను మోసగిస్తున్న నకిలీ పెట్టుబడి యాప్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సెబీ హెచ్చరించింది. ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇస్తూ మోసగిస్తున్న కొన్ని ఫేక్ వెబ్‌సైట్‌లు, యాప్‌లను గుర్తించినట్టు వెల్లడించింది. వాట్సాప్ గ్రూప్‌లు, టెలిగ్రామ్ చానల్స్, యాప్‌లతో ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్టు పేర్కొంది. app.ind-ses.com/ home, https:// globalspsp. tpo/#/, https:// njtwqvtopku.com/#/, https://globalindia-a24.pages.dev/#/, https://wells&stocks.com#/లు ఫేక్ వెబ్‌సైట్‌లుగా నిర్ధారించినట్టు సెబీ పేర్కొంది. సదరు వెబ్‌సైట్‌లు ఇండియన్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట మోసాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. ట్రేడింగ్ పేరిట ప్రకటనల్లో వచ్చే మోసపూరిత వెబ్‌సైట్‌లు, యాప్‌ల సమాచారాన్ని shorturl. at/ fnMRZ లింక్‌పై క్లిక్ చేసి సెబీ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ భద్రత నిపుణులు సూచించారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ట్రేడింగ్ యాప్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ వెబ్‌సైట్‌ల పేరిట ఇచ్చే ప్రకటనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో లేదా https://cybercrime.gov.in వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.





కృష్ణాతీరంలో జెల్లీఫిష్‌ల సందడి

కృష్ణాజిల్లా, నాగాయలంక మండలంలోని సముద్రంలో ఆకర్షణీయమైన జెల్లీఫిష్‌ల సందడి ఆరంభమైంది. నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ సమీపంలో కృష్ణానదికి అవతలి వైపు పశ్చిమ దిక్కున లంక దిబ్బల నడుమ నది పాయలో (నాగాయలంక రేవులో) ఈ జెల్లీ ఫిష్‌లు అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి. పర్యాటకులకు కనుల విందు చేస్తున్నాయి. దీంతో పలువురు బోట్‌లో వెళ్లి మరీ వీటి అందాన్ని చూసి ఆస్వాదిస్తున్నారు. వేసవిలో సముద్ర జలాల్లోని ఉప్పు శాతం పెరగడం, సముద్ర జలాలు బ్యాక్ వాటర్‌గా ఇక్కడి కృష్ణానదిలో నిత్యం ఉప్పునీరు మాత్రమే ప్రవహించడంతో జెల్లీ ఫిష్‌లు అధిక సంఖ్యలో నదిలోకి తరలి వచ్చాయని ఔత్సాహిక కృష్ణానదీ కేజ్ కల్చరిస్ట్ తలశిల రఘుశేఖర్ చెప్పారు.

ముస్తాబాద్ బస్టాండ్ ప్రాంతంలో కూలిన చెట్లు, స్తంభం





నిజాంపేటలో వడగళ్ల వాన

ఈదురుగాలులు.. వడగళ్ల వాన బీభత్సం

- ముస్తాబాద్‌లో హోటల్‌పై కూలిన చెట్టు, విద్యుత్ స్తంభం
- అదే సమయంలో టీ తాగడానికెళ్లి.. రైతు దుర్మరణం

ముస్తాబాద్(సిరిసిల్ల)/చిన్నశంకరంపేట/నిజాంపేట: పలు జిల్లాల్లో సోమవారం వడగళ్ల వాన, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సాయంత్రం వేళ వడగళ్ల వానపడింది. ఒక్కసారిగా బలమైన ఈదురుగాలులు వీయడంతో ఓ హోటల్‌పై చెట్టు, విద్యుత్ స్తంభం విరిగిపడ్డాయి. అదే సమయంలో అక్కడికి టీ తాగడానికి వచ్చిన ముస్తాబాద్‌కు చెందిన రైతు ఎల్సాని ఎల్లయ్య (53).. వాటికింద పడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. హోటల్ నిర్వాహకుడు బాబుకు గాయాలయ్యాయి. కాగా, మృతుడు ఎల్లయ్యకు భార్య రేణుక, కుమారుడు చరణ్, కూతురు కవిత ఉన్నారు.

మెదక్ జిల్లాలోనూ బీభత్సం: మెదక్ జిల్లాలో వడగళ్ల వాన కురిసింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చిన్నశంకరంపేటలో నిలిపి ఉన్న డీసీఎంపై 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. నిజాంపేట నుంచి చల్మెడకు వెళ్లే రహదారిలో చెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నార్సింగి మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్ల వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది.

అలా పెంచి.. ఇలా కోసి!

ఆర్టీసీలో ఫిట్‌మెంట్ ఇచ్చినట్టే ఇచ్చి.. హెచ్ఆర్ఏలో కోత

వారం క్రితం:
ఆర్టీసీ ఉద్యోగులకు 2017 నాటి వేతన సవరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించింది. దీంతో కార్మికులకు సగటున రూ.12 వేల వరకు వేతనం పెరుగుతుందని ఆనందపడ్డారు.

ఇప్పుడు:
వేతన సవరణ ఎలా చేయాలో ఆర్టీసీ మార్గదర్శకాలు జారీ చేసింది. అందులో ఓ పేరా కార్మికులను షాక్‌కు గురిచేసింది. వేతన సవరణతోపాటు ఇంటి అద్దెభత్యం కూడా సవరించనున్నట్టు అందులో ఉంది. దాని ప్రకారం హైదరాబాద్‌లో ఉండే కార్మికుల వేతనంలో దాదాపు రూ.6 వేల వరకు కోత పడే అవకాశాలున్నాయి. వేతన సవరణ అమలులోకి వస్తే కనీసం రూ.15 వేల వరకు జీతం పెరుగుతుందని ఆశపడిన సగటు కార్మికుడికి ఇప్పుడు నిరాశే మిగిలింది.

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల్లో ఆనందం ఆవిరైంది. వేతన సవరణతో జీతాలు పెరుగుతాయని సంబరపడినా, హెచ్ఆర్ఏ కూడా సవరించడంతో వేతనాల్లో భారీగా కోత పడనుంది. ఫిట్‌మెంట్ ఇచ్చినట్టే ఇచ్చి...హెచ్ఆర్ఏలో కోత పెట్టారంటూ ఆర్టీసీ కార్మికులు గగ్గోలు పెడుతున్నారు.



ఇదీ సంగతి..

ఆర్టీసీలో రెండు వేతన సవరణలు పెండింగ్‌లో ఉన్నాయి. 2013 నాటి వేతన సవరణ 2015లో జరిగి అమలులోకి వచ్చింది. నాలుగేళ్లకోమారు వేతనాలు సవరించాల్సి ఉన్నందున.. 2017లో, తర్వాత 2021లో జరగాల్సి ఉంది. ఆ రెండు పెండింగ్‌లో ఉన్నాయి. ఎట్టకేలకు 2017 వేతన సవరణ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి వారం క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. 21 శాతం ఫిట్‌మెంట్ ప్రభుత్వం ఖరారు చేసింది. దానిని జూన్ ఒకటిన చెల్లించే మే వేతనంతో అమలులోకి తెస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఏడేళ్ల విరామం తర్వాత వేతన సవరణ జరుగుతుండటంతో ఆర్టీసీలో సంబరాలు మిన్నంటాయి. కానీ, తాజాగా వేతన సవరణతోపాటు ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) కూడా సవరిస్తున్నట్టు ఆర్టీసీ జారీ చేసిన సర్క్యులర్ స్పష్టం చేసింది. పలురకాల సూచీల ఆధారంగా ఇంటి అద్దెభత్యం ప్రభుత్వం ఖరారు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈమేరకు పేస్కేల్‌తోపాటు హెచ్ఆర్ఏను మూడేళ్ల క్రితం ప్రభుత్వం సవరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆయా ప్రాంతాల హెచ్ఆర్ఏను సవరించింది. ఆర్టీసీ ఉద్యోగులకు కూడా అంతమేరకు సవరించాలని ఆదేశించింది. ఆర్టీసీతో వేతన సవరణ జరగనందున ఇంతకాలం పాత హెచ్ఆర్ఏనే కొనసాగుతోంది. తాజాగా వేతన సవరణ జరుగుతుండటంతో దాన్ని కూడా రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులతో సమంగా సవరించాలని నిర్ణయించింది. సవరించని పక్షంలో, ఎంత ఎక్కువ చెల్లిస్తూ పోతే అంతమేర కార్మికుల వేతనాల నుంచి రికవరీ చేయాల్సిన పరిస్థితి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2020లో సవరించినందున, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంత ఎక్కువ చెల్లిస్తూ వచ్చారో దాన్ని రికవరీ చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. ఇప్పటికీ కొత్త హెచ్ఆర్ఏ అమలు చేయకుంటే, చెల్లిస్తూపోయే మొత్తాన్ని కూడా తదుపరి రికవరీ చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. ఇది ఇప్పుడు ఆర్టీసీ కార్మికుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది.

ఇలా తగ్గింది..

- ఏ1 సిటీ హోదాలో ఉన్నందున జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం హెచ్ఆర్ఏ 30 శాతంగా ఉంది. దీనిని 24 శాతానికి తగ్గించారు.
- కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, గోదావరిఖని, వరంగల్‌లలో 20 శాతంగా ఉండగా, దానిని 17 శాతానికి సవరించారు.
- ఆదిలాబాద్, నిర్మల్, బోధన్, కామారెడ్డి, ఆర్మూరు, సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిద్దిపేట, జహీరాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, తాండూరు, వనపర్తి, గద్వాల, నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, జనగామ, కొత్తగూడెం, మంచిర్యాలల్లో 14.5 శాతం (15 వేలు గరిష్టం)ఉంది. దానిని 13 శాతానికి తగ్గించారు.
- మిగతా ప్రాంతాల్లో 12 శాతం (గరిష్టం 15 వేలు) ఉండగా, దానిని బేసిక్‌పేపై 11 శాతానికి సవరించారు.

భారీగా కోత

హెచ్ఆర్ఏ తగ్గటంతో వేతనాల్లో భారీగానే కోత పడనుంది. ఆర్టీసీ ఉద్యోగుల్లో దాదాపు సగం మంది జీహెచ్ఎంసీ పరిధిలోనే పనిచేస్తున్నారు. దీంతో ఇక్కడి ఉద్యోగుల్లోనే ఎక్కువ ప్రభావం ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలో ఏకంగా మూల వేతనంపై 6 శాతం కోత పడుతుంది. తక్కువ వేతనం అందుకునే డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామికులకు నెలవారీగా దాదాపు రూ.6 వేల వరకు తగ్గుతుందని అంచనా. ఇప్పుడు వేతన సవరణతో వేతనాలు 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకారం పెరగనున్నాయి. 2017 నాటి వేతన సవరణ అయినందున ఈ ఏడేళ్ల బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ, బకాయిలను రిటైర్‌మెంట్ సమయంలోనే చెల్లిస్తామని, అది కూడా వడ్డీ చెల్లించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది కూడా వారిపై ప్రభావం చూపబోతోంది. ఫిట్‌మెంట్ ఆశించిన స్థాయిలో రానందున, కనీసం బకాయిలను వడ్డీతో చెల్లించాలని కోరుతున్నారు. ఒకవేళ వడ్డీ చెల్లించని పక్షంలో, బకాయిలు ఇప్పటికిప్పుడు పీఎఫ్‌కు జమ చేయాలని, దీంతో పీఎఫ్ వడ్డీ అయినా వస్తుందని వారు పేర్కొంటున్నారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులతో సమంగా హెచ్ఆర్ఏ చెల్లించాలని నిర్ణయించినందున, ఫిట్‌మెంట్ కూడా వారితో సమంగా చెల్లించాలని కార్మిక సంఘాల నేతలు నాగేశ్వర రావు, మౌలానా, నరేందర్ తదితరులు పేర్కొంటున్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పాత హెచ్ఆర్ఏనే అమలయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

టీఎస్‌జీఎల్ఐలో వివరాలు

అప్‌డేట్ చేసుకోవాలి

- ఉద్యోగులకు టీఎస్‌జీఎల్ఐ డైరెక్టర్ శ్రీనివాస్ సూచన

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జీవన బీమా (టీఎస్‌జీఎల్ఐ) పాలసీదారులైన ప్రభుత్వ ఉద్యోగులు బీమా అర్హత వయసు 56 ఏళ్ల లోపు బీమా మొత్తాన్ని మినహాయించుకుని ఆమేరకు ప్రతిపాదన పత్రాలు సంబంధిత జిల్లా కార్యాలయాల్లో సమర్పించాలని టీఎస్‌జీఎల్ఐ బీమా సంచాలకుడు వి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు నెలవారీ ప్రీమియం చెల్లిస్తున్నప్పటికీ బాండ్ పొందడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. గత పీఆర్సీ స్లాబును అనుసరించి చందాను మినహాయించాల్సిన బాధ్యత తప్పనిసరిగా డీడీఓలదే అని చెప్పారు. పాలసీ పొందిన తర్వాత ఆ వివరాలను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లోని ఉద్యోగుల మాస్టర్ జాబితాలో అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. నెలవారీ చందాను మినహాయించినప్పటికీ ప్రతిపాదనలు సమర్పించనట్లయితే ఆ మొత్తం సస్పెన్షన్ ఖాతాలోకి వెళ్తుందని శ్రీనివాస్ తెలిపారు.

విధి 'పరీక్ష' పెట్టినా..

ఇంటి వద్ద తండ్రి మృతదేహం..
బాధను దిగమింగుకుని పరీక్ష రాసిన విద్యార్థులు



శ్రావణ్



స్రవంతి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల)/ కల్లూరు/ నస్రుల్లాబాద్(బాన్సువాడ): విధి వింత పరీక్ష పెట్టినా ధైర్యంగా ఎదుర్కొన్నారు ఆ విద్యార్థులు. ఇంట్లో తండ్రి మృతదేహం.. అంత్యక్రియలు నిర్వహించాల్సిన సమయం...అయినా పుట్టెడు దుఃఖంలోనూ బాధను పంటి బిగువున భరిస్తూ పదోతరగతి పరీక్ష రాశారు. రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, కామారెడ్డి జిల్లాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన పుట్టి రవి (45) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. పరిస్థితి విషమించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. అయితే రవి కుమారుడు శ్రావణ్ పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఓ వైపు కన్నతండ్రి మృతదేహం.. మరోవైపు పదోతరగతి పరీక్ష. అయినప్పటికీ పొంగుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుకొని శ్రావణ్ ఎల్లారెడ్డిపేట కేంద్రంలో పరీక్ష రాశాడు. పరీక్ష రాసి వచ్చిన తర్వాత తండ్రి అంత్యక్రియలు నిర్వహించాడు. మరో ఘటనలో ఖమ్మం జిల్లా కల్లూరు మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన మారబోయిన గోపాలకృష్ణ కిడ్నీ సమస్యతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహించాల్సి ఉండగా.. ఇదేరోజు గోపాలకృష్ణ కుమారుడు అఖిల్ టెన్త్ పరీక్షకు హాజరుకావాల్సి ఉంది. అయితే, బంధువులు మనోధైర్యం కల్పించడంతో పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష ముగిశాక తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. ఇదిలా ఉండగా, కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ (38) గ్రామ పంచాయతీలో పనిచేస్తున్నాడు. గతంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇటీవలే కోలుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. ఆయన చిన్న కూతురు స్రవంతి నస్రుల్లాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో బాధను దిగమింగి పరీక్ష రాసింది. అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది.



నిఖిలేశ్వర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నిఖిలేశ్వర్, గోపీ రచనలపై జాతీయ సెమినార్

రసూల్‌పురా: కథకునిగా, విమర్శకునిగా ప్రజాదృక్పథంతో రచనలు చేసిన నిఖిలేశ్వర్ దిగంబర విప్లవకవిగా ప్రసిద్ధి చెందారని దక్షిణ భారత హిందీ ప్రచార సభ మాజీ ప్రొఫెసర్ రిషబ్‌దేవ్ శర్మ అన్నారు. కేంద్రీయ హిందీ సంస్థాన్ ఆగ్రా ఆధ్వర్యంలో న్యూ బోయిన్‌పల్లిలోని హిందీ భవన్‌లో జాతీయ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు నిఖిలేశ్వర్, డాక్టర్ ఎన్.గోపీల రచనలపై రెండు రోజుల జాతీయ సెమినార్ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రిషబ్‌దేవ్ శర్మ మాట్లాడుతూ.. నిఖిలేశ్వర్ అసలు పేరు కుంభం యాదవరెడ్డి అని, గోల్కొండ పత్రికలో సబ్ ఎడిటర్‌గా, కేశవ్ మెమోరియల్ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించారన్నారు. 2020లో అగ్నిశ్వాస కవితా సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా నిఖిలేశ్వర్, గోపీలను ఘనంగా సత్కరించారు. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వీసీ విద్యుల్లత, కేంద్రీయ హిందీ సంస్థాన్ హైదరాబాద్ సెంటర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ గంగాధర్ వానోయి. హైదరాబాద్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ఆర్ఎం సరిజా, పలువురు కవులు, రచయితలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జర్నలిస్టులు ప్రజల గొంతుకగా పనిచేయాలి

- వియత్నాం జర్నలిస్టులు, అధికారుల శిక్షణా కార్యక్రమంలో గోయెల్



సాక్షి, హైదరాబాద్: వేగంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో మీడియా, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ల పాత్ర గతం కంటే కీలకమైందని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్‌గోయెల్ అన్నారు. నకిలీ వార్తల విస్తరణ జర్నలిజం సమగ్రతకు పెనుముప్పు అని హెచ్చరించారు. జర్నలిస్టులు ప్రజల గొంతుకగా పనిచేయాలని, మెరుగైన సమాజం దిశగా కృషి చేయాలని సూచించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ)లో వియత్నాం అధికారులకు 'జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్'అంశంపై ఏర్పాటు చేసిన రెండు వారాల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్సు మాన్యువల్‌ను విడుదల చేసి మాట్లాడారు. తప్పుడు సమాచారం, నకిలీ వార్తల విస్తరణ జర్నలిజం సమగ్రతకు, ప్రజల విశ్వాసానికి ముప్పని చెప్పారు. కచ్చితత్వం, నిష్పాక్షికత, నైతికత సూత్రాలను సమర్థించడం మీడియా బాధ్యత అని గోయెల్ అన్నారు. కేవలం వార్తలను నివేదించే దూతల మాదిరిగా కాకుండా నిష్పాక్షికమైన, ప్రజా ప్రయోజన సంభాషణకు ఫెసిలిటేటర్లుగా వ్యవహరించాలని కోరారు. సమాచార సంభాషణ సులభతరం చేయడం, జవాబుదారీతనం పెంపొందించడం, పారదర్శకతను ప్రోత్సహించడంలో మీడియా నిపుణుల పాత్ర చాలా కీలకమని శశాంక్ గోయెల్ వ్యాఖ్యానించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.